ninadam.in

తెలుగు దినపత్రిక

# నినాదం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం, డిసెంబర్ 21, 2025 | సంపుటి - 22 | సంచిక 89 | వెల - 7 | పేజీలు - 12 - 8

Published from Hyderabad, Vijayawada Circulated from TS and AP.. Hyderabad, Karimnagar, Khammam, Mahabubnagar, Nalgonda, Nizamabad, Warangal, Vijayawada, Guntur, Ongole, Nellore, Tirupathi, Kadapa, Ananthapur, Kurnool, Tadepalligudem, Rajahmundry, Visakhapatnam, Srikakulam

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

### పది రోజుల్లో అక్రిడిటేషన్ కార్డుల జీవో

- వచ్చే ఏడాది ఇళ్ల స్థలాల కేటాయింపు పై తీపి కబురు
- టీడబ్ల్యూజేఎఫ్ మహాసభలో మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటన

**ఖమ్మం, నినాదం:**

జర్నలిస్టుల చిరకాల వాంఛలైన అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. ఖమ్మం శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (TWJF) జిల్లా మహాసభలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాల వల్ల అత్యవసరంగా హైదరాబాద్ వెళ్లాల్సి రావడంతో మంత్రి ఫోన్ ద్వారా జర్నలిస్టులను ఉద్దేశించి ప్రసంగించారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకోబోయే కీలక నిర్ణయాలను ఈ సందర్భంగా వివరించారు.

**త్వరలో అక్రిడిటేషన్ కార్డులు**

రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదురుచూస్తున్న అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియ తుది దశకు చేరుకుందని మంత్రి పొంగులేటి తెలిపారు.

▸▸తరువాయి2లో..



### కేసీఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్

## శాసనసభాపక్షం భేటీ

- నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టులపై ప్రధానంగా చర్చ
- ఇదే అంశంపై ఉద్యమ కార్యాచరణకు బీఆర్ఎస్ సిద్ధం
- మీడియాతో మాట్లాడి వివరాలు వెల్లడించనున్న కేసీఆర్

తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు.

▸▸తరువాయి2లో..



## నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

- రేవంత్ ఎవరితో ఫుట్‌బాల్ ఆడినా అక్కర్లేదు
- రేవంత్ లాగా చిల్లర రాజకీయాలు చేయను
- కాంగ్రెస్‌లో ఓ కాలు..బీజేపీలో ఓ కాలు పెట్టింది రేవంత్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, నినాదం:**

రేవంత్.. ఎవరితో ఫుట్‌బాల్ ఆడుకుంటాడో నాకు తెలియదు... నేను మాత్రం రేవంత్ రెడ్డిని ఫుట్‌బాల్ ఆడుకుంటానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. రేవంత్ ఇంట్లోని మహిళలను, పిల్లలను, మనువడి గురించి నేను మాట్లాడను. రేవంత్ రెడ్డి మాదిరి కుటుంబ సభ్యుల విషయంలో నేను చిల్లర రాజకీయాలు చేయనన్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ కు హనీమూన్ ముగిసింది. ఇక కేసీఆర్ ప్రజల్లోకి వస్తారు .కేసీఆర్ ఆదివారంఅన్ని విషయాలపై దిశానిర్దేశం చేస్తారని అన్నారు.

▸▸తరువాయి2లో..

## ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

### ఎల్బీనగర్ క్రిస్మస్ వేడుకల్లో సీఎం రేవంత్ - అజ్మీర్ దర్గాకు సిఎం ఛాదర్ సమర్పణ



**హైదరాబాద్,డిసెంబర్20(నినాదం):**

ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి జరుపుకునే పండుగగా క్రిస్మస్.. ద్వేషించే వారికి కూడా ప్రేమించే గుణాన్ని ఏసు ప్రభువు మానవాళికి స్ఫూర్తిగా అందించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీకి కూడా డిసెంబర్ ఒక మిరాకిల్ మంత్‌గా మారిందని వ్యాఖ్యానించారు. రాజకీయంగా భారీ మూల్యం చెల్లించి, ఆంధ్రప్రదేశ్‌లో పార్టీకి నష్టం జరిగినప్పటికీ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించారని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అయితే, గతంలో సోనియా గాంధీ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్‌ను తీసుకొచ్చి పేదలకు భరోసా కల్పించారని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. ఈరోజు తెలంగాణలో తమ ప్రభుత్వం పేదలకు దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం అందిస్తున్నామని తెలిపారు.

▸▸తరువాయి2లో..

## ఉద్యోగ నియామకాల్లో జాప్యం తగదు

### జాబ్ క్యాలెండర్ ఉండాల్సిందే

**లేకుంటే యువత భవిష్యత్ దెబ్బతింటుంది | తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**






**పబ్లిక్ సర్వీస్ కమిషన్లు దేశ పరిపాలనా వ్యవస్థకు వెన్నెముకలని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. న్యాయమైన, పారదర్శక నియామకాల ద్వారానే ప్రజాసేవలో ప్రతిభకు స్థానం ఉంటుందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. రామోజీ ఫిల్మ్ సిటీలో ఏర్పాటు చేసిన 26వ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ల జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమంలో భట్టి విక్రమార్క పాల్గొన్నారు.**

**హైదరాబాద్,డిసెంబర్20(నినాదం):**

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. పరీక్షలకు వార్షిక జాబ్ క్యాలెండర్ తప్పనిసరని అన్నారు. ఉద్యోగ నియామకాల జాప్యం యువత భవిష్యత్తును దెబ్బతీస్తాయని.. ముందస్తు ప్రణాళికతోనే వారిలో విశ్వాసం పెరుగుతుందని చెప్పుకొచ్చారు. తెలంగాణ పీఎస్సీ విజయవంతంగా జాబ్ క్యాలెండర్ అమలు చేస్తోందని చెప్తూ కమిషన్ చైర్మన్, సభ్యులను రాష్ట్ర ప్రభుత్వం తరపున అభినందించారు. పారదర్శకతే పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ప్రాణమని.. ప్రశ్నాపత్రాల తయారీ నుంచి తుది ఎంపిక వరకూ ప్రతి దశ స్పష్టంగా ఉండాలన్నారు. ప్రశ్నాపత్రాల లీకేజ్‌లు ప్రజాసేవ విలువలకు విరుద్ధమని.. వాటిని కట్టడి చేసేందుకు ఆధునిక భద్రతా వ్యవస్థలు, నైతిక శిక్షణ అవసరమని సూచించారు. రిజర్వేషన్లు సంఖ్యలకే కాదని, వాస్తవిక ఫలితాలు ఇవ్వాలంటూ డిప్యూటీ సీఎం భట్టి చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు, పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం హాజరయ్యారు.



## రౌడీయిజం చేస్తే.. యోగీ బాట పడతాం

### కాలుకు కాలు..చేయికి చేయి తీస్తాం

- రాజకీయం చేయాల్సి వస్తే వెనక్కి తగ్గం
- ప్రజల కోసం కూటమిగా కలసి సాగుతున్నాం
- మీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు
- వైసీపీ నేతలకు డిప్యూటీ సీఎం పవన్ ఘాటు హెచ్చరిక
- పొట్టి శ్రీరాములు జలధార పథకానికి పెరవలిలో శ్రీకారం



**కాకినాడ, నినాదం:**

వైకాపా రౌడీలకు యోగి ఆదిత్యనాథ్ వంటి ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉందని డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్ హెచ్చరించారు. ప్రాజెక్టు ఎందుకు ఆలస్యమవుతుందంటూ వైకాపా నేతలు ఆరోపణలు చేస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడూ బెదిరింపులకు భయపడలేదు. దౌర్జన్యాలకు దిగుతూ మళ్లీ వస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారు. రెండు రోజులు కిరాయి గూండాలు, రౌడీల వివరాలు ఆరా తీస్తే పరిస్థితి తెలుస్తుంది. రౌడీలపై రాజకీయ నిర్ణయం తీసుకుంటే మళ్లీ ఇలాంటి మాటలు రావు. ఆరోపణలు చేసేవారిని హెచ్చరిస్తున్నా.. రాజకీయ నిర్ణయం వరకూ తీసుకెళ్లొద్దు. అధికారం ఉన్నా.. లేకపోయినా.. పవన్ ఎప్పుడూ పవన్‌లానే ఉంటాడని ఘాటు హెచ్చరికలు చేశారు.

## 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

- ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే ప్రక్రియ
- ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యం
- స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అనకాపల్లి, నినాదం:**

2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 86 మెట్రిక్ టన్నుల చెత్త ఉంచి పోయిందని.. అక్టోబర్ 2 నాటికి ఆ చెత్త తొలగించామని తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే ప్రక్రియ 100 శాతం పూర్తి చేస్తామని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఇందులో భాగంగా తాళ్ళపాలెంలో స్వచ్ఛాంధ్ర` స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం సమయంలో ప్రధాని తనకో బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు.

### విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతే లక్ష్యం

**తాళ్లపాలెంలో ముస్తాబుకు చంద్రబాబు శ్రీకారం**

**పిల్లల బంగారు భవిష్యత్తుకు తనది బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. అక్కడి గురుకుల పాఠశాలలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శనివారం ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేలా దీన్ని చేపట్టారు.**





### అమరజీవి జలధార ఆదర్శప్రాయం

- ఇంటింటికీ మంచినీటి కల సాకారం
- ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ అభినందన

**అమరావతి, నినాదం:**

'అమరజీవి జలధార'పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. ఇంటింటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేశారని వ్యాఖ్యానించారు.

### సంక్రాంతి కల్లా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

**ఇప్పటికే 28లక్షల34 వేల మెట్రిక్ టన్నులు పూర్తి**

**మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి**

## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

రాబోయే పది రోజుల్లోనే దీనికి సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (GO) విడుదల చేస్తామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందేలా చర్యలు తీసుకుంటామని ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.

**ఇళ్ల స్థలాలపై స్పష్టత**

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఇప్పటికే లోతుగా చర్చించామని మంత్రి పేర్కొన్నారు. గతంలో సుప్రీంకోర్టు ఉత్తర్వులు, న్యాయపరమైన చిక్కుల వల్ల కొంత ఆలస్యమైందని అయితే వాటన్నింటినీ అధిగమించి వచ్చే ఏడాది జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల విషయంలో ప్రభుత్వం తరపున తీపి కబురు అందిస్తామని ప్రకటించారు. జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడటం తమ ప్రభుత్వ బాధ్యతని ఆయన ఉద్ఘాటించారు.

**సమిష్టిగా ముందుకు సాగాలి**

టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా మహాసభలు ఘనంగా నిర్వహించుకోవడం పట్ల మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల హక్కుల కోసం పోరాడుతున్న సంఘం నాయకులను, సభ్యులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర, జిల్లా స్థాయి ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కేసీఆర్ అధ్యక్షతన నేడు బీఆర్ఎస్ శాసనసభాపక్షం భేటీ

**హైదరాబాద్,డిసెంబర్20(నినాదం):**

తెలంగాణ భవన్‌లో ఆదివారం బీఆర్ఎస్ శాసనసభాపక్షం, రాష్ట్ర కార్యవర్గం భేటీ కానుంది. పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో నేతలు సమావేశం కానున్నారు. ఇందులో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొననున్నారు. నదీ జలాలు, సాగునీటి ప్రాజెక్టుల అంశంపై పోరుకు బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. ఈ సమావేశంలో వీటిపై కేసీఆర్ ఉద్యమ కార్యాచరణ ప్రకటించనున్నట్లు సమాచారం. ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి తర్వాత గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక, స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన సమావేశాలు, పార్టీ నేతలతో సమావేశాలను కూడా కేసీఆర్ అక్కడి నుంచే నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ రెండేళ్లలో కేసీఆర్ ప్రజలకు కనిపించింది చాలా అరుదనే చెప్పుకోవాలి. అయితే తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం కేసీఆర్ రంగంలోకి దిగనున్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ అధినేత రానున్నారు.కేసీఆర్ అధ్యక్షతన రేపు మధ్యాహ్నం 2 గంటలకు బీఆర్ఎస్ఎల్పీ, రాష్ట్ర కార్యవర్గ సంయుక్త సమావేశం జరుగనుంది. నదీ జలాల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంపై కేసీఆర్ సమరశంఖం పూరించనున్నారు. తెలంగాణ సాగునీటి హక్కుల రక్షణ కోసం మరో ప్రజా ఉద్యమంపై మాజీ సీఎం దిశానిర్దేశర చేయనున్నారు. బీఆర్ఎస్ఎల్పీ సమావేశం తర్వాత కేసీఆర్ మీడియాతో మాట్లాడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పాలమూరు ` రంగారెడ్డి ప్రాజెక్టులో 45 టీఎంసీలకే కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకుందనేది బీఆర్ఎస్ వాదన. నదుల అనుసంధానం పేరుతో ఏపీ జలదోపిడీకి కేంద్రం సహకరిస్తోందని ఆ పార్టీ ఆరోపిస్తోంది. రాష్ట్రాల నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉన్నా నోరు మెదపటం లేదని కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పరిస్థితి. కాంగ్రెస్, బీజేపీలను తెలంగాణ సమాజం ముందు దోషిగా నిలబెడతామని బీఆర్ఎస్ చెబుతోంది. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ ప్రక్షాళనల పైనా కేసీఆర్ దృష్టి సారించారు. పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు కేసీఆర్ ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. కాగా.. చాలా రోజుల తర్వాత తమ అధినేత తెలంగాణ భవన్‌కు రానుండటంతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం**

**ఆధారాలు రాబట్టే యత్నాల్లో అధికారులు**

హైదరాబాద్ :

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు. వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశర చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు. గతంలో వారు ఇచ్చిన స్టేట్‌మెంట్లు, సాంకేతిక ఆధారాలు, డేటా విశ్లేషణ ఆధారంగా ప్రభాకర్ రావును సమగ్రంగా విచారిస్తున్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పాత్ర పోషించిన వ్యక్తిగా భావిస్తున్న ప్రణీత్ రావుతో కలిపి కూడా ప్రభాకర్ రావును సిట్ అధికారులు ప్రశ్నించనున్నారు. వీరిద్దరి మధ్య జరిగిన సంభాషణలు, ఆదేశాలు, అమలైన విధానం, రాజకీయ నేతలు, ఇతరుల ఫోన్ల ట్యాపింగ్ అంశాలపై స్పష్టత కోసం అధికారులు దృష్టి సారించినట్లు తెలుస్తోంది.

## బీఆర్ఎస్ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం ఏముంది

**కాంగ్రెస్ విమర్శలపై మండిపడ్డ కిషన్ రెడ్డి**

హైదరాబాద్ :

పసలేని, తెలివి తక్కువ వాళ్ళు బీఆర్ఎస్‌తో బీజేపీకి పొత్తు ఉందని మాట్లాడుతారని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కిషన్ రెడ్డి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. ఎవరితో బీజేపీ పొత్తు పెట్టుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ.. కేసీఆర్ ఆరోగ్య పరిస్థితిపై అడిగితే తప్పేంటి ప్రశ్నించారు. గతంలో సోనియా గాంధీ ఆరోగ్య పరిస్థితిపై కూడా అడిగారని గుర్తుచేశారు. పసలేని వాళ్లు తమ మీద ఆరోపణలు చేస్తే జవాబు చెప్పాల్సిన అవసరం లేదన్నారు.రాజకీయ విమర్శలు మాని ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని హితవుపలికారు. ఆదాయం వ్యక్తిగత అవసరాల కోసం జీహెచ్ఎంసీలో మునిసిపాలిటీలు , కార్పొరేషన్ల విలీనం చేశారని.. దీనిపై మొదటి నుంచి బీజేపీ అభ్యంతరం చెబుతోందన్నారు. గ్రామాల్లో గెలిచిన సర్పంచ్‌లను డబ్బు ఆశ , ఇతర అంశాలను సాకుగా చూపి కాంగ్రెస్‌లోకి రావాలని కోరుతున్నారని మండిపడ్డారు. గ్రామ పంచాయితీలకు రాష్ట్ర ప్రభుత్వం చేసేది ఏం ఉండదన్నారు. గ్రామంలోని ప్రతి అభివృద్ధికి కేంద్ర నిధులే ప్రధానమని స్పష్టం చేశారు.



## ప్రేమించే గుణాన్ని పంచిన ఏసు ప్రభువు

అలాగే, విద్య, వైద్యం లాంటి కీలక సేవలను ప్రభుత్వంతో సమానంగా క్రిస్టియన్ మిషనరీలు కూడా పేదలకు అందిస్తూ, సమాజ సేవలో కీలక పాత్ర పోషిస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రశంసించారు. క్రిస్మస్ పండుగ ప్రేమ, సేవ, త్యాగాలకు ప్రతీకగా నిలుస్తుంది.. ఆ విలువలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఇదిలా వుంటే అజ్మీర్ షరీఫ్ దర్గాకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చాదర్ సమర్పించారు. ఈ క్రాయక్రమంలో మంత్రులు అజారుద్దీన్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, వేం నరేందర్ రెడ్డి,ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు, ఫహీం ఖురేషీ, తెలంగాణ హజ్ కమిటీ చైర్మన్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, మైనారిటీ నాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ముస్లిం మైనారిటీ నేతలు హాజరయ్యారు..

## బీఆర్ఎస్‌తో కాంగ్రెస్ కుమ్మక్కు

**అందుకే అవినీతి కేసుల్లో విచారణలు పక్కదారి**

**మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, నినాదం:**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌లపై కేంద్ర హోం శాఖ సహాయక మంత్రి, బీజేపీ నేత బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పాలన.. అవినీతిమయంగా, దరిద్రంగా ఉందని ఆయన ధ్వజమెత్తారు. తల నరికినా.. పైసా లేదని సీఎం రేవంత్ అంటున్నారని.. అందువల్లే ఇక్కడి ప్రజలు ఆంధ్రప్రదేశ్‌లాగే డబుల్ ఇంజిన్ సర్కారును కోరుకుంటున్నారని విమర్శించారు. ఈసారి ఎన్నికలు ఎప్పుడొచ్చినా అధికారం తమదేనని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఈసారి ఎప్పుడు ఎన్నికలు వచ్చినా.. తెలంగాణలో సొంతంగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం. బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని పదేళ్ల నుంచి అంటున్నారు. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ కలిసి పోటీ చేయలేదు. కానీ, కాంగ్రెస్ పార్టీతో కలిసి బీఆర్ఎస్ బరిలో దిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే.. అవినీతికి పాల్పడిన కేసీఆర్‌ను జైలుకు పంపుతానన్న రేవంత్ రెడ్డి మాటలు ఏమైయ్యానని నిలదీసారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కేసీఆర్‌ను జైలుకు పంపారా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతిలో జైలుకు పంపారా? డ్రగ్స్ కేసులో జైలుకు పంపారా? ఫాం హౌస్ కేసులో జైలుకు పంపారా? కాంగ్రెస్, బీఆర్ఎస్ దోస్తులు కాబట్టే కేసీఆర్ ఫ్యామిలిలో ఎవరినీ జైలుకు పంపలేదని ఇరు పార్టీలపై బండి సంజయ్ ధ్వజమెత్తారు .కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు. ఎన్నికలలో ఓడిన తర్వాత కేసీఆర్ ఎక్కడా కనబడలేదని.. అయితే ఫామ్ హౌజ్ లేదా యశోదా ఆసుపత్రిలో మాత్రమే కనిపిస్తున్నారని చెప్పుకొచ్చారు. ఫామ్ హౌజ్ పాలను తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదన్న ఆయన.. పంచాయితీ ఎన్నికల్లో తమ పార్టీకి గతంలో 100 సీట్లు వస్తే.. ఇప్పుడు 600కు పైగా స్థానాలొచ్చాయన్నారు. లీకు వీరులు అన్ని పార్టీల్లోనూ ఉన్నారని ఈ సందర్భంగా కౌంటర్ వేశారు.ఆంధప్రదేశ్ లో కూటమి పాలన అద్భుతంగా సాగుతోందని బండి సంజయ్ కొనియాడారు. 'ఏపిలో కూటమి పాలనకు వందకు వంద మార్కులు పడతాయి. ఈ విషయంలో అనుమానాలున్నవారు మూర్ఖులు. అలాంటి వారు ఆసుపత్రికి వెళ్లి ట్రీట్మెంట్ తీసుకోవాలి. ఏపిలో అభివృద్ధిపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది' అని కూటమి పాలనపై ప్రశంసలు కురిపించారు.

## రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు

**పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్య పెంపుదల**

**ఆదేశాలు జారీ చేసిన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర**

హైదరాబాద్, నినాదం: రాష్ట్రంలో వైద్య విద్య ప్రమాణాల పెంపు, పరిశోధనలకు పెద్దపీట వేస్తూ వైద్యారోగ్య శాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో పీజీ, సూపర్ స్పెషాలిటీ సీట్ల సంఖ్యను పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ కాలేజీల పనితీరుపై ఎంసీఎంసీ కమిటీలు ఇకపై ప్రతి నెలా నివేదికలు ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే విద్యార్థులకు భాషాపరమైన ఇబ్బందులు లేకుండా 'స్పోకెన్ ఇంగ్లీష్'లో శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. ఎంబీబీఎస్ ఫస్ట్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ క్లాసులు నిర్వహించడంతో పాటు, ఇందు కోసం ప్రత్యేక టీచర్ల నియామకానికి మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ప్రైవేటు కాలేజీల్లో కన్వీనర్ కోటా విద్యార్థుల నుంచి హాస్టల్, మెస్ పేరుతో అదనపు ఫీజుల వసూళ్లపై నిఘా పెంచాలని ఆదేశించారు. అలాగే ప్రైవేట్ కాలేజీల్లో విద్యార్థుల ఆర్థిక ఇబ్బందులు, యాజమాన్యాల తీరుపై అధ్యయనానికి ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మెడికోల ఆత్మహత్యల నివారణకు కాలేజీల్లో సైకాలజిస్టులు, సైకియాట్రిస్టులతో కౌన్సెలింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. పెరిగిన కాలేజీలకు అనుగుణంగా కాళోజీ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జామినేషన్ బ్రాంచ్ పటిష్టం చేయడంతో పాటు సిబ్బంది పెంపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. అంతేకాకుండా హెల్త్ యూనివర్సిటీ సేవలను వేగవంతం చేసేలా కార్యకలాపాలన్నీ పూర్తిస్థాయిలో డిజిటలైజేషన్ చేయాలని నిర్ణయించారు. అన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో డిజిటల్ క్లాస్ రూమ్స్, లైబ్రరీలు, స్కిల్ ల్యాబ్స్ ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ సూచనలు చేశారు.

## బెంగాల్లో మహా జంగిల్ రాజ్

**చొరబాటుదారులకు అండగా మమత**

**విరుచుకు పడ్డ ప్రధాని మోదీ**

కోల్‌కతా, :

తృణమూల్ కాంగ్రెస్ సారథ్యంలోని పశ్చిమబెంగాల్ ప్రభుత్వంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. చొరబాటుదారులను కాపాడుకునేందుకు స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను మమతా బెనర్జీ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, బెంగాల్‌లో చొరబాటుదారులకు టీఎంసీ ప్రాపకం లభిస్తోందని విమర్శించారు. తహెర్‌పూర్‌లో శనివారంనాడు జరిగిన ర్యాలీని ఉద్దేశించి ఫోనులో ప్రధాని మాట్లాడుతూ, పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ 'మహా జంగిల్ రాజ్'కు బీజేపీ చరమగీతం పాడుతుందని చెప్పారు. అవినీతి, ఆశ్రితపక్షపాతం, బుజ్జగింపు రాజకీయాలు రాష్ట్రాన్ని ఏలుతున్నాయని ఆరోపించారు. 'వాళ్లు బీజేపీని ఎంత గట్టిగానైనా వ్యతిరేకించనీయండి. కానీ పశ్చిమబెంగాల్ అభివృద్ధిని ఎందుకు అడ్డుకుంటున్నారో నాకయితే అర్థం కావడం లేదు. మీరు మోదీని వ్యతిరేకించండి, కానీ ప్రజల సంతోషాన్ని అడ్డుకోకండి. ప్రజల హక్కులను కాలరాయకండి. వారి కలలను చెల్లాచెదురు చేసే పాపానికి ఒడికట్టకండి. బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వమని పశ్చిమబెంగాల్ ప్రజలకు ముకుళిత హస్తాలతో వేడుకుంటున్నాను' అని మోదీ విజ్ఞప్తి చేశారు. కాగా, వాతావరణ ప్రతికూలత కారణంగా మోదీ హెలికాప్టర్ తహెర్‌పూర్‌లో దిగలేకపోయింది. దీంతో ఆయన కోల్‌కతా విమానాశ్రయానికి తిరిగి వెళ్లిపోయారు. పశ్చిమబెంగాల్‌లోని నదియా జిల్లా రణఘాట్‌లో పలు అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. వీటిలో రూ.3,200 కోట్లతో నిర్మించనున్న రెండు జాతీయ రహదారి ప్రాజెక్టులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులు కోల్‌కతాను సిలిగురితో అనుసంధానిస్తూ సుమారు రెండు గంటల ప్రయాణ సమయం ఆదా చేస్తాయని పీఎంఓ తెలిపింది. ఈ ప్రాజెక్టులతో ఆర్థిక కార్యకలాపాలు విస్తృతం కావడంతో పాటు పర్యాటకం కూడా పెరుగుతుందని

## పొగమంచు..ప్రతికూల వాతావరణం

**మోడీ హెలికాప్టర్ వెనక్కి మళ్లింపు**

కోల్‌కతా : పశ్చిమ్ బెంగాల్ లోని ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌ను అధికారులు దారి మళ్లించారు . షెడ్యూల్ ప్రకారం, మోదీ శనివారం ఉదయం 10:30 గంటలకు నేతాజీ సుభాశ్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగి, 11:15 గంటలకు హెలికాప్టర్ ద్వారా తాహెర్‌పుర్‌కు చేరుకోవాల్సి ఉండగా.. పొగ మంచు, అననుకూల వాతావరణం ఆటంకం కలిగించాయి. ఫలితంగా ఆయన అదే హెలికాప్టర్‌లో కోల్‌కతాకు తిరిగి వెళ్లాల్సి వచ్చింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకూ మోదీ అక్కడే వేచి చూశారని అధికారులు తెలిపారు. దీంతో ఆయన పర్యటన ఆలస్యమైనట్టు పేర్కొన్నారు. నాదియా జిల్లాలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మోదీ పాల్గొని.. రూ.3,200 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించాల్సి ఉంది. దీంతో పాటు ఎన్‌హెచ్`34లోని బరజగులి`కృష్ణానగర్ సెక్షన్‌లో 66.7 కి.మీ నాలుగు లేన్ల విస్తరణ, ఉత్తర 24 పరగణాల జిల్లాలో అదే రహదారిలోని 17.6 కి.మీ. బరసత్`బరజగులి సెక్షన్‌లో నాలుగు లేన్ల నిర్మాణానికి శంకుస్థాపనలు చేయాల్సి ఉంది. ఈ ప్రాజెక్టులు కోల్‌కతా, సిలిగురి(ఐనీªఖజీబిజీ జీనిట ªాత్తిªతిణబీసతి) మధ్య కీలక అనుసంధాన లింకులుగా పనిచేయనున్నాయి. అయితే.. ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ఆయన అక్కడకు వెళ్లలేకపోయారు. ప్రత్నామ్నాయంగా రోడ్డు మార్గాన వెళ్లాలనుకున్నా.. ఇతర షెడ్యూళ్లకు అంతరాయం కలిగే అవకాశం ఉంది.

# పంచాయితీ ఫలితాలో రేవంత్ డంగ్

**ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు డౌటే**

**కెసిఆర్ ఫీల్డ్‌లోకి రాకున్న అద్భుత ఫలితాలు**

**తాండూరు నియోజకవర్గ సర్పంచ్‌లతో కెటిఆర్**

హైదరాబాద్ :

ప్రస్తుత పంచాయితీ ఫలితాలు చూశాక, ఎంపిటిసి, జడ్పిటిసి ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.సర్పంచ్ ఎన్నికల ఫలితాలు చూసి ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పెడతారని అనుకోవడం లేదు.. పంచాయతీ ఎన్నికల ఫలితాల విషయంలో రేవంత్ రెడ్డి మీడియా సమావేశంలో ఐదు నిమిషాలకే మాట మార్చారు అని పేర్కొన్నారు. పంచాయతీ ఎన్నికల్లో కేసీఆర్ కాలు బయట పెట్టకపోయినా గులాబీ సైనికులు అద్భుతంగా పోరాడారు, ప్రభుత్వం భయపడే పరిస్థితి వచ్చింది అని కేటీఆర్ అన్నారు. తమకు ఉన్న హక్కులు, నిధులు, విధుల గురించి కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లు తెలుసుకోవాలని కేటీఆర్ సూచించారు. రాజ్యాంగం ప్రకారం ఐదంచెల్లో ప్రభుత్వాలు ఉన్నాయని తెలిపారు. గ్రామ పంచాయతీలకు ఇచ్చే నిధులు సొంత ఆస్తులు, డబ్బులు కావని పేర్కొన్నారు. నాన్స్ కమిషన్ ద్వారా జనాభా ప్రాతిపదికన నిధులు ఇస్తారని వివరించారు. బీఆర్ఎస్ హయాంలో నాన్స్ కమిషన్ ద్వారా రూపాయి వస్తే.. మరో రూపాయి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిందని కేటీఆర్ తెలిపారు. గ్రామ పంచాయతీలకు పథకాలను ఆపే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. తాండూర్ నియోజకవర్గంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. ఈ ప్రభుత్వానికి ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టే దమ్ము లేదని కేటీఆర్ విమర్శించారు. మాకే నిధులు ఇవ్వడం లేదని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే డైరెక్ట్‌గా చెప్పిండని గుర్తు చేశారు. నిధులు ఇవ్వాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే వరల్డ్ బ్యాంకుకు లేఖ రాసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న చోట అభివృద్ధి అనేది ఉండదని అన్నారు. కేసీఆర్ హయాంలో డంపింగ్ యార్డ్‌లు, పల్లె ప్రకృతి వనాలు, క్రీడా మైదానాలు ఏర్పాటు చేశారని తెలిపారు. దీనివల్ల 21 జాతీయ పంచాయతీ అవార్డులను తెలంగాణ సాధించిందని చెప్పారు. పార్లమెంట్ ఎన్నికలు గెలవడం సులభం.. కానీ పంచాయతీ ఎన్నికల్లో గెలవడమే కష్టమని కేటీఆర్ తెలిపారు. ఈ రెండేళ్లు మనకు కష్టంగా ఉంటుందని కొత్తగా ఎన్నికైన బీఆర్ఎస్ సర్పంచ్‌లతో అన్నారు. రేవంత్ సర్కార్ అన్ని వర్గాలను మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. షాపుల యూరియా ఇవ్వనోడు.. యాప్‌ల యూరియా ఇస్తాడంట అని ఎద్దేవా చేశారు. 2014 నాటికి తెలంగాణ అప్పు రూ.72 వేల కోట్లుగా ఉందని తెలిపారు. 2023 నాటికి తెలంగాణ అప్పు రూ.మూడున్నర లక్షల కోట్లు అయ్యిందని అన్నారు. అంటే.. బీఆర్ఎస్ హయాంలో రూ.2.80 లక్షల కోట్ల అప్పు చేశారని వివరించారు. అంటే కేసీఆర్ చేసిన మొత్తం అప్పు రూ.2.80 లక్షల కోట్లే అని తెలిపారు. అదే రేవంత్ రెడ్డి అప్పు తెచ్చి ఏంచేసిండో చెప్పాలని డిమాండ్ చేశారు. త్వరలోనే మున్సిపల్ ఎన్నికలు రాబోతున్నాయని కేటీఆర్ తెలిపారు. తాండూరులో ఉండే 36 వార్డుల్లో ఇప్పటి నుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు కోసం ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని అన్నారు.తాండూరు నియోజకవర్గం నూతన సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులకు సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై కేటీఆర్, తలసాని శ్రీనివాస్ యాదవ్ వారిని సన్మానించారు. కాంగ్రెస్ ఎక్కడ ఉంటే అక్కడ ప్రోగ్రెస్ ఉండదు.. రెండేళ్లు మనకు కష్టాలు తప్పవు అని సెటైర్లు వేశారు. అయితే, కారు గుర్తు ఉండి, కేసీఆర్ గుర్తుకు వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోండి అని కేటీఆర్ తెలిపారు. రెండేళ్లు బీఆర్ఎస్ కు పరీక్ష కాలం.. కాంగ్రెస్ వాళ్లు ఏమైనా అంటే తలదించుకుని వెళ్లండి, రెండు అడుగులు వెనక్కు వెళ్లండి అని సూచించారు. పంచాయతీలకు డబ్బులు కేంద్ర ప్రభుత్వం నుంచి నేరుగా వస్తాయి, ఎవరి ప్రమేయం ఉండదన్నారు. బీఆర్ఎస్ సర్పంచులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వమని ఓ కాంగ్రెస్ ఎమ్మెల్యే అంటున్నారు.. ఇందిరమ్మ ఇండ్లు, పెన్షన్లు ఇలా అన్నింటి జాబితా పంచాయతీల్లో పెట్టాల్సిందే.. సర్పంచులు, పంచాయతీల చేతిలోనే ఉంటుంది.. నిధులు రావడం లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యేలే చెప్తున్నారు.. కాంగ్రెస్ చేతిలో మోసపోని వారంటూ ఎవరూ లేరు, అందరూ బాధపడుతున్నారు.. జనవరి, ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు వస్తాయని అంటున్నారు.. ఇప్పటి నుంచే సిద్ధం కావాలి.. గ్రామీణ ప్రాంతాల వారికి మున్సిపల్ ఎన్నికల బాధ్యతలు అప్పగించండి అని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు.

# నేనైతే రేవంత్‌తో ఫుట్‌బాల్ ఆడుకుంటా

ఈ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై కేటీఆర్ మరోసారి ర్ అయ్యారు. రేవంత్ రెడ్డి సర్కార్‌కి హనీమూన్ ముగిసిందంటూ ఆయన ఎద్దేవా చేశారు. శనివార తెలంగాణ భవన్ లో ఆయన మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. ఈ సంధ్బంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. లోకల్ బాడీ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ మెంబర్ షిప్ కార్యక్రమం ఉంటుంది. కేసీఆర్ బహిరంగ సభలపై రేపటి సమావేశంలో నిర్ణయం ఉంటుంది. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలు...కాంగ్రెస్ పార్టీ ఆఫీస్ లో ప్రెస్ మీట్ పెట్టి.. బీఆర్ఎస్ లోనే ఉన్నామనటం పెద్ద కామెడీగా ఉంది. పంచాయతీ ఎన్నికల విషయంలో రేవంత్ చెప్తోన్న 66శాతం నిజమైతే.. పది మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి బైపోల్స్ కు రావాలి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెండ్ గా నేను ఫెయిల్ కాదు. నేను వర్కింగ్ ప్రెసిడెంట్ అయ్యాక32జిల్లా పరిషత్, 136మున్సిపాలిటీలు గెలిచాము. రేవంత్ సీఎం అయ్యాక.. సొంత పార్లమెంట్ స్థానాన్ని కూడా గెలిపించలేదు. నేను ఐరన్ లెగ్ కాదు.. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీలే ఐరన్ లెగ్‌లు. పంచాయతీ ఎన్నికల దెబ్బకు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించరు. మొదట మున్సిపల్ ఎన్నికలు నిర్వహిస్తారు. అలానే గ్రేటర్‌లో మున్సిపాలిటీల విలీనం సక్రమంగా జరగలేదు. జీహెచ్ఎంసీని మూడు కార్పోరేషన్లు చేయాలనేది రేవంత్ రెడ్డి ఆలోచనగా ఉంది. అయితే గ్రేటర్ ఎన్నికలు ఎప్పుడు పెట్టాలనే దానిపై కూడా సీఎంకు స్పష్టత లేదు. 2028లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుంది.ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఏమీ లేదని రేవంత్ కు అర్థమైంది. రేవంత్ పాలనకు పంచాయతీ ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కాంగ్రెస్ పాలన దెబ్బకు పరిశ్రమలు ఆంధ్రకు వెళ్ళిపోతున్నాయి. విరూపాక్ష అనే కంపెనీ కర్నూలుకు వెళ్లింది. కాంగ్రెస్ పాలనపై ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. టైమ్ కోసం ఎదురు చూస్తున్నారు. సరైన సమయంలో కాంగ్రెస్ కు, రేవంత్ రెడ్డికి ప్రజలు సరైన తీర్పు ఇస్తారు. ఇక 42శాతం రిజర్వేషన్లు పార్టీ పరంగా ఇవ్వమని చెప్పటానికి రేవంత్ ఎవరు?. మేము పార్లమెంట్ ఎన్నికల్లో 50శాతం, అసెంబ్లీ ఎన్నికల్లో 30శాతం సీట్లు బీసీలకు ఇచ్చాము.

ఆయన నుంచి నేర్చుకోవాల్సిన అవసరం మాకు లేదు. మార్కెట్ యార్డ్ లు బీసీలకు ఇచ్చాము. అలానే విద్యా, ఉపాధిలో బీసీలకు రిజర్వేషన్లు ఎందుకు ఇవ్వరని అన్నారు. అఖిలేష్ యాదవ్ తో ఫ్రెండ్లీగా ఉంటే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావుకు బాధ ఎందుకన్నారు.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీకి మాత్రమే లోపాయికారి ఒప్పందం ఉంది. తెలంగాణ కాంగ్రెస్ కు ఏటీంగా మారిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా స్వయంగా అన్నారు. ఢిల్లీలో బీజేపీ ఎంపీ దుబే గృహప్రవేశానికి తెలంగాణ సీఎం ఎందుకు వెళ్లారో రామచంద్ర




రావు చెప్పాలి. ఢిల్లీలో రేవంత్ రెడ్డి విందులు, వినోదాలు ఎవరి ఇళ్ళల్లో జరుగుతున్నాయో మాకు తెలుసు. దేశ రాజధాని ఢిల్లీలోని తుగ్లక్ రోడ్ లో రేవంత్ రెడ్డి ఇల్లు రీమోడల్ చేయించిందే బీజేపీ ఎంపీనే. తెలంగాణ సీఎం రేవంత్ .. ఒక కాలు కాంగ్రెస్ లో.. మరొక కాలు బీజేపీలో ఉంచారు. కిషన్ రెడ్డితో మాకు అండర్ స్టాండిరగ్ ఉందని అంటున్నారు. కిషన్ రెడ్డి మాకు చేసింది ఏంటో చెప్పాలి' అంటూ కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శించారు.

# పావని కన్స్ట్రక్షన్ ఆక్రమణలపై అధికారులకు మమకారం ఎందుకో : ఆకుల సతీష్



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి మండలం నిజాంపేట గ్రామం సర్వేనెంబర్ 331లో పావని కన్స్ట్రక్షన్ 23 అంతస్థుల 8 వేల పైచిలుకు గజాలలో హెచ్ఎండిఏ నుంచి మాన్యువల్ అనుమతులు తీసుకున్నారు. నిర్మాణంలో సర్వే నెంబర్ 334లో ప్రభుత్వ భూమి 2,700 గజాలు, నాలా, బండ్లబాటను ఆక్రమించుకొని అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు చేసిన గత రంగారెడ్డి జిల్లా మేడ్చల్ జిల్లా ఇన్చార్జ్ ఏడి సర్వే శ్రీనివాస్( ఏసీబీ పట్టుకున్న) తప్పుడు రిపోర్టు ఇవ్వడమే కాకుండా, చర్యలు తీసుకోకుండా ప్రస్తుత కలెక్టర్ కార్యాలయం సహకరించడంపై ఎమ్మార్వో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆకుల సతీష్ మాట్లాడుతూ సర్వేనెంబర్ 331 , నిజాంపేట్ లో 8878 స్క్వేర్ మీటర్లలో లో భారీ భవన్ నిర్మాణానికి(23 అంతస్తుల) హెచ్ఎండిఏ మాన్యువల్ అనుమతులు టిఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో 2022 లో అనుమతులు రావడానికి కారణం నిర్మాణ వెనుక బడా బిఆర్ఎస్ నేతలు ఉండడమే. నిర్మాణం జరుగుతున్న వాస్తవ పరిస్థితులను చూస్తే వారి సర్వే నెంబర్లు 331 దాటుకొని ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 334 నందు ఆక్రమించుకొని(2700 స్క్వేర్ యార్డ్స్) నాలా ఆక్రమణ, బండ్లబాట ఆక్రమించుకొని అక్రమ అనుమతులు పొందారు. ఈ అక్రమ అనుమతులపై గతంలోనే మేము ఫిర్యాదు చేయగా హెచ్ఎండిఏ కొన్ని రోజులు పని ఆపేసిన మళ్లీ నిర్మాణ అనుమతులకు లైన్ క్లియర్ చేసింది. దీనికి ముఖ్యమైన కారణం గతంలో రంగారెడ్డి జిల్లా ఎడి సర్వేయర్ శ్రీనివాస్ మేడ్చల్ జిల్లాకు ఇన్చార్జిగా ఉన్న సమయంలో ప్రభుత్వ భూమి, నాలా, బండ్లబాట ఆక్రమణలేదని తప్పుడు ఎడి సర్వే రిపోర్టు ఆధారంగా నిర్మాణ పనులకి సపోర్టింగ్ గా రిపోర్ట్ తయారుచేసి ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు ఎడి సర్వే రిపోర్ట్ ఆధారంగా ప్రస్తుతం అక్రమ నిర్మాణ పనులపై తక్షణమే పూర్తిస్థాయిలో మళ్లీ అన్ని డిపార్ట్మెంట్ లతో జాయింట్ సర్వే చేసి, ప్రభుత్వ భూమిని గుర్తించి కాపాడాలని, అనుమతులకు విరుద్ధంగా ప్రభుత్వ భూమి ఆక్రమించుకొని గత 2 సంవత్సరంలుగా నిర్మాణ పనులు జరుగుతున్న మున్సిపల్, రెవెన్యూ , ఇరిగేషన్ అధికారులు గతంలో మేము ఫిర్యాదు చేసిన చర్యలు తీసుకోకుండా సహకరిస్తున్నట్టుగానే కనిపిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కలెక్టర్ కార్యాలయం నుంచి పావని కన్స్ట్రక్షన్ కి అక్రమన సక్రమం చేసే విధంగా మేము ఫిర్యాదు చేసిన పట్టించుకోకుండా చక్కబట్టే పనులు చేయడంపై ప్రభుత్వం, హైడ్రా దృష్టి సారించాలని, పావని కన్స్ట్రక్షన్ ప్రభుత్వ భూమి ఆక్రమణ పై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని, సర్వే చేసి ప్రభుత్వ భూమి/నాలా /బండ్లబాట గుర్తించాలని కోరారు. నిర్మాణం దాదాపు 15 అంతస్తులు పూర్తయినందున తక్షణమే నిర్మాణ పనులు నిలుపుదల చేయడమే కాకుండా, ప్రభుత్వ భూములో భవన నిర్మాణాన్ని కూల్చేయాలని, ప్రభుత్వ భూమి ఆక్రమించుకున్నట్టు స్పష్టంగా కనిపిస్తున్నందున తక్షణ క్రిమినల్ కేసులు నమోదు చేయాలి అని వినతిపత్రంలో సూచించారు. తప్పుడు రిపోర్ట్ ఈచ్చిన రంగారెడ్డి జిల్లా ఎడి సర్వేయర్ శ్రీనివాస్ పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ప్రభుత్వ భూమి ఆక్రమణ చేసిన పావని కన్స్ట్రక్షన్ అనుమతులు రద్దు చేయాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో చందు, అరుణ్ రావు, శ్రీనివాస్, పాల్గొన్నారు.








# బాలికల ఆరోగ్య పరిరక్షణే ఐసీడీఎస్ లక్ష్యం

**ఐసిడీఎస్ సెక్టార్ సూపర్వైజర్ నిహారిక**

**మహాముత్తారం, డిసెంబర్ 20(నినాదం):** బాలికల ఆరోగ్యం, విద్యతో పాటు సురక్షిత వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఐసిడిఎస్ ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందని ఐసీడీఎస్ మహాముత్తారం సెక్టార్ సూపర్వైజర్ నిహారిక అన్నారు. గర్ల్ చైల్డ్ ఎంపవర్మెంట్ అండ్ అడల్సెంట్ సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా మహాముత్తారం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ కార్యక్రమాలు భారతదేశంలో బేటీ బచావో బేటీ పఢావో , కిషోరి శక్తి యోజన వంటి పథకాల ఆధారంగా రూపొందించబడ్డాయనీ, తెలంగాణలో ఐసి అంగన్వాడీ కేంద్రాలు, స్కూళ్ల ద్వారా అమలు చేయబడుతున్నాయన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేందర్ మాట్లాడుతూ బాలికల జీవిత రక్షణ, లింగ సమానత్వం, ఆరోగ్య విద్యను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యాలుగా పనిచేస్తాయని, బాలికల జనన సంఖ్యా నిష్పత్తిని మెరుగుపరచడం, డ్రాప్ఔట్లను తగ్గించడం వంటివి ఇందులో చేరతాయని, తల్లిదండ్రులు, సమాజంలో బాలికల విలువలను పెంచే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అనంతరం హార్ట్ ఫుల్ నెస్ కార్యక్రమంలో భాగంగా మెడిటేషన్ ద్వారా లాభాలను వివరిస్తూ, పాఠశాల విద్యార్థులకు మెడిటేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్ టీం మెంబర్లు, పాఠశాల ఉపాధ్యాయులు ప్రకాష్,దేవేందర్ దేవ్సింగ్, జాటోత్ రామ్ సింగ్, భూక్యా మంజుల విద్యార్థులు పాల్గొన్నారు.



# పేదింటి పెళ్లికి కల్యాణ లక్ష్మీ పథకం భరోసా



**కీసర, డిసెంబర్ 20, (నినాదం) :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గం ఇంచార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ పథకాలు పేదింటి ఆడబిడ్డల పెళ్లికి ఎంతో భరోసానిస్తున్నాయని అన్నారు. ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని శివారెడ్డిగూడ బంధన్ ఫంక్షన్ హాల్లో ఉమ్మడి ఘట్కేసర్, కీసర, శామీర్పేట్, మేడ్చల్ మండలాల లబ్ధిదారులకు మంజూరైన కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కులను ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, మేడ్చల్ మల్కాజ్గిరి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ, పేద కుటుంబాల్లో పెళ్లి ఖర్చుల భారం తగ్గించేందుకే రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాలను అమలు చేస్తోందని, మహిళల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మలపల్లి నర్సింహులు యాదవ్, జిల్లా ఆర్టీఏ మెంబర్ తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మేడ్చల్ నియోజకవర్గం ఏ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మున్సిపల్, కార్పొరేషన్ అధ్యక్షులు, మాజీ మేయర్లు, చైర్మన్లు, డిప్యూటీ మేయర్లు, కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేసుల పరిష్కారానికే కొత్త కోర్టుల ఏర్పాటు

**స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు అభినందనీయం**

**హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్**




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (నినాదం):** రోజురోజుకు పెండింగ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో పెద్ద ఎత్తున కేసుల పరిష్కారానికి కొత్తగా కోర్టులు ఏర్పాటు చేయడం జరిగిందని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు నూతనంగా శాంక్షన్ అయిన రెండు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులను శనివారం ఆయన వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జ్యూడిషల్ ఉద్యోగుల శారీరక, మానసిక ఆరోగ్యం బాగున్నప్పుడే విధులు సక్రమంగా నిర్వహిస్తారని అందుకోసం మూడు జిల్లాల న్యాయ శాఖ ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ ఏర్పాటు చేయడం అభినందించదగిన విషయం అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్ సమీపంలో ఏర్పాటు చేసిన కోర్టులను, అంబేద్కర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన క్రీడలను వారు ప్రారంభించారు. హై కోర్టు న్యాయమూర్తి, మూడు జిల్లాల అడ్మినిస్ట్రేటివ్ జడ్జి ఈ. వి. వేణుగోపాల్ హై కోర్టు న్యాయమూర్తులు నామవరపు రాజేశ్వర్ రావు , బి. ఆర్. మధుసూదన్ రావు హై కోర్టు చీఫ్ జస్టిస్ తో కలిసి వర్చ్యువల్ కార్యక్రమంలో అతిధులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సిహెచ్ రమేష్ బాబు , ములుగు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. వి. పి సూర్య చంద్రకల , మహబూబాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి మొహమ్మద్ అబ్దుల్ రఫీ, న్యాయమూర్థులు ఏ. నాగరాజ్, కన్నయ్య లాల్, ఎస్. ఆర్. దిలీప్ కుమార్ నాయక్, జి. అఖిల, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు వి. శ్రీనివాస చారి, ప్రధాన కార్యదర్శి వి. శ్రవణ్ రావు, గవర్నమెంట్ ప్లీడర్ బొట్ల సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



# మిర్యాలగూడలో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ బృందం ఆకస్మిక తనిఖీలు

**మిర్యాలగూడలో నకిలీ కంటి వైద్యుల బాగోతం బట్టబయలు.**

**8 మంది కంటి డాక్టర్లకు షోకాస్ నోటీసులు**

**నల్లగొండ ప్రతినిధి డిసెంబర్ 20( నినాదం) :** తెలంగాణ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డా. కె. మహేష్ కుమార్, రిజిస్ట్రార్ డా. డి. లాలయ్య కుమార్ ఆదేశాల మేరకు మిషన్ మిర్యాలగూడ ఎగ్రైనెస్ట్ క్వాకరీ లో భాగంగా సభ్యులు డా. వి. నరేష్ కుమార్, డా. కె. రవి కుమార్, డా. జె. శ్రీకాంత్ వర్మ విజిలెన్స్ అధికారి ఎం. రాకేష్ల బృందం శనివారం మిర్యాలగూడ పట్టణంలోని పలు కంటి ఆసుపత్రులు నకిలీ వైద్యులపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మొత్తం 8 కేంద్రాలను పరిశీలించగా, ఏ ఒక్క కంటి ఆసుపత్రిలో కూడా అర్హత గల కంటి వైద్య నిపుణులు లేకపోవడం గుర్తించి అధికారులు విస్తుపోయారు. డిస్ట్రిక్ట్ రిజిస్ట్రేషన్ అథారిటీ నుండి కంటి వైద్య నిపుణుల పేర్లతో అనుమతులు పొంది, వాస్తవానికి అప్తాల్మాలజీ ఆప్టోమెట్రీ టెక్నీషియన్లతోనే ఆసుపత్రులు నిర్వహిస్తూ, వైద్యులు లేకుండానే అర్హతకు మించి మందులు, పరీక్షలు సూచించడం, కొన్నిచోట్ల ఆపరేషన్లు కూడా నిర్వహించడం ద్వారా ప్రజలను మోసం చేస్తున్నట్లు తేలింది. అనుమతులు పొందిన కంటి వైద్యులు మాత్రం హైదరాబాద్ మరియు ఇతర నగరాల్లో ప్రాక్టీస్ చేస్తున్నట్లు గుర్తించారు.శ్రీ వెంకటేశ్వర కంటి ఆసుపత్రి మరియు షాలిని కంటి ఆసుపత్రుల్లో మరింత ఘోర పరిస్థితి ఎంబీబీఎస్ మాత్రమే చదివిన ఎం. భరత్ భూషన్, డా. కె. వెంకటేశ్వర్లు తాము ఎంఎస్ (ఆఫ్తాల్మాలజీ) చేసినట్లు తప్పుడు వివరాలు ప్రదర్శించి, కంటి వైద్య నిపుణులుగా ప్రచారం చేసుకుంటూ, వారి స్థానంలో కేవలం టెక్నీషియన్లతోనే ఆసుపత్రులు నిర్వహిస్తున్నట్లు గుర్తించారు.అలాగే కోమల మెడికల్ అండ్ జనరల్ స్టోర్ నిర్వాహకుడు నకిలీ వైద్యుడు ఎ. కోటేశ్వర్ రావు ఎటువంటి అర్హతలు లేకుండానే తన ఫస్ట్ ఎయిడ్ సెంటర్లో బెడ్లు ఏర్పాటు చేసి, ఇష్టానుసారంగా యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తూ ప్రజారోగ్యంతో చెలగాటం ఆడుతున్నట్లు తేలింది. మరో నకిలీ వైద్యుడు ఫ్రెండ్స్ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వాహకుడు మునీర్ తనిఖీ విషయం తెలిసి పరారైనట్లు గుర్తించారు.తనిఖీ నిర్వహించిన కేంద్రాలు శ్రీ వెంకటేశ్వర ( ఎస్ వి ) కంటి హాస్పిటల్,శ్రీ మహాలక్ష్మి కంటి హాస్పిటల్,అన్నపూర్ణ నేత్రాలయం,యశస్వి కంటి హాస్పిటల్,షాలిని ఐ క్లినిక్, రఫా విజన్ కేర్ సెంటర్,శివ సాయి కంటి హాస్పిటల్అర్హతకు మించి వైద్యం నిర్వహిస్తున్న టెక్నీషియన్లు నాగేష్, వాల్కె శ్రీను, నాగరాజు, శివ కోటేశ్వర్ రావు, వెంకటేష్, వికాస్ కుమార్, నకిలీ వైద్యుడు ఎ. కోటేశ్వర్ రావులపై ఎన్ఎంసీ, టీఎంపీఆర్ చట్టాల ప్రకారం క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు సభ్యులు తెలిపారు.అలాగే కంటి వైద్య నిపుణులు డా. శ్రీకుమార్, డా. ప్రభు చైతన్య, డా. బషీర్, డా. అమర్లకు కౌన్సిల్ నుండి నోటీసులు జారీ చేయనున్నట్లు తెలిపారు. నకిలీ కంటి వైద్య నిపుణులు డా. ఎం. భరత్ భూషన్, డా. కె. వెంకటేశ్వర్లులకు షోకాజ్ నోటీసులు జారీ చేసి, మెడికల్ ఎథిక్స్ అండ్ మాల్ప్రాక్టీసెస్ కమిటీ ముందు విచారణ నిర్వహించి, సంతృప్తికరమైన సమాధానం రాకపోతే అవసరమైతే వారి ఎంబీబీఎస్ డిగ్రీ లైసెన్సులను సస్పెండ్ చేస్తామని కంటి ఆసుపత్రుల అవక తవకలపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కి సిఫార్సు చేస్తామని టీజీఎంసీ పబ్లిక్ రిలేషన్స్ కమిటీ చైర్మన్ డా వి. నరేష్ కుమార్ ప్రజారోగ్య పరిరక్షణ దృష్ట్యా నకిలీ వైద్యులపై నిరంతర తనిఖీలు కొనసాగుతాయని, అర్హతకు మించి వైద్యం చేయడం, ఇంజెక్షన్లు ఇవ్వడం, ఆపరేషన్లు నిర్వహించడం, లింగ నిర్ధారణ, అక్రమ గర్భస్రావాలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సభ్యులు డా. కె. రవి కుమార్, డా జె. శ్రీకాంత్ స్పష్టం చేశారు. స్థానిక మిర్యాలగూడ ప్రజలంతా ఈ తనిఖీలు నామ మాత్రమేనా లేకపోతే శాశ్వతంగా ఉంటాయా తప్పుడు వైద్యరపై చర్యలు తీసుకుంటారా లేకపోతే స్థానిక అధికార యంత్రానికి ఈ చరణ్ నామ సంవత్సరంగానే తీసుకుంటారా అనేది గుసగుసలు వినపడతానే ఉన్నాయి . ఏది ఏమైనా ఈరోజు అధికారులు చేపట్టిన తనిఖీలపై హర్షం వ్యక్తం చేస్తున్న లోలోపల మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోరు కేవలం నామ మాత్రమే అనే గుసగుసలు వినిపిస్తున్నాయి. తనిఖీలకు సహకరించి పోలీస్ ల తో రక్షణ కల్పించిన మిర్యాలగూడ డి ఎస్ పి కె. రాజశేఖర్ రాజు, పోలీస్ అధికారుల బృందానికి కృతజ్ఞతలు తెలియ చేశారు.




# ఇంటి భోజనంతో రోగాలు దూరం

**ప్రధానోపాధ్యాయులు కే.వెంకట్ రెడ్డి**

**కొడంగల్, డిసెంబర్ 20(నినాదం) :** ఇంట్లో చేసిన తినుబండారాలతో రోగాలకు దూరంగా ఉండవచ్చు అని ఏర్పుమల్ల ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే. వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. పాఠశాలలో నిర్వహించిన ఫుడ్ మేళా కార్యక్రమంలో ఏపీసీసీ చైర్మన్ వసంత, గ్రామ పెద్దలు అంజిల్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముఖ్య అతిథిగా గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్, నాందార్ పూర్ హెచ్ఎం రామయ్య పాల్గొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తల్లిదండ్రుల సమావేశం తో పాటు ఫుడ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రకరకాల ఆహార పదార్థాలను తయారు చేసుకొచ్చి ప్రదర్శించారు. ఫుడ్ స్టాల్ ఎంతో అలరించాయి. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులకు జంక్ ఫుడ్ పట్ల అవగాహన కల్పించడం కోసమే ఈ ఫుడ్ మేళా నిర్వహించినట్టు పేర్కొన్నారు. ఇంట్లో తయారు చేసుకున్న చిరుతిల్లను మాత్రమే విద్యార్థులు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ జీవన్, ఉపాధ్యాయులు సర్దార్, ప్రశాంత్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# సూపర్ మాక్స్ పర్సనల్ కేర్ కంపెనీలో యంత్ర సామాగ్రి చోరి

**కార్మికులతో కలిసి కంపెనీని సందర్శించిన కూన శ్రీశైలం గౌడ్.**

**బ్లేడ్స్ తయారీకి వినియోగించే విలువైన యంత్ర సామాగ్రి చోరీకి కారకులను పట్టుకోవాలని పోలీసులకు సూచన**





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం) :** జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని సూపర్ మ్యాక్స్ పర్సనల్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో విలువైన యంత్ర సామాగ్రి చోరీకి గురైంది. ఈ విషయమును కంపెనీ కార్మికులు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఆయన కంపెనీకి వెళ్లి కార్మికులతో కలిసిచోరీ జరిగిన యంత్ర సామాగ్రి ఉండే ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీడిమెట్ల సిఐ తో సూపర్ మాక్స్ కంపెనీలో బ్లేడ్స్ తయారీకి వినియోగించే అత్యంత విలువైన యంత్ర సామాగ్రి చోరీ జరిగిన సంఘటనపై ప్రత్యేక దర్యాప్తు జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కంపెనీ రెండున్నర సంవత్సరాల మూత పడిందని కార్మికుల రోడ్డున పడ్డారని ప్రస్తుతం ఎన్సీఎల్టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ లో) పరిధిలో ఉన్నదని అన్నారు. బ్లేడ్లు తయారు చేసే యూనిట్ మొత్తం మాయమైందని అన్నారు. ఈ కంపెనీ కార్మికులకు బకాయిలు కూడా చెల్లించలేదని అన్నారు. ఈ క్రమంలో విలువైన యంత్రాలు మాయం చేసిన వారిని వెంటనే పట్టుకుని వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐ ఎన్ టి యు సి ప్రెసిడెంట్ గుంజ శ్రీనివాస్, కార్మికులు దయాకర్, శ్రీనివాస్, సూర్యనారాయణ, రామచంద్రారెడ్డి, ఈశ్వర్ రెడ్డి, కవిత, ఐ ఎస్ రావ్, లక్ష్మారెడ్డి, ఈశ్వరరావు, కార్మికులు పాల్గొన్నారు.

# షాహీ ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికుల చర్చలు సఫలం



**కాప్రా, డిసెంబర్ 20 ( నినాదం ) :** మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు సంయుక్తంగా బాణాసంచా కాల్చి సంబురాలు. కార్మిక సంఘాలకు ధన్యవాదాలు తెలిపిన మహిళా కార్మికులు. నాచారం పారిశ్రామికవాడ లోని షాహీ ఎక్స్పోర్ట్ గార్మెంట్స్ లిమిటెడ్ కార్మికులు గత 12 రోజులుగా నిరవధిక పోరాటం విజయవంతం అయింది.మూడు రోజులుగా జాయింట్ లేబర్ కమిషనర్ శ్యామ్ సుందర్ రెడ్డితో మహిళా కార్మికులు, ట్రేడ్ యూనియన్ సంఘాలు మరియు కంపెనీ జీఎం మురళి తో సంయుక్తంగా నిర్వహించిన చర్చలు సఫలం అయ్యాయి, కార్మికులు పెట్టిన డిమాండ్లను కంపెనీ యాజమాన్యం లిఖితపూర్వకంగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కంపెనీ వద్ద టపాసులు కాల్చి సంబురాలు చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి వివిఎస్. బోస్ మాట్లాడుతూ మహిళా కార్మికుల పోరాటం అద్వితీయమని, మొక్కవోని పోరాట పటిమ కనబర్చి కంపెనీ యాజమాన్యం ను ఒప్పించడంలో కీలకభూమిక పోషిచారని అన్నారు. యాజమాన్యం ప్రధానంగా జీతభత్యాల పెంపు అంశంలో ఏప్రిల్ మాసం లోపు హై లెవల్ కమిటీ ద్వారా కార్మిక చట్టం ప్రకారం ఇంక్రిమెంట్లు,ఆయా విభాగాల వారీగా జీతాల పెంపుదల చేస్తామని అన్నారు. అలాగే కార్మికులపై వేధింపులు ఇకపై ఉండవని, కంపెనీలో క్యాంటీన్, మరుగుదొడ్ల సంఖ్యను పెంచుతామని, జీతాల చెల్లింపులో అనవసర తొలగింపులు ఉండవని, ఒకరోజు సెలవు పెడితే రూ.800/-లు కటింగ్ చేసే పద్ధతికి స్వస్తి పలుకుతామని, సమ్మె కాలపు వేతనం ఇస్తామని యాజమాన్యం హామీ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. ధర్మేంద్ర, సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి. సత్య ప్రసాద్, ఐఎన్టీయూసీ నేతలు రామకృష్ణ రెడ్డి, హాబీబ్, ఏఐటీయూసీ నేతలు గిరిబాబు, అజీమ్, శేఖర్, స్వప్న, మహిళా కార్మికులు రజిత, పద్మ, షాలిని, పూజ, రంకు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-3 ఫలితాల్లో సత్తా చాటిన బొడ్డు లింగరాజు



**కోదాడ/మునగాల(నినాదం):** తెలంగాణ ప్రభుత్వం గురువారం రాత్రి ప్రకటించిన గ్రూప్-3 ఫలితాలలో మునగాల మండలం లోని బరాకత్ గూడెం గ్రామానికి చెందిన బొడ్డు యలమంచి- మంగమ్మ ల కుమారుడు బొడ్డు లింగరాజు ప్రతిభచూపి ఇంటర్మీడియట్ బోర్డులో జూనియర్ అసిస్టెంట్గా ఉద్యోగం సాధించాడు. బొడ్డు లింగరాజు ఒకటి నుండి 10వ తరగతి వరకు బరాఖతూడెం గ్రామంలోని ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాల, ఇంటర్మీడియట్ కోదాడలోని క్రాంతి కళాశాల, డిగ్రీ కోదాడ త్రివేణి డిగ్రీ కళాశాలలో విద్యను అభ్యసించారు. ఈ సందర్భంగా లింగరాజు మాట్లాడుతూ మా అమ్మ ప్రోత్సాహంతోనే చదువుకునే ఈ ఉద్యోగం సాధించానని, గ్రూప్-2లో ఉద్యోగం సాధించాలన్నదే నా పట్టుదల అని తెలిపారు. ఈ సందర్భంగా లింగరాజును గ్రామస్తులు, స్నేహితులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

# రైతులకు అవసరమైన యూరియా సమయానికి పారదర్శకంగా అందిస్తాం

**జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నల్లగొండ ప్రతినిధి డిసెంబర్20 (నినాదం) :** రైతులకు అవసరమైన యూరియా ,ఎరువులు సమయానికి, పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ఫర్టిలైజర్స్ యూరియా ఆన్లైన్ బుకింగ్ యాప్ను ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శనివారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలో "మన గ్రోమోర్ కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ" లో ఫర్టిలైజర్ యూరియా బుకింగ్ యాప్ ప్రారంభించారు. ఈ యాప్ ద్వారా రైతులు తమకు అవసరమైన యూరియాను ముందుగానే బుక్ చేసుకుని, నేరుగా సమీప డీలర్ వద్ద పొందే సౌకర్యం కల్పించబడిందని కలెక్టర్ తెలిపారు. ఇకపై ఎరువుల కోసం రైతులు క్యూలో నిలబడాల్సిన అవసరం ఉండదని, ఎరువుల అక్రమ నిల్వలు, దళారుల బెడద తగ్గుతుందని చెప్పారు. యాప్లో నమోదు చేసిన వివరాల ఆధారంగా యూరియా సరఫరా ,పంపిణీలో పారదర్శకత పెరుగుతుందని, ప్రతి రైతుకు న్యాయంగా ఎరువులు అందుతాయని స్పష్టం చేశారు. రైతులు తమ మొబైల్ ఫోన్లో యాప్ను డౌన్లోడ్ చేసుకుని ఆధార్, భూమి వివరాలతో ఎరువులకై నమోదు చేసుకోవాలని చెప్పారు. వ్యవసాయ అధికారులు, డీలర్లు రైతులకు యాప్ వినియోగంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు.ం డిజిటల్ వ్యవస్థల ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు జిల్లా ,మండల స్థాయి లో ఎంత యూరియా డీలర్ల దగ్గర ఉన్నదో ఈ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు.ఇది శాస్త్రీయమైన యాప్ అని, ఒక రైతుకు ఉన్న 5 ఎకరాల వ్యవసాయంలో ఎంతవరకు యూరియా అవసరామో ఈ యాప్ ద్వారా ఇస్తారన్నారు. ఈ యాప్ నిపుణులు తయారు చేశారని, చిన్న చిన్న మార్పు చేర్పులు అవసరమైనా, లేదా రైతులకు ఏమైనా సమస్యలుంటే ఏవో లేదా జెడిఎ దృష్టికి తీసుకురావాలనికోరారు. ఈ ఆప్ వల్ల బోగస్ కంపెనీలు లేకుండా, బ్లాక్ మార్కెట్ జరగకుండా పారదర్శకంగా జరుగుతుందన్నారు. ఈ ఆప్ పట్ల రైతులు ఎలాంటి అపోహలు నమ్మవద్దని, వ్యవసాయ శాఖ మంచి అడుగు వేసిందని,అవసరమైతే రెవిన్యూ సిబ్బంది ని ఉపయోగించుకుంటామని తెలిపారు.ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ని రైతులు ఉపయోగించుకొని రాష్ట్రంలో నల్లగొండ నెంబర్ వన్ స్థానాన్ని పొందే విధంగా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, వ్యవసాయ శాఖ జెడి శ్రవణ్ కుమార్ ,మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరు శ్రీనివాస్,పి ఏ సి ఎస్ డైరెక్టర్ సంపత్ రెడ్డి,ఫెర్టిలైజర్ డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## నూతన సర్పంచ్‌ని సన్మానించిన హీరో మహేష్ బాబు ఫ్యాన్స్..!



**పాలేరు డిసెంబర్ 19 ( నినాదం):** నేలకొండపల్లి గ్రామ బిఆర్ఎస్ పార్టీ మహిళ నాయకురాలు.రెండవ స్థానిక ఎన్నికల్లో భాగంగా నేలకొండపల్లి మేజర్ గ్రామ పంచాయతీ ఎలక్షన్లో సర్పంచ్ గా గెలుపొందిన శీలం వెంకటలక్ష్మి ని శుక్రవారం ఆమె గృహంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన హీరో మహేష్ బాబు ఫ్యాన్స్ కందుల మహేష్ పద్మ గౌషాబి శ్రీకాంత్ శ్రీను ఘనంగా షాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శీలం వెంకటలక్ష్మి మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమని ఓడిన వార్డ్ అభ్యర్థిలకు ఆమె ధైర్యం చెప్పారు.అధికార పార్టీని ఎదుర్కొని నిలబడి గట్టి పోటీ ఇచ్చిన మీరు చూపిన స్ఫూర్తిని,పోరాటాన్ని అభినందించారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని, రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆమె ధైర్యం చెప్పారు.

## పరిషత్ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలి



**పాలేరు డిసెంబర్ 20 ( నినాదం):** త్వరలో జరగనున్న మండల పరిషత్,జడ్పీటీసీ ఎన్నికలలో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కాశిబోయిన అయోధ్య కోరారు.మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలలో కమ్యూనిస్టులు అనేక పంచాయతీలలో జెండా ఎగురవేశారని అన్నారు. అదే విధంగా కమ్యూనిస్టులు బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించారని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలలో మరిన్ని స్థానాలలో విజయం సాధించేలా పని చేయాలని సూచించారు.పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్ లకు, వార్డు సభ్యులకు, అందుకు కృషి చేసిన ప్రతీ ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

## సీనియర్ పాత్రికేయులు రామును పరామర్శించిన బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**పాలేరు డిసెంబర్ 20 ( నినాదం):** కూసుమంచి మూడు రోజుల క్రితం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో కాలుకు సంబంధించి శస్త్ర చికిత్స విజయవంతంగా పూర్తి చేసుకొని, కూసుమంచి మండల కేంద్రంలో తమ ఇంటి వద్ద విశ్రాంతి తీసుకొంటున్న వెలుగు దినపత్రిక విలేఖరి అంతోటి రాము ను పరామర్శించి, వారు త్వరగా కోలుకుని యధావిధిగా తన వృత్తిలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించడం జరిగినదీ. అదేవిధంగా ఇటీవల 8 వ వార్డు యందు ఘన విజయాన్ని సొంతం చేసుకున్న క్రమంలో ఎన్నికల సంబధిత విషయాలు మరియు వార్డు సంబధిత సమస్యలు, కూసుమంచి పట్టణం సమస్యలు ప్రస్తావించడం, వాటి పరిష్కారం మార్గాలను చర్చించుకోవడం జరిగినది. ఈ కార్యక్రమంలో యువ నాయకులు దామళ్ల కోటి, అడపా శివ,మహమ్మద్ తాహిర్ హుస్సేన్,మండల బీజేపీ నాయకులు పొన్నం ఉపేందర్ నాయుడు తదితరులు పాల్గొనడం జరిగినది.

# రాజ్యాంగాన్ని కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత

### ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్

### కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సు






**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, డిసెంబర్ 20(నినాదం)** భారత రాజ్యాంగాన్ని కాపాడవలసిన బాధ్యత కేవలం న్యాయ స్థానాలకు, న్యాయవాదులకు మాత్రమే కాకుండా ప్రతీ ఒక్క పౌరునిపై ఉందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ స్పష్టం చేశారు. సమసమాజ స్థాపన, సమానత్వం, సామాజిక న్యాయం అనే లక్ష్యాలతో రూపుదిద్దుకున్న భారత రాజ్యాంగ విలువలను కాపాడుకోవడంలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం కొత్తగూడెం క్లబ్‌లో ఐ.ఎల్.పీ.ఏ జాతీయ అధ్యక్షురాలు కె.సుజాత చౌదంతి అధ్యక్షతన నిర్వహించిన ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐ.ఎల్.పీ.ఏ) తెలంగాణ రాష్ట్ర ఐదవ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ మాట్లాడుతూ భారత రాజ్యాంగం కేవలం చట్టాల సమాహారం మాత్రమే కాకుండా,దేశ ప్రజల జీవన విధానాన్ని దిశానిర్దేశం చేసే మహత్తర గ్రంథమని అన్నారు.సమాన హక్కులు, మానవ గౌరవం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలను ప్రజలందరికీ అందించాలనే సంకల్పంతో రాజ్యాంగం రచించబడిందని వివరించారు. రాజ్యాంగంలో పొందుపరిచిన మౌలిక హక్కులు, దిశానిర్దేశక సూత్రాలు సమాజంలోని అట్టడుగు వర్గాల అభ్యున్నతికి పునాదులుగా నిలుస్తున్నాయని, వాటిని కాపాడే బాధ్యత న్యాయ వ్యవస్థతో పాటు సమాజంలోని ప్రతీ ఒక్కరిపై ఉందని ఆయన అన్నారు. ముఖ్యంగా న్యాయవాదులు రాజ్యాంగ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. నేటి కాలంలో రాజ్యాంగ విలువల పట్ల అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉందని,ఈ దిశగా ఇటువంటి రాష్ట్ర స్థాయి మహాసభలు న్యాయవాదుల మధ్య చర్చలకు,ఆలోచనలకు, మార్గదర్శకత్వానికి దోహదపడతాయని జిల్లా జడ్జి తెలిపారు. న్యాయవృత్తిలో నైతిక విలువలు, సామాజిక బాధ్యతలను పెంపొందించేందుకు ఈ తరహా సదస్సులు ఉపయోగపడతాయని అన్నారు. ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు రాజ్యాంగం,న్యాయస్థానాల విధులు,చట్టాల పట్ల అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని, భవిష్యత్తులో న్యాయవాదులు గ్రామస్థాయిలో కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరముందని సూచించారు. అలా చేసినప్పుడే నిజమైన న్యాయసమాజం ఆవిర్భవిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమానికి వేదికగా నిలిచిన ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ యూనిట్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందిస్తూ, న్యాయవాదుల హక్కులు, సమస్యలు, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కూడా ఐ.ఎల్.పీ.ఏ మరిన్ని సామాజిక చైతన్య కార్యక్రమాలు చేపట్టి న్యాయవ్యవస్థపై ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి సరిత, న్యాయమూర్తులు కిరణ్ కుమార్ కవిత, రాజేందర్, సుచరిత,రవికుమార్,వినయ్ కుమార్, సూరెడ్డి, లక్కినేని సత్యనారాయణ ఐ.ఎల్.పీ.ఏ తెలంగాణ బాధ్యులు శాంసన్, దేవరాజ్ గౌడ్, లక్ష్మీదేవి,సైనీ నాగేందర్,అదనం కామర్ పాల్గొన్నారు.

## ఓఎస్ఎల్ వివరాలు ఆన్లైన్‌లో నమోదు చేయాలి

### జిఎం(పర్సనల్) వెల్ఫేర్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్

### అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో సమీక్ష



**కొత్తగూడెం, డిసెంబర్20(నినాదం):** సింగరేణి ప్రధాన కార్యాలయ జిఎం(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ ఛాంబర్ నుండి జనరల్ మేనేజర్ (పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధిపతులతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సంధర్భంగా జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ ఏరియాల వారీగా పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులతో కారుణ్యనియామకాల ద్వారా సంస్థలో నియామకమయ్యే వారసులకు సంబంధించిన ఓఎస్ఎల్ వివరాలను ఆన్లైన్ లో నమోదు చేయాలని, సిఎంపిఎఫ్/ సిపిఆర్ఎంఎస్ యొక్క జీవన్ ప్రమాన్ (డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్) రెన్యూవల్ ల గురించి ఈపిఆర్ నందు ఉద్యోగి జీవిత భాగస్వామి/ కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయటం విషయాల గురించి సమీక్షించి, కారుణ్య నియమకాలు, టెర్మినల్ బెనిఫిట్స్ చెల్లింపుల ప్రక్రియలను కూడా వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో జనరల్ మేనేజర్(పర్సనల్) వెల్ఫేర్ అండ్ సిఎస్ఆర్ జి.వి.కిరణ్ కుమార్ తో పాటు డిజిఎం(పర్సనల్)లు కేసా నారాయణ రావు, ఎస్.వేంకటేశ్వర రావు, బి.శివ కేశవ రావు, ముకుంద సత్యనారాయణ, కె.ప్రవీణ్ కుమార్, సీనియర్ పిఓలు ఎం.శ్రీనివాస్, బి.రణదీప్ గౌడ్, కమ్యూనికేషన్ ఆఫీసర్ ఎన్.సుజ్ఞాన్, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్యామ్ కిరణ్, అన్ని ఏరియాల పర్సనల్ డిపార్ట్మెంట్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు.

## రాయితీల కోసం కాదు రాజ్యాధికారం కోసం పోరాడాలి

### బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్



**ఇల్లందు డిసెంబర్ 20 నినాదం :** అగ్రవర్ణాల పాలకులు ఇచ్చే రాయితీల కోసం ఆరాటపడకుండా బహుజనులమైన ఎస్సీ ఎస్టీ బీసీలు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని రాష్ట్ర బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు తెలంగాణ బీసీ సంఘాల జేఏసీ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ బహుజనులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర బీసీ సంఘల జేఏసీ కన్వీనర్ కన్వీనర్ గా ఎన్నికైన మడత వెంకట గౌడ్ అభినందన ఉద్యమ కార్యచరణ సభలకు ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాస్ గౌడ్ బీసీల వెనుకబాటు గల కారణాలను వివరించారు. రాష్ట్రంలో 90 శాతం బహుజనులు ఉంటే 9 అగ్రవర్ణ అలకు చెందిన వారు ఉన్నారని కానీ పాలన మాత్రం 9% ఉన్న అగ్రవర్ణాలకు చెందిన నాయకులే పాలిస్తున్నారు. బహుజనులమైన తాము అగ్రవర్ణాలకు వ్యతిరేకం కాదని రాజ్యాంగం ప్రకారం జనాభా ప్రాతిపదికన బీసీలకు దక్కాల్సిన రిజర్వేషన్లు దక్కకుండా అడ్డుకుంటున్న వారికి మాత్రమే తాము వ్యతిరేకమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిసి లకు 42% రిజర్వేషన్ దక్కాలంటే రాష్ట్రంలోని అఖిలపక్ష నాయకులను ఢిల్లీకి తీసుకెళ్లి ప్రధాని ఇంటి ముందు ఆందోళన చేసి వంటావార్పు నిర్వహించాలన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే రాహుల్ గాంధీ పార్లమెంట్లో బీసీ బిల్లు పై చర్చించాలన్నారు. బీసీ ప్రధానిగా మోదీ ఉన్నప్పటికీ, రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ ఫలితం శూన్యం అన్నారు. బీసీలకు రాజ్యాధికారం దక్కొద్దన్న ఉద్దేశంతోనే బిజెపి బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తుందన్నారు. భవిష్యత్తులో బీసీ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి 42 శాతం రిజర్వేషన్ సాధించేందుకు బీసీల ఐక్యవేదిక బహుజనులు ఐక్యవేదిక సహకారంతో ముందుకు సాగుదాం అన్నారు.

# ఘనంగా పెద్దమ్మ తల్లి వారోత్సవాలు



**ఖమ్మం, డిసెంబర్ 20(నినాదం ):** పెద్దమ్మ తల్లి వారోత్సవాలు ను ఘనంగా నిర్వహించారు. శనివారం ఖమ్మం నియోజవర్గ పరిధిలోని రఘునాథపాలెం మండలం చింతగుర్తి గ్రామంలో పెద్దమ్మ తల్లి దేవాలయం వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వ్యక్తిగత సహాయకులు రవికిరణ్..మాజీ సర్పంచ్ మెంటం రామారావు, మండల ఉపాధక్షుడు తాత వెంకటేశ్వర్లు,గ్రామ అధ్యక్షులు సంగయ్య,రాంబాబు,ప్రశాంత్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ కార్యకర్తలను సస్పెండ్ చేయాలి



**ఆర్మూర్, డిసెంబర్ 20 (నినాదం) :** కమ్మర్పల్లి మండలంలోని కోనసముందర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ తీర్మానం చేసి బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థిని కాదని, రెబెల్ అభ్యర్థిగా రంగంలోకి దిగిన అభ్యర్థికి కాంగ్రెస్ పార్టీలోనే కొందరు వ్యక్తులు, నాయకులు వ్యతిరేకంగా పనిచేసే కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి కారణమయ్యారని కోన సముందర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు తీర్మానం చేశారు. శనివారం రోజున గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు సమావేశం నిర్వహించి, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన కాంగ్రెస్ నాయకులను, ఓటమికి కారణమైన వారిని వెంటనే కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయాలంటూ తీర్మానం చేశారు. ఇట్టితీర్మానం కాపీని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులకు, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డికి అందజేయడం జరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీ నిర్ణయించిన అభ్యర్థికి కాకుండా వేరే అభ్యర్థికి మద్దతు చేసి ఓటమికి కారణమైన వారిని పార్టీ నుండి సస్పెండ్ చేయాలని, లేనియెడల అన్ని గ్రామాలలో ఇదేవిధంగా పాల్పడే అవకాశాలు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీలో ఉంటూనే వర్గాలు ఏర్పాటు చేసుకుంటూ, కాంగ్రెస్ పార్టీ నిర్ణయాలకు వ్యతిరేకంగా పనిచేసే వారిని సస్పెండ్ చేయకుంటే రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తీవ్ర నష్టం జరుగుతుందని, ఇదేవిధంగా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తే, అన్ని గ్రామాలలో ఇలాగే జరిగే అవకాశాలు ఉన్నాయని, వెంటనే కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక చొరవ తీసుకొని సస్పెండ్ చేయాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు కోరారు

## ఆహార భద్రత ప్రమాణాలు పాటించని హోటళ్లను సీజ్ చెయ్యాలి

### కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్ కర్నూల్ ప్రతినిధి డిసెంబర్ 25 (నినాదం) :** ఆహార భద్రత ప్రమాణాలను పాటించని హోటల్స్, రెస్టారెంట్లు, షాపుల యజమానులపై చర్యలు తీసుకోవాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆహార ప్రమాణాల తనిఖీ అధికారులను ఆదేశించారు.శనివారం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన ఆహార భద్రత, ఆరోగ్యకరమైన ఆహారాలపై జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ నిర్వహించారు.జిల్లాలోని ప్రైవేటు, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, ఇతర ఆహారం తయారు చేసే కేంద్రాల్లో నాణ్యత తనిఖీలు ఫుడ్ ఇన్స్పెక్టర్ విస్తృతంగా చేపట్టాలని కలెక్టర్ బాదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ..... ఆహార కల్తీ, నాసిరకమైన ఆహారం తయారు చేయటం పట్ల కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో కొన్ని హోటలలో నాన్ వె జ్ వెజిటేరియన్ ఆహార పదార్థాలను కలిపి తయారు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందుతున్నాయని, ఆహార భద్రత విషయంలో అనుబంధ శాఖల సమన్వయంతో కొన్ని బృందాలను నియమించుకోవాలని, వాటి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు. హోటళ్లు, ఐస్ పాయింట్లు, పండ్ల మార్కెట్లలో తనిఖీలు చేయాలని కలెక్టర్ సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న 157 ప్రభుత్వ వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార వస్తువులు, వంటకు వినియోగిస్తున్న సరుకుల నాణ్యతను కూడా పరిశీలించాలన్నారు. జిల్లాలోని చిరువ్యాపారుల వివరాలు సేకరించాలని, ఆహారం తయారు చేయటంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఆహార వ్యాపారం చేస్తున్న వారు నిబంధనలు పాటించకపోతే, కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆహారం అమ్మకాలు సాగించేచోట పరిశుభ్రమైన తాగునీరు, నాణ్యమైన ఆహారం వినియోగదారులకు అందజేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆహార తయారీ కేంద్రాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వంటగదులు, వాష్ ఏరియా పరిశుభ్రంగా ఉంచాలని, వీధి వ్యాపారులకు ఆహార భద్రతపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు చేపట్టాలన్నారు.వచ్చే సమావేశం నాటికి జిల్లాలో ఎన్ని హోటళ్లకు లైసెన్సులు ఉన్నాయని ఏ ఏ స్థాయిలో లైసెన్సులు ఉన్నాయో పూర్తి నివేదికలు అందజేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, ఉమ్మడి జిల్లా ఫుడ్ అధికారి ఆనంద్ రావు, డీఈఓ రమేష్ కుమార్, డిఎంహెచ్వోఓ డాక్టర్ రవి కుమార్, డిటి డబ్ల్యూఓ ఫిరంగి, ఫుడ్ ఇన్స్పెక్టర్లు శ్రీలత, నీలిమ, తదితరులు పాల్గొన్నారు.

## బాక్సింగ్‌లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల సత్తా

### -జాతీయ స్థాయికి సెలెక్ట్.. అభినందించిన కలెక్టర్



**కొత్తగూడెం, డిసెంబర్20(నినాదం):** ఈ నెల 18, 20 తేదీలలో హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో నిర్వహించిన 69వ ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభ చూపి రెండు గోల్డ్ మెడల్స్, ఒక సిల్వర్ మెడల్ సాధించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీ జితేష్ వి. పాటిల్ క్రీడాకారులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. అదే విధంగా ఈ నెల 25 నుంచి జనవరి 1 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రం గ్వాలియర్‌లో జరుగనున్న జాతీయ స్థాయి పోటీలకు సెలెక్ట్ అయిన ఆర్. గణేష్, మణికంఠ, వి. సాయికిరణ్‌లను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించి, జాతీయ స్థాయిలో కూడా మెరుగైన ప్రదర్శన కనబర్చాలని ఆకాంక్షించారు. అలాగే జాతీయ పోటీలకు సిద్ధం కావడానికి అవసరమైన ప్రాక్టీస్ మెటీరియల్‌ను కూడా అందజేస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి పందమరెడ్డి , జిల్లా ఎస్జీఎఫ్ అసోసియేషన్ సెక్రటరీ వాసిరెడ్డి నరేష్ , తిరుమల రావు , బాక్సింగ్ కోచ్ శ్రీనివాస్, మాటపర్తి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గణిత శాస్త్ర పరీక్షల్లో కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేత



**ఆర్మూర్, డిసెంబర్ :20(నినాదం) :** మోర్తాడ్ మండలంలోని ఎమ్మార్సీ తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభ పరీక్ష నిర్వహించడం జరిగిందని మండల విద్యాధికారి డి.సమ్మిరెడ్డి తెలిపారు. ఇట్టి పరీక్షలు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల నుండి పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాలల నుండి ముగ్గురు చొప్పున పాల్గొన్నారు . పరీక్షలో మొదటి విజేత కె వర్షిత్ జడ్పీహెచ్ఎస్ సుంకెట్ రెండో విజేత పి రఘురాం జడ్పీహెచ్ఎస్ శెట్టిపల్లి మూడో విజేతలు బి. గౌతమి జడ్.పి.హెచ్.ఎస్ పాలెం కే అక్షర పి. నవ్య శ్రీ జడ్.పి.హెచ్.ఎస్ శెట్టిపల్లి ఇట్టి కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి డి. సమ్మిరెడ్డి మరియు అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత ఉపాధ్యాయులు,

## జిల్లాలో రహదారి భద్రతకు పటిష్ఠ చర్యలు

### కలెక్టర్ జితేష్ వి. పాటిల్

### జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలపై రాష్ట్రస్థాయి సమీక్ష



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, డిసెంబర్ 20(నినాదం):** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జనవరి నెలలో నిర్వహించనున్న అవగాహన కార్యక్రమాలపై రవాణా శాఖ ఆధ్వర్యంలో శనివారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం రహదారి ప్రమాదాల కారణంగా అనేక మంది ప్రాణాలు కోల్పోతుండటంతో పాటు పలువురు గాయాల పాలవుతున్నారని, దీని వల్ల బాధిత కుటుంబాలు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుటుంబ యజమాని మృతి చెందితే అతనిపై ఆధారపడిన కుటుంబ సభ్యుల బాధలు వర్ణనాతీతమని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాలకు అనేక కారణాలు ఉన్నందున వాటి నివారణకు సంబంధిత శాఖల అధికారులు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రవాణా, పోలీస్, అబ్కారి, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు సమన్వయంతో జనవరి నెలలో నిర్వహించనున్న రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడిఓసీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పాల్గొన్న జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లాలో రహదారి భద్రతకు సంబంధించి చేపడుతున్న చర్యలపై వివరించారు. జిల్లాలో రహదారులపై ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రదేశాలను గుర్తించి, ప్రమాదాల నివారణకు అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రహదారుల వెంట ఏర్పడే గుంతలను పూడ్చేందుకు గ్రామపంచాయతీ పరిధిలో పంచాయతీ కార్మికుల ద్వారా ఎప్పటికప్పుడు మరమ్మత్తుల కార్యక్రమం చేపడుతున్నామని వెల్లడించారు. జిల్లాలో రహదారులపై ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాల నివారణకు సిసి కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులను గుర్తించి తగిన చర్యలు తీసుకునేలా వ్యవస్థను మరింత పటిష్టం చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే స్పందించే విధంగా తక్షణ చర్యలు తీసుకుని బాధితులకు అవసరమైన వైద్య సహాయం అందిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. మెరుగైన అత్యవసర వైద్య సేవల కోసం జిల్లాలో ట్రామా కేర్ సెంటర్ నిర్మాణ పనులు చేపట్టినట్లు వెల్లడించారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా నూతనంగా మూడు బ్లడ్ బ్యాంకులు ఏర్పాటు చేయడం జరిగిందని, రహదారి ప్రమాదాల సమయంలో బాధితుల ప్రాణాలను కాపాడడంలో ఇవి కీలక పాత్ర పోషించనున్నాయని ఆయన అన్నారు. జనవరి నెలలో నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లాలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు, శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో రహదారి భద్రతపై చైతన్యం తీసుకురావడానికి అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. డిప్యూటీ కలెక్టర్ మురళి, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్ అండ్ బి ఈఈ నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ శాఖ ఈఈ శ్రీని వాసరావు, మున్సిపల్ కమిషనర్ సుజాత, క్రీడా శాఖ అధికారి పరం దామ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 202 సర్వేలో ప్రభుత్వ భూమి కాపాడాలని ఎమ్మార్వోకి వినతి



**ఆర్మూర్, డిసెంబర్ 20 (నినాదం) :** ఆర్మూర్ పట్టణం లోని కొటార్మూర్ లోని సర్వే నంబర్ 202 లో ప్రభుత్వ భూమిని ఆక్రమణ కాకుండా కాపాడాలని ఎంఆర్పీఎస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇంచార్జ్ మైలారం బాలు ఆధ్వర్యంలో శనివారం ఎమ్మార్వోకు వినతి పత్రం అందజేశారు. తీగల నర్సారెడ్డి అనే రియల్టర్ ప్రభుత్వ భూమి అని తెలిసి కూడా అందులో కమర్షియల్ డూప్లెక్స్ ఇండ్లు నిర్మాణం చేస్తూ వ్యాపారం చేస్తున్నారని, ప్రభుత్వ భూమి లో నిర్మించిన ఆ ఇండ్ల ను ప్రభుత్వం రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకొని మిగితా భూమి లో 202 సర్వే నంబర్ హద్దులు నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అధికారులు నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమాలతో ఆ ఇండ్ల ను ప్రజలకు ఉపయోగపడే విధంగా ప్రజలకోసం పని చేసే సంస్థలకు వాటిని కేటాయిస్తామని మైలారంబాలు హెచ్చరించారు.

## చిత్రలేఖన పోటీల విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం



**ఆర్మూర్, డిసెంబర్ 20 (నినాదం) :** స్థానిక మోర్తాడు మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో ఇటీవల నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు మెడల్స్ అందజేశారు. రంగోత్సవ్ సెలబ్రేషన్స్ వారు నిర్వహించిన చిత్రలేఖన పోటీలలో పాఠశాల నుండి 57 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది విద్యార్థులు మెడల్స్ పొందారు. మిగిలిన విద్యార్థులకు సర్టిఫికెట్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు ఉపాధ్యాయులు నరసింహ మూర్తి ,సాగర్, రమణ చారి ,జ్యోతి , ఆర్ట్స్ టీచర్ రాము మరియు తల్లిదండ్రులు జమాల్, నవీన్ పాల్గొన్నారు

# రౌడీయిజం చేస్తే.. యోగీ బాట పడతాం

కాలుకు కాలు..చేయికి చేయి తీస్తాం

రాజకీయం చేయాల్సి వస్తే వెనక్కి తగ్గం

ప్రజల కోసం కూటమిగా కలిసి సాగుతున్నాం

మీ ఉడత బెదిరింపులకు భయపడేది లేదు

వైకాపా నేతలకు డిప్యూటి సిఎం పవన్ ఘాటు హెచ్చరిక

పొట్టి శ్రీరాములు జలధార పథకానికి

పెరవలిలో శ్రీకారం





**కాకినాడ, డిసెంబర్20(నినాదం):** వైకాపా రౌడీలకు యోగి ఆదిత్యనాథ్ వంటి ట్రీట్‌మెంట్ ఇవ్వాల్సి ఉందని డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ హెచ్చరించారు. ప్రాజెక్టు ఎందుకు ఆలస్యమవుతుందంటూ వైకాపా నేతలు ఆరోపణలు చేస్తున్నారు. వైకాపా అధికారంలో ఉన్నప్పుడూ బెదిరింపులకు భయపడలేదు. దౌర్జన్యాలకు దిగుతూ మళ్లీ వస్తామంటూ దిగజారి మాట్లాడుతున్నారు. రెండు రోజులు కిరాయి గూండాలు, రౌడీల వివరాలు ఆరా తీస్తే పరిస్థితి తెలుస్తుంది. రౌడీలపై రాజకీయ నిర్ణయం తీసుకుంటే మళ్లీ ఇలాంటి మాటలు రావు. ఆరోపణలు చేసేవారిని హెచ్చరిస్తున్నా.. రాజకీయ నిర్ణయం వరకూ తీసుకెళ్లొద్దు. అధికారం ఉన్నా.. లేకపోయినా.. పవన్ ఎప్పుడూ పవన్‌లానే ఉంటాడని ఘాటు హెచ్చరికలు చేశారు. బూర్గుల రామకృష్ణారావు, పొట్టి శ్రీరాములు ఎప్పుడూ తన గుండెల్లో ఉంటారని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం పెరవలిలో అమరజీవి జలధార పథకానికి ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టుకు 5 జిల్లాల పరిధిలో రూ.7,910 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. దీని ద్వారా 1.20 కోట్ల మంది దాహార్తి తీర్చాలన్నది లక్ష్యమన్నారు. ఎక్కువ తీర ప్రాంతాలు కలిపేలా ప్రాజెక్టు రూపకల్పన చేసినట్లు చెప్పారు. 2027 నాటికి పూర్తి చేయాలనే లక్ష్యంతో సాగుతున్నట్లు వివరించారు. పెరవలిలో నిర్వహించిన సభలో వైసీపీపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిప్పులు చెరిగారు. వైసీపీ నాయకులు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అధికారంలో ఉండగా వైసీపీకి భయపడేదిలేని, పదేళ్లుగా పార్టీ పెట్టి కూడా వెనక్కు తగ్గానని జనసేన అధినేత చెప్పుకొచ్చారు. సీట్లు అమ్ముకున్నానని తనపై విమర్శలు గుప్పించారన్న పవన్.. ప్రజల కోసమే సీట్లు తగ్గించుకున్నానని తెలిపారు. తెలుగువారి ఆత్మగౌరవం కోసం పోరాడిన బూర్గుల రామకృష్ణా రావు, పొట్టి శ్రీరాములే తనకు స్ఫూర్తి అని ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విభజన వల్ల నష్టపోయాం.. ఇక నష్టపోకూడదనే మేమంతా ఏకమయ్యాం. ఎవరి ప్రాణ త్యాగంతో రాష్ట్రం ఏర్పడిందో వారిని స్మరించు కోవడం మన ధ్యేయం. త్యాగజీవి పొట్టి శ్రీరాములు విగ్రహానికి దండ వేద్దామంటే ఎక్కడా విగ్రహం కనిపించలేదు. రాష్ట్రం కోసం త్యాగం చేసిన వ్యక్తిని నెల్లూరు జిల్లాకు పరిమితం చేశాం. ప్రధానిమంత్రికి ప్రపంచమంతా శత్రువుల్లా తయారయ్యారు. కొన్ని పరిణామాల వల్ల ఆయన నా సభలకూ రావడానికి ఇబ్బంది పడుతున్నారు. తెలుగు జాతి, తెలుగు ఆత్మగౌరవం అని మొదటిసారి మాట్లాడిన వ్యక్తి పొట్టి శ్రీరాములు. డొక్కా సీతమ్మ కులం చూడలేదు. అమ్మా.. ఆకలి అంటే అన్నం పెట్టారు. చిన్న పిల్లలకు గుర్తుండిపోయేలా మధ్యాహ్న భోజన పథకానికి ఆమె పేరు పెట్టాం. రాష్ట్రానికి మంచి స్పందన జరగాలనే నేను తగ్గి, కూటమితో కలిశాను' అని పవన్ పేర్కొన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో వాటర్ గ్రిడ్ పథకం చేపట్టామని ఈ సందర్భంగా పవన్ అన్నారు. 'అక్వా కల్చర్ వలన భూగర్భ జలాలు కలుషితమయ్యాయంటే నవ్వాలో, ఏడవాలో తెలియడం లేదు. రూ.7,500 కోట్లతో స్వచ్ఛమైన తాగునీరు రాష్ట్రంలో అందరికీ అందిచాలని నిర్ణయించాం. మీరు అధికారంలో ఉన్నప్పుడు మీకు నేను భయపడలేదు. మీ దౌర్జన్యాలకు భయపడలేదు. అధికారంలోకి వస్తే చంపేస్తాం.. అంటే ఏం మాట్లాడతాం. సిగ్గుందా అలాంటి మాటలు మాట్లాడడానికి? మేము అధికారంలోకి వస్తే కాంట్రాక్టర్లను జైలులో వేస్తామంటున్నారు. అలాంటి వారికి పవన్ కళ్యాణ్ భయపడడు. వారి వెనుక రౌడీలు ఉంటారని అధికారులు భయపడుతున్నారు. అటువంటి రౌడీలకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌లా.. కాలికి కాలు, చెయ్యికి చెయ్యి అనేలా ట్రీట్మెంట్ ఇస్తే.. వారంతా కకావికలం అయిపోతారు. మేమంతా కూర్చుని ఒక నిర్ణయం తీసుకుంటే వారు ఏమైపోతారు? పద్ధతులు మార్చుకోండి అంటూ హెచ్చరించారు. గీతలు దాటి మాట్లాడొద్దు. అలా మాట్లాడితే.. వారి చేతుల్లో గీతలు తీసేస్తాం. పాత పద్ధతిలోనే మేముంటామని వైసీపీ నేతలు అంటే.. నేను విసిగిపోయాను. అలాంటి వారి ప్రాణాలకు గ్యారంటీ లేదు. అడ్డగోలుగా వెళతామంటే.. రోమం రోమం తీసేసి కూర్చోబెడతాం. నాయకులు చేసే పాపాలకు ప్రజలు ఇబ్బందులు పడాలా? అని ప్రశ్నించారు. కులాల సమూహం అని కొట్టుకుంటున్నారే గానీ.. సమూహంగా మన దేశం కోసం మాట్లాడడం లేదు' అని జనసేన అధినేత పవన్ పేర్కొన్నారు.

## ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో..

# ప్రజలు భాగం కావాలి

స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా



**ఒంగోలు, డిసెంబర్20(నినాదం):** ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సూచించారు. శనివారం పొన్నలూరులో స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి. రాజబాబు పాల్గొన్నారు. గ్రామంలో రూ.65 లక్షల విలువైన రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఏపీ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

# జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఉపయోగం లేదు

పాత పద్ధతిలోనే ఉపాధిహామీ కొనసాగాలి

సిపిఎం నేత బివి రాఘవులు డిమాండ్



**విజయవాడ, డిసెంబర్20 (నినాదం):** కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన జీరాంజీ బిల్లు వల్ల పేదలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. గతంలో ఉన్న ఉపాధిహామీ చట్టాన్ని రద్దుచేసి కొత్తగా జీరాంజీ పథకాన్ని తీసుకొచ్చారని కేంద్ర ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పించారు. దీనిలో కార్మికులకు గానీ, రాష్ట్రాలకు గానీ ఎటువంటి హక్కులూ లేవన్నారు. గతంలో కనీసం 100 రోజులు పని పేరుతో 50 రోజులన్నా కార్మికులకు ఉపాధి లభించేదని.. ఇప్పుడు కేంద్రం దయాదాక్షిణ్యాలపై ఉండేలా చేశారని విమర్శించారు. ఉపాధి హామీ పథకం వ్యవసాయ పనులకు ఆటంకమని చెబుతున్నారని.. అలాంటిదేమీ లేదని అనేక నివేదికలు, పరిశోధనలు బయటపెట్టాయని రాఘవులు తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునేందుకు ఈ పథకం ఉపయోగపడుతుం దన్నారు. పథకంలో నిధుల వాటా గతంలో కేంద్రానికి 90 శాతం రాష్ట్రానికి 10 శాతం వాటా ఉండేదని.. కానీ, ఇప్పుడు 60:40 శాతంగా మార్చి, రాష్ట్రాలపై భారం మోపుతున్నారని కేంద్ర ప్రభుత్వం తీరును ఎండగట్టారాయన. ఆకలిచావులు, వలసలు నివారించేందుకు ఉపయోగపడిన ఈ చట్టాన్ని రద్దు చేయడం వల్ల మళ్లీ ఆకలిచావులు పెరిగే ప్రమాదం ఉందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. పథకానికి నిధుల కేటాయింపు డిమాండ్‌ను బట్టి కాకుండా.. రాజకీయ అవసరాలకు తగిన విధంగా కేటాయించేలా నిబంధనలు రూపొందించారని రాఘవులు విమర్శించారు. గతంలో కేంద్రం ముందుగానే నిధులు ఇచ్చేదని.. ఇప్పుడు పనిచేసిన తరువాత బిల్లు ఇచ్చేలా పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఉపాధి కల్పనలో ఆలస్యమయితే గతంలో కేంద్రమే పెనాల్టీ చెల్లించేదని.. ఇప్పుడు ఆ బాధ్యతను రాష్ట్రం మీదకు నెట్టేశారని వివరించారు. ఈ అంశంపై రాష్ట్రంలో అధికారంలో ఉన్న టిడిపి మాట్లాడటం లేదని, ప్రతిపక్షంలో ఉన్న వైసీపీ కూడా గట్టిగా ప్రశ్నించడం లేదని రాఘవులు విమర్శించారు. సెలక్టు కమిటీకి పంపించాలని చెప్పి వైసీపీ చేతులు ముడుచుకు కూర్చుందని.. ఈ రెండు పార్టీలు మోడీని చూసి భయపడుతున్నాయన్నారు. రాష్ట్రంలో ఉన్న మూడు పార్టీలు మోడీతో అనుసరిస్తున్న తీరువల్ల రాష్ట్రానికి తీవ్రనష్టం వాటిల్లుతుందని రాఘవులు ఆందోళన వ్యక్తం చేశారు. రాయలసీమకు అనువుగా ఉండేలా పారిశ్రామిక పాలసీని మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని రాఘవులు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ ఇండస్ట్రియల్, ఎలక్ట్రానిక్స్ సిటీ నిర్మించాలన్నారు. అక్కడ పరిశ్రమలకు అనువైన వాతావరణం కూడా ఉందని చెప్పారు.

# అమరజీవి జలధార ఆదర్శప్రాయం

ఇంటింటికీ మంచినీటి కల సాకారం

ఎక్స్ వేదికగా మంత్రి లోకేశ్ అభినందన



**అమరావతి, డిసెంబర్20(నినాదం):** 'అమరజీవి జలధార'పై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ట్వీట్ పెట్టారు. ఇంటింటికీ కొళాయి ద్వారా సురక్షితమైన తాగునీరు అందించే లక్ష్యంతో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ 'అమరజీవి జలధార' పథకానికి శంకుస్థాపన చేశారని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు స్వచ్ఛమైన జలాలు అందించేందుకు పవన్ కల్యాణ్ చేసిన భగీరథ ప్రయత్నం ఫలించిందని కొనియాడారు. 'అమరజీవి జలధార' పథకానికి శ్రీకారం చుట్టి, కూటమి ప్రభుత్వం ఇచ్చిన మరో హామీని నెరవేరుస్తున్న పవన్ కల్యాణ్‌కు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మంగళగిరిలో కృపాసమాజం వారి కృపాప్రాంగణం పున:ప్రతిష్ఠ ఆరాధన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మీడియాతో లోకేశ్ మాట్లాడారు. నాడు, నేడు, ఎప్పుడూ మంగళగిరి ప్రజల సేవలో అందుబాటులో ఉంటానని స్పష్టం చేశారు. అందరం కలిసికట్టుగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్యానించారు. పరీక్ష పెట్టే దేవుడు.. వాటిని జయించే శక్తి కూడా ఇస్తారని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు.

# 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ





ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే పక్రియ

స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

**అనకాపల్లి, డిసెంబర్20(నినాదం):** 2029 నాటికి ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. గత ప్రభుత్వం 86 మెట్రిక్ టన్నుల చెత్త ఉంచి పోయిందని.. అక్టోబర్ 2 నాటికి ఆ చెత్త తొలగించామని తెలిపారు. ఫిబ్రవరి 15 నాటికి ప్రతీ ఇంటి నుంచి చెత్త కలెక్ట్ చేసే పక్రియ 100 శాతం పూర్తి చేస్తామని చెప్పారు. అనకాపల్లి జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటించారు. ఇందులో భాగంగా తాళ్ళపాలెంలో స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమం సమయంలో ప్రధాని తనకో బాధ్యతను అప్పగించినట్లు చెప్పారు. అన్ని రాష్ట్రాల సీఎంలతో సమగ్ర చర్చ జరిపి నిర్వహణ అప్పగించారన్నారు. ఏ కార్యక్రమం అయినా ప్రజల భాగస్వామ్యంతోనే విజయాలు సాధించగలమని చెప్పుకొచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ముందుండి నడిపించేది గ్రీన్ సోల్జర్లని.. వారికి అభివాదాలు తెలియజేశారు. రీసైకిల్ ఏకానమి సృష్టించామని.. అందరి ఆరోగ్యం కోసం ఈ పని చేస్తున్నట్లు తెలిపారు. సాలిడ్ వేస్ట్ ను కంపోస్ట్ యూరియాగా మారుస్తున్నారని దీని వల్ల రైతులకు దిగుబడి పెరుగుతోందన్నారు. పారిశుద్ధ్య కార్మికులే నిజమైన సైనికులని చెప్పుకొచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో కిచెన్ గా÷-డ్గ్న÷న్స్‌కు రూ.5లక్షలు సాయం అందిస్తామన్నారు చంద్రబాబు. వేస్ట్ ఎనర్జీ ఎ÷-లాంట్‌తో రోజు వెయ్యి టన్నుల చెత్త సేకరించి విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు. అక్టోబర్ 2 తర్వాత రాష్ట్రంలో సింగల్ యూస్ ఎ÷-లాస్టిక్ ఉండకూడదన్నారు. ఏ ఆఫీస్‌కు వెళ్లకుండా మొబైల్ ద్వారానే సేవలు పొందే అవకాశం తెస్తున్నామని చెప్పారు. 'నాది ఉడుంపట్టు.. వదిలి పెట్టేది లేదు' అని తేల్చి చెప్పారు. స్వచ్ఛాంధ్రలో అనకాపల్లి 13వ స్థానంలో ఉందన్న సీఎం.. ఇంకా మెరుగుపడాలని సూచించారు. అనకాపల్లి పరిశ్రమల హబ్‌గా ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. జిల్లాలో మొదటి ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ ను 90 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అరకు కాఫీ కోసం ఆనంద్ మహేంద్ర ట్వీట్ చేశారని పేర్కొన్నారు. అనకాపల్లిలో ఆర్గానిక్ బెల్లం చేసి ప్రపంచ దేశాలకు ఎగుమతి చేసేలా ముందుకెళ్లాలని సూచించారు. రెండు నెలల్లో పోలవరం నీళ్లు అనకాపల్లికి వస్తాయన్నారు. గోదావరి నీళ్లు వంశధారకు అనుసంధానం చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి పూర్వోదయ కింద కేంద్రాన్ని సహాయం కోరినట్లు చెప్పారు. ప్రపంచం మొత్తం విశాఖ వైపు చూస్తోందన్నారు సీఎం. త్వరలో అనకాపల్లి జిల్లాలో ఆర్సీలార్ మిట్టల్‌తో స్టీల్ సిటీ ఏర్పడుతుందని వెల్లడించారు. అల్యూమినియం సిటీ కూడా సిద్ధం చేస్తున్నామన్నారు. మెడికల్ కాలేజ్‌లకు పీపీపీ కింద ఇచ్చామన్న సీఎం.. గతంలోనూ 104, 108లు ప్రైవేట్‌కే ఇచ్చారు కదా? ప్రశ్నించారు. రుషికొండను గుండు కొట్టారని విమర్శించారు. రుషికొండకు రూ.500 కోట్లు ఖర్చు చేశారని.. ఆ సొమ్ములతో మెడికల్ కాలేజ్ కట్టొచ్చన్నారు. వైసీపీ హయాంలో ఏజెన్సీని గంజాయి వనంగా మారిస్తే.. కూటమి ప్రభుత్వం వచ్చి కాఫీవనంగా మార్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# సంక్రాంతి కల్లా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ





ఇప్పటికే 28లక్షల34 వేల మెట్రిక్ టన్నులు పూర్తి

మంత్రి నాదెండ్ల మనోహర్ వెల్లడి

**విజయవాడ, డిసెంబర్20(నినాదం):** రాష్ట్ర వ్యాప్తంగా నేటి వరకు 28లక్షల34 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సంక్రాంతి కల్లా 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు. కృష్ణా జిల్లాలోని తోట్లవల్లూరు మండలంలో మంత్రి నాదెండ్ల మనోహర్ శనివారం పర్యటించారు. పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజాతో కలిసి తోట్లవల్లూరు గ్రామంలోని రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కోత కోసి కుప్ప నూర్పుడి చేస్తున్న రైతులు.... కల్లాల్లో ధాన్యం ఆరబోసిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతు సమస్యలను తెలుసుకునేందుకు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నామని తెలిపారు. రైతుకు మేలు జరగాలని కూటమి ప్రభుత్వం అనేక సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. పొరపాట్లు జరిగితే సరిదిద్దుకుంటామని.. అవి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో ఎప్పటికప్పుడు రైతాంగ సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరిస్తున్నామన్నారు. రికార్డు స్థాయిలో కృష్ణా జిల్లాలో మొట్టమొదటిసారి 11 ట్రైన్లు పెట్టి ధాన్యం ఇతర జిల్లాలకు తరలించారని తెలిపారు. జిల్లాలో మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండడంతో రాష్ట్రంలో 106 మిల్లుల నిర్వాహకులు కృష్ణాజిల్లాలో ధాన్యం కొనుగోలు చేసేలా వేసులుబాటు కల్పించామని చెప్పారు. భారీ ఎత్తున జరిగిన ధాన్యం సేకరణ కార్యక్రమాన్ని రైతాంగాన్ని వివరించాలని ముఖాముఖి కార్యక్రమాలు నిర్వహిస్తున్నా మన్నారు. ధాన్యం రైతులు ప్రభుత్వానికి అమ్మితే కనీస మద్దతు ధర తప్పక అందుతుందని స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలులో రైతుకు సహాయంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుందని అన్నారు. 24 గంటల్లోపే విక్రయించిన ధాన్యం నగదును రైతు ఖాతాలో జమ చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.

# విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రతే లక్ష్యం






తాళ్లపాలెంలో ముస్తాబుకు చంద్రబాబు శ్రీకారం

**అనకాపల్లి, డిసెంబర్20(నినాదం):** పిల్లల బంగారు భవిష్యత్తుకు తనది బాధ్యత అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అనకాపల్లి జిల్లా తాళ్లపాలెంలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటించారు. అక్కడి గురుకుల పాఠశాలలో 'ముస్తాబు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులతో మాట్లాడి వివిధ అంశాలపై చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో శనివారం ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేలా దీన్ని చేపట్టారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో అమలు చేస్తున్నారు. మరోవైపు చంద్రబాబు తాళ్లపాలెంలో పారిశుద్ధ్య కార్మికులతో కలిసి కాలినడకన వెళ్లి గ్రామంలో స్వచ్ఛత పనులను పరిశీలించారు. అంతకు ముందు తాళ్లపాలెం వచ్చిన చంద్రబాబుకు తెదేపా నాయకులు ఘన స్వాగతం పలికారు. హెలిప్యాడ్ వద్ద ఆయనకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోం మంత్రి అనిత, అనకాపల్లి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి తదితరులు స్వాగతం పలికారు. తాళ్లపాలెం సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ పాఠశాలకు చేరుకున్న సీఎం.. అక్కడి విద్యార్థినులతో మాటామంతి నిర్వహించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన ముస్తాబు కార్నర్‌ను పరిశీలించారు. అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. అల్లూరి జిల్లా కలెక్టర్ ఒక మంచి కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టారని తెలిపారు. ముస్తాబు కార్యక్రమం ద్వారా కొత్త విధానం తెచ్చారన్నారు. మంత్రి నారా లోకేష్, అలాగే మంత్రులు మంచి కార్యక్రమాలు తీసుకొచ్చారని అన్నారు. పిల్లల బంగారు భవిష్యత్ బాధ్యత తనది అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఇక విద్యార్థినిలతో మాటామంతిలో భాగంగా సీఎం ముందు విద్యార్థిని గుణ శ్రీవల్లి మాట్లాడింది. ముస్తాబు కార్యక్రమం చాలా మంచి కార్యక్రమని. పరిశుభ్రత పెంపోందించే కార్యక్రమమని పేర్కొంది. సోషల్ వెల్ఫేర్ స్కూల్ ప్రిన్సిపాల్ కావాలని ఉందని ఈ సందర్భంగా శ్రీవల్లి తన గోల్‌ను సీఎం ముందు తెలియజేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, రెసిడెన్షియల్ స్కూళ్లలో ముస్తాబు కార్యక్రమం నేటి నుంచే అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన పెంచేలా ముస్తాబు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో కూడా దీనిని అమలు చేసేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

# బంగ్లాలో హిందువులపై నరమేధం

ఈ ఘటనలపై మౌనం వహించరాదు

ఎక్స్ వేదికగా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఆందోళన



**విశాఖపట్నం, డిసెంబర్20(నినాదం):** బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులపై భారతదేశం అంతటా తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ ఘటనలు మానవ హక్కుల ఉల్లంఘనగా భావిస్తూ వివిధ వర్గాలు గట్టిగా నిరసన వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా సామాన్య ప్రజల నుంచి రాజకీయ నాయకుల వరకు పలువురు ఈ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నారు. హిందువులపై జరుగుతున్న హింసను అరికట్టాలని, బాధితులకు రక్షణ కల్పించాలనే డిమాండ్‌లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఎక్స్ వేదికగా స్పందించారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న ఘటనలను తప్పుబట్టారు. అక్కడ హిందువులపై జరుగుతున్న దాడులను 'నరమేధం'గా అభివర్ణిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో జరుగుతున్న నరమేధంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం హిందువుల మీద జరుగుతున్న దాడులు నరమేధాన్ని ఖండించని వారు భారతీయులేనా? అని ప్రశ్నించారు. ఈ దాడులపై ఖండించని వారికి రాజకీయ పార్టీలకు భారతదేశంలో ఉండే నైతిక హక్కు ఉందా? అని నిలదీశారు. వీటిని ఖండించలేని వారిని మనమే దేశం నుంచి బహిష్కరిస్తామని విజయసాయిరెడ్డి హెచ్చరించారు. మొత్తంగా బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడుల అంశం భారత దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసింది. విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు రాజకీయ, సామాజిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ ఘటనలపై మౌనం వహించడం దేశానికి, మానవత్వానికి ద్రోహమని విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు ప్రజల్లో భావోద్వేగాలను రేకెత్తిస్తున్నాయి.

# శ్రీశైలంలో అన్యమతం ప్రచారం

- రీల్స్ చేసినా కఠినచర్యలు తప్పవు
- హెచ్చరికలు జారీ చేసిన దేవస్థానం ఇవో



**శ్రీశైలం, డిసెంబర్20(నినాదం):** ప్రసిద్ధి పుణ్యక్షేత్రం శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయంలో అన్యమత ప్రార్థనలు, బోధనలు, రీల్స్ చేయడంపై దేవస్థానం కఠిన ఆంక్షలు విధించింది. దేవాలయంలో ఇలాంటివి చేయడం నేరమని.. చట్టరీత్యా చర్యలు తప్పవి దేవస్థానం ఈవో శ్రీనివాస్ రావు హెచ్చరించారు. శ్రీశైలం క్షేత్ర పరిధిలో ప్రత్యక్షంగా, పరోక్షంగా అన్యమత ప్రార్థనలు చేయటం, ప్రచారాలు నిర్వహించటం నిషేధమని తెలిపారు. అన్యమత బోధనలకు సంబంధించిన కరపత్రాలను, పుస్తకాలను పంచటం, అన్యమతాలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్వహించటం చట్టరీత్యా నేరమని అన్నారు. శ్రీశైలం దేవస్థాన అధికారుల ముందస్తు అనుమతి లేకుండా వీడియోలు తీయడం, డ్రోన్లు ఎగురవేయడం, సోషల్ మీడియాలో వ్యక్తిగత రీల్స్‌ను ప్రచారం చేయడం కూడా నిషేధమని స్పష్టం చేశారు. క్షేత్ర పరిధిలో ధూమపానం, మద్యపానం సేవించటం, జూదం ఆడటం, మాంసాహారాలు సేవించడం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం కూడా చట్ట రీత్యా నేరమే అని అన్నారు. దేవాదాయ ధర్మాదాయ నిబంధనలను ఉల్లంఘించి, చట్ట విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శ్రీశైలం ఆలయానికి వచ్చే భక్తులు ఈ నిబంధనలను పాటించి దేవస్థానం వారికి సహకరించాలని ఈవో శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఇటీవల ఓ యువతి శ్రీశైలం దేవాలయం ప్రాంగణంలో రీల్స్ చేయడం సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపిన విషయం తెలిసిందే. శ్రీశైలం ఆలయ నిబంధనలు ఉల్లంఘించారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా రీల్స్ చేశారంటూ నెటిజన్లు, భక్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే తనపై వచ్చిన ట్రోల్స్‌పై స్పందించిన యువతి.. తాను సాంప్రదాయం గానే చీర కట్టుకుని రీల్స్ చేశానని, శ్రీశైలం ఆలయంలో రీల్స్ చేయలేదని చెప్పుకొచ్చింది. తప్పైతే క్షమించండి అంటూ యువతి వీడియోను డిలీట్ చేసింది. ఈ క్రమంలో మరెవ్వరూ కూడా ఇలాంటివి చేయకుండా ఉండాలని ఈవో శ్రీనివాసరావు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

సంపాదకీయం

## గ్రామాల బలోపేతం
# లక్ష్యం కావాలి !

తెలంగాణ పంచాయితీ ఎన్నికలు ముగిసాయి. ఈ ఎన్నికలతోనే ఇంకా అయిపోలేదు. ముందుందు మరోమారు ఎంపిటిసి, జడ్పీటిసి ఎన్నికలు జరగాల్సి ఉంది. నిజానికి అన్నీ కలిపి ఒకే దఫాలో నిర్వహించి ఉంటే ఖర్చులు కలిసి వచ్చేవి. జమిలిగా నిర్వహించడం ద్వారా ఖర్చులు తగ్గించుకోవచ్చు. కానీ అలా జరగడం ఏ పార్టీకి ఇష్టం లేదు. అలా జరిగివుంటే ఖజానాపై భారం తగ్గేది. కానీ రాజకీయ పార్టీలకు ముఖ్యంగా అధికార పార్టీకి వరుస ఎన్నికలు జరపడం ఇష్టం. ఎన్నికలు జరిపి పాలకవర్గాలను ఎన్నిక చేయడం ముఖ్యం కాదు. ఎన్నికల్లో తమవారిని ఎన్నుకోవడం వీరికి ముఖ్యం. ఎవరు అధికారంలో ఉంటే వారే చేస్తారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ అదే చేసింది. ఇక్కడ ఓటర్లు కూడా పోయిన రాష్ట్రం అప్పుల నుంచి బయటపడే అవకాశాలను వదులు కుంటుండడానికి ఇదో నిదర్శనం. ఒకే విడతలో ఎన్నికల నిర్వహణ వల్ల అటు ప్రజలకు, ఇటు అధికారులకు కలిసి వచ్చేది. కానీ ఇప్పుడు మళ్లీ మండల, జడ్పీ ఎన్నికలతో పాటు మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మొత్తంగా ఇటీవలి పంచాయితీ ఎన్నికల్లో ప్రజల తీర్పు ఎలా ఉన్నా ఓటేయడానికి భారీగా తరలి వచ్చారు. దీంతో దాదాపు 90శాతం కూడా ఓటింగ్ దాటింది. ప్రజలు కూడా తెలివి మీరారు. అందరి వద్ద డబ్బులు తీసుకుని వేయాల్సిన వారికి ఓటేశారు. నిలదీస్తే ఒట్టు పెట్టుకుని పక్కకు జరిగారు. మాకూ ఓటేశామని బాసలు చేశారు. కొందరు ఓటమిని జీర్ణించుకోలేక తమ డబ్బులు వాపస్ ఇవ్వాలని ఊరంతా తిరిగారు. ప్రజలు మాత్రం ఎవరి వద్ద డబ్బులు తీసుకున్నా...తాము కోరుకున్న వారికే ఓటు వేసి తీర్పునిచ్చారు. అయితే అధికారంలో కాంగ్రెస్ పార్టీ ఉండడంతో సహజంగానే కాంగ్రెస్ పార్టీ బలపర్చిన వారికే ఎక్కువ ఓట్లు పడ్డాయి. ఎక్కువమంది వారే గెలిచారు. రాష్ట్రంలో తాజాగా ముగిసిన మూడు దశల స్థానిక సంస్థల ఎన్నికలు ఈ ఫలితాలనే వెల్లడించాయి. ఇవి కేవలం రాజకీయ గెలుపోటములు లెక్కలుగానే చూడాలి. ఓ రకంగా చెప్పాలంటే పార్టీ, అభ్యర్థి, డబ్బులు ఈ మూడూ ఎన్నికల్లో ప్రభావితం చేశాయి. తెలంగాణ సామాన్య ప్రజాజీవన ప్రమాణంపై ప్రజలు ఇచ్చిన స్పష్టమైన తీర్పు అని చెప్పడానికి లేదు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతు పొందిన సర్పంచ్ అభ్యర్థులు సుమారు 7 వేల పంచాయతీల్లో విజయం సాధించడం ఇందుకు నిదర్శనం. గతంలో ఎప్పుడూ లేనంతగా పంచాయితీల్లో డబ్బులు వెదజల్లారు. ఒక్కో గ్రామంలో 50లక్షల వరకు ఖర్చు పెట్టిన వారు ఉన్నారు. ఈ ప్రజా తీర్పు ప్రభుత్వ పాలితాల్లోనే కాదు, ఎన్నికల ప్రక్రియలోనూ ప్రతిబింబించింది. స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీ గుర్తులతో జరగవు. అయినా జనం డబ్బులకే ఓటేశారు. ఎందుకంటే ఎప్పుడూ లేని విధంగా గ్రామాల్లో కూడా సర్పంచ్ అభ్యర్థులు సొంత మేనిఫెస్టోలే ప్రచారం చేశారు. అయితే ఓటును సద్వినియోగం చేసుకోవాలన్న ప్రజాస్వామ్య ఆకాంక్ష ప్రజల్లో కనిపించింది. పార్టీ గుర్తులు లేకుండా జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ ఏడు వేల పంచాయతీల్లో గెలవడం కారణంగా ఇక పంచాయితీలను బలోపేతం చేయడం ద్వారా ప్రజా తీర్పును గౌరవించాలి. పంచాయితీలు ఆర్థికంగా బలపడేలా చేయాలి. ప్రజలు పార్టీ గుర్తుకు కాదు, పాలనకు ఓటు వేశారు. స్థానిక సంస్థలు అధికార వికేంద్రీకరణకు కాదు, ప్రజల స్వయం పాలనకు వేదికలని గుర్తించాలి. ఇకపోతే ఎన్నికల్లో అనేక అంశాలు ప్రభావం చూపుతాయి. అది అధికార పార్టీకి ఎప్పుడూ అనుకూలంగా ఉంటుంది. ప్రభుత్వ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు అమలవుతున్న తీరు కూడా ప్రభావం చూపింది. ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్లు, ఉచిత విద్యుత్... వంటివి మహిళలను ప్రభావితం చేసే పథకాలు. అందువల్ల ఈ ఎన్నికల్లో మహిళలు అత్యధికంగా ఓటేశారు. గృహజ్యోతి, ఉద్యోగ భర్తీల వంటి ప్రచారాలు కూడా కలిసి వచ్చాయి. రైతు భరోసా, సన్నవడ్లకు బోనస్ వంటివి అన్నదాతలో కొంత ధైర్యాన్ని నింపి ఉంటాయి. పేదవారికి ఇందిరమ్మ ఇళ్లు, సన్నబియ్యం పంపిణీ వంటివి కూడా ప్రభావం చూపాయి. రేషన్ బియ్యం అంటే ముక్కిన బియ్యం కాకుండా కిలో రూపాయికే సన్నబియ్యం ఇవ్వడం కూడా కలిసి వచ్చింది. అయితే ఇందులో కేంద్ర ప్రభుత్వ వాటానే ఎక్కువగా ఉన్నా సామాన్య ప్రజలకు ఇది బోధపడదు. నిజానికి నీళ్లు, నియామకాలు అన్న ట్యాగ్ లైన్‌తో ఏర్పడ్డ తెలంగాణ మరోమారు వంచనకు గురయ్యింది. గత ప్రభుత్వ పదేళ్ల పాలనలో నిరంతరం అప్పులు, పెండింగ్ ప్రాజెక్టులు... ఈ భారాన్ని నేటి ప్రభుత్వం మోస్తూనే ఉంది. అలగాని ఈ ప్రభుత్వం కూడా అప్పులు చేయకుండా మడికట్టుకుని కూర్చోలేదు. ఉచిత పథకాలను రద్దు చేస్తే ఎక్కడ ఉద్యోగం ఊడుతుందో అన్న భయంతో ఉచితాలకే పెద్దపీట వేస్తున్నారు. దీంతో అప్పుల భారం మరింత పెరుగుతూ పోతోంది. నేడు ప్రతి గ్రామం ప్రగతి పథంలో నడవాలంటే పంచాయితీలు బలపడాలి. పంచాయితీల్లోనే వనరులపైనే కాకుండా స్వయం సమృద్ధి సాధించేలా పాలన సాగించాలి. గ్రామపాలకుల అర్థం మారాలి. సర్పంచ్‌లు కేంద్రంగా కార్యకలాపాలు సాగాలి. ధాన్యం సేకరణ మొదలు, నీటి సరఫరా, విద్యుత్ వినియోగం, ఉచిత విద్యుత్‌పై ఆజమాయిషీ వంటి అనేక విషయాలు గ్రామ సర్పంచ్‌లకు తెలిసేలా జరగాలి. అప్పుడిది సంక్షేమంలో వారిని బాధ్యులను చేయడం ద్వారా గ్రామ స్వరాజ్యానికి పునాది వేయాలి.

# నల్లగొండలో ఎమ్మెల్యేలు సరిగా పనిచేయలేదా?

**స్థానిక ఎన్నికల్లో ఎమ్మెల్యేలో సమన్వయ లోపం**

**రాజగోపాల్ రెడ్డి తీరుపై మరోమారు చర్చ**



**నల్లగొండ,డిసెంబర్20(నినాదం):** పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ బాగా దెబ్బతిన్న జిల్లాల్లో నల్లగొండ కూడా ఉంది. ఇక్కడి ఎమ్మెల్యేలో అనైక్యత ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపింది. ఎవరికి వారే అన్న చందంగా సాగడంతో ఈ జిల్లాల్లో అనేక గ్రామాలను కాంగ్రెస్ కోల్పోయింది. ఇద్దరు మంత్రులు ఉన్నా పట్టుదలగా పనిచేసినట్లుగా కనిపించ లేదు. ఇదే విషయమై పిసిసి భేటీలో చర్చించారు. రెబల్‌గా ఉంటున్న రాజగోపాల్ రెడ్డి కూడా సరిగా పనిచేయలేకపోయారు. ఆయన మంత్రిపదవిపై ఆశపెట్టుకుని రాకపోయే సరికి సైలెంట్ అయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డికి మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాలరెడ్డి కొరకరాని కొయ్యగా మారారని పార్టీలో ప్రచారం ఉంది. మంత్రివర్గంలోకి తీసుకోవాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశించినా తీసుకోలేదని ఆయన సన్నిహితులు వాపోతున్నారు. ఆయనకు మనం మంత్రి పదవి హామీ ఇచ్చారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలప్పుడు పార్టీ గెలుపునకు సహకరించారు' అని రాహుల్ గుర్తుచేసినట్లు సమాచారం. సామాజిక సమీకరణాలను సమీక్షించి, వీలైనంత త్వరలో రాజగోపాల్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకోవాలని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌కు రాహుల్ సూచించినట్లు తెలిసింది. రెండో పర్యాయం జరిగిన మంత్రివర్గ విస్తరణలో తనకు బెర్తు ఖాయమనీ కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి భావించారు. ఆ మేరకు కాంగ్రెస్ అధిష్టానం నుంచి సంకేతాలు అందటంతో ఆయన సన్నిహితులు ప్లెక్సీలు, దండలు, బ్యాండ్‌బాజాలు సిద్ధం చేసుకున్నారు. కానీ అదే సమయంలో ఆ పార్టీ సీనియర్ నేత జానారెడ్డి అడ్డు తగులుతూ.. రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్యేలకు మంత్రి పదవీ ఇవ్వాలంటూ కాంగ్రెస్ అధిష్ఠానానికి లేఖ రాశారు. తనకు మంత్రి పదవి రాకుండా అడ్డుకునే కుట్రలో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఈ లేఖ రాయించారని రాజగోపాల్‌రెడ్డి అనేక సందర్భాల్లో తన సన్నిహితుల వద్ద ఆవేదన వ్యక్తంచేసినట్టు తెలిసింది. ఇక అప్పటినుంచి ఆయన నేరుగా సీఎం రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా పదునైన విమర్శలు చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో మొన్నటి సర్పంచ్ ఎన్నికల్లో పెద్దగా పనిచేయలేదన్న ప్రచారం కూడా ఉంది. సీఎం రేవంత్‌రెడ్డిపై రాజగోపాల్‌రెడ్డి నిరంతరం విమర్శనాస్త్రాలు సంధిస్తున్న నేపథ్యంలో సీఎం సన్నిహితవర్గం రంగంలోకి దిగింది. రాజగోపాల్‌పై భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. రాజగోపాల్‌రెడ్డి సీఎంకు వ్యతిరేకంగా మాట్లాడిన ఆడియోలు, వీడియో క్లిప్పింగులు, పత్రికా వార్తలను సేకరించి ఏఐసీసీకి పంపినట్టు సమాచారం. తమకు అనుకూలంగా ఉన్న ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ద్వారా రాజగోపాల్‌రెడ్డి మీద క్రమశిక్షణ చర్యలకు ఒత్తిడి చేయించినట్టు తెలిసింది. మంత్రిపదవి విషయంలో ఇప్పటికే వారి కుటుంబం నుంచి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి మంత్రివర్గంలో ఉన్నారని, ఉమ్మడి నల్లగొండలో ఇద్దరు రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నేతలే క్యాబినెట్‌లో ఉన్నారని కేసీ వివరించినట్టు సమాచారం. సామాజికవర్గాలను సమీక్షించి రాజగోపాల్‌రెడ్డిని సర్దుబాటు చేయాలని, తెలంగాణ నాయకత్వంతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని రాహుల్‌గాంధీ సూచించినట్టు తెలిసింది. దీంతో ఈ విషయంలో ఇంకా ఎటూ తేల్చలేక పోతున్నారని సమాచారం

# సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీతో సంకటం

**గందరగోళంలో అమెరికాలో పనిచేస్తున్న ఉద్యోగులు**

**అమెరికాను వీడి వెళ్లొద్దని గూగుల్ అడ్వయిజరీ**




**న్యూయార్క్, డిసెంబర్ 20(ఆర్ఎన్ఎ):** అమెరికా తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ పాలసీ ఇప్పుడ కలకలం సృష్టిస్తోంది. ఈ కారణంగా చాలా మంది దరఖాస్తుదారుల వీసా అపాయింట్ మెంట్లు 2026 అక్టోబరు నెలాఖరుకు వాయిదా పడినట్లు వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ కొందరు ఉద్యోగులను హెచ్చరించింది. అమెరికాను వీడి బయటకువెళ్లొద్దని అడ్వైజరీ జారీ చేసినట్లు ఈ మేరకు ఆంగ్ల మీడియా కథనం పేర్కొంది. అమెరికాకు తిరిగి రావడానికి వీసా స్టాంపింగ్ అవసరమయ్యే ఉద్యోగులు నెలలపాటు ఎదురుచూడాల్సి వస్తుందని గూగుల్ న్యాయనిపుణులు హెచ్చరించారు. ఈ నేపథ్యంలో యూఎస్ వీసాలపై ఉన్న సిబ్బంది అంతర్జాతీయ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈమేరకు యాజమాన్యం సిబ్బందికి మెయిల్ పంపింది. డిసెంబరు 15వ తేదీ నుంచి హెచ్1బీ, హెచ్4 వీసా దరఖాస్తుదారులకు సోషల్ వెట్టింగ్‌ను అమెరికా ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాంతో వీసా అపాయింట్ మెంట్లలో జాప్యం ఎదురవుతోంది. ఎఫ్, జే,ఎం వంటి వీసాల పైనా ఈ ప్రభావం ఉంటుందని గూగుల్ నిపుణులు పేర్కొన్నారు. ఇప్పటికే అమెరికా వెలుపల ఉన్నవారి విషయంలో మాత్రం ఎలాంటి సూచనలు చేయలేదు. కాగా.. కొత్త వెట్టింగ్ విధానం వల్ల వీసా ఇంటర్వ్యూలను వచ్చే ఏడాది ఫిబ్రవరి-మార్చికి రీషెడ్యూల్ చేసినట్లు ఇటీవల అమెరికా ఎంబసీ అధికారులు వెల్లడించిన సంగతి తెలిసిందే. అయితే ఈ పక్రియ మరింత ఆలస్యమవుతున్నట్లు తెలుస్తోంది. వీరి ఇంటర్వ్యూ తేదీలను ఇప్పుడు అక్టోబరు నెలకు వాయిదా వేసినట్లు మీడియా కథనాలు పేర్కొన్నాయి. వీసా దరఖాస్తుదారుల సోషల్ మీడియా ఖాతాలను క్షుణ్ణంగా స్క్రీనింగ్ చేసేందుకు అదనపు సమయం పడుతోందని, అందువల్లే ఇంటర్వ్యూలను వాయిదా వేస్తున్నట్లు అమెరికా అధికారులు చెబుతున్నారు. దీంతో దరఖాస్తుదారుల పరిస్థితి గందరగోళంలో పడింది. ఇప్పటికే అమెరికాలో ఉద్యోగాలు సాధించి.. ప్రయాణాల కోసం టికెట్లు బుక్ చేసుకున్నవారు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో గూగుల్ అడ్వయిజరీ దీనిని సమర్థించేలా ఉంది. దీంతో వచ్చే ఏడాది వరకు ఉద్యోగులకు కష్టాలు తప్పేలా లేవు.

## ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలు భాగం కావాలి

**స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా**




**ఒంగోలు,డిసెంబర్20(ఆర్ఎన్ఎ):** ప్లాస్టిక్ రహిత స్వర్ణాంధ్రప్రదేశ్‌లో ప్రజలంతా భాగస్వాములు కావాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి సూచించారు. శనివారం పొన్నలూరులో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమంలో మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి, కలెక్టర్ పి. రాజబాబు పాల్గొన్నారు. గ్రామంలో రూ.65 లక్షల విలువైన రోడ్లు, సైడ్ కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి డీబీవీ స్వామి మాట్లాడారు. ప్రజల భాగస్వామ్యంతో పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన, ఆర్థికంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాన్ని నిర్మించడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని వ్యాఖ్యానించారు. విద్యార్థుల్లో వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన అలవాట్లు పెంపొందించేందుకు ఏపీ వ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా ముస్తాబు కార్యక్రమం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ముస్తాబు కార్యక్రమాన్ని అనకాపల్లి జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ పాఠశాలలో సీఎం చంద్రబాబు లాంఛనంగా ముస్తాబు కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని చెప్పుకొచ్చారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు.

## అమెరికా సిబ్బందిపై దాడికి ప్రతీకారం

**-ఇస్లామిక్ టెర్రరిస్టులపై అమెరికాదాడి**

**న్యూయార్క్, డిసెంబర్ 20(నినాదం):** సిరియాలోని ఇస్లామిక్ స్టేట్ స్థావరాలను అమెరికా టార్గెట్ చేసింది. ఆ స్థావరాలపై అమెరికా సైన్యం వైమానిక దాడలు చేసింది. ఇటీవల అమెరికా సిబ్బందిపై సిరియా దాడి చేసిన నేపథ్యంలో ప్రతీకార దాడులకు పాల్పడినట్లు ఓ అధికారి తెలిపారు. అనుమానిత ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు సిరియాలో ఉన్న అమెరికా సైనిక సిబ్బందిపై దాడి చేశారని, దానికి ప్రతీకారం తీర్చుకుంటామని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వెల్లడించారు. ఐఎస్ఐఎస్ ఫైటర్లు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆయుధ కేంద్రాలను టార్గెట్ చేసినట్లు అమెరికా డిఫెన్స్ మంత్రి పీట్ హెగ్‌సేత్ తెలిపారు. ఆపరేషన్ హాక్‌ఐలో భాగంగా ఆ దాడి జరిగినట్లు ఆయన చెప్పారు. ఇదేమీ యుద్ధం కాదు అని, ఇది కేవలం ప్రతీకారం మాత్రమే అని ఆయన అన్నారు. మా శత్రువులను వేటాడామని, వాళ్లను చంపేశామని అన్నారు. ఈ దాడుల పక్రియ కొనసాగుతుందన్నారు. సెంట్రల్ సిరియాలో ఉన్న ఇస్లామిక్ స్టేట్‌కు చెందిన అనేక టార్గెట్లను ధ్వంసం చేసినట్లు ఇద్దరు అమెరికా అధికారులు పేర్కొన్నారు. సెంట్రల్ సిరియాలోని పల్మైరాలోఉన్న దళాలపై జరిపిన దాడుల్లో ఇద్దరు అమెరికా సైనికులు, ఓ ఇంటర్‌ప్రిటర్ మరణించారు. అమెరికా దళాలకు చెందిన సుమారు వెయ్యి మంది సైనికులు ఇంకా సిరియాలోనే ఉన్నారు.

## తిరుమలలో అధ్యయనోత్సవాలు



**తిరుమల, డిసెంబర్ 20(నినాదం):** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో 25 రోజుల పాటు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు రంగనాయకుల మండపంలో అధ్యయనోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు.ధనుర్మాసంలో వైకుంఠ ఏకాదశికి 11 రోజులు ముందు నుండి శ్రీవారి సన్నిధిలో అధ్యయనోత్సవం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ సందర్భంగా స్వామివారి ప్రాశస్త్యంపై 12 మంది ఆళ్వార్లు రచించిన దివ్యప్రబంధ పాశురాలను శ్రీవైష్ణవ జియ్యంగార్లు గోష్ఠిగానం చేస్తారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, తిరుమల శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్‌స్వామి, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో శ్రీ లోకనాథం, ఇతర అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు

**ప్రభాకర్ రావుపై విచారణ వేగవంతం**

**ఆధారాలు రాబట్టే యత్నాల్లో అధికారులు**

**హైదరాబాద్,డిసెంబర్20(నినాదం):** తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ విచారణ వేగం పెంచింది. ఈ కేసులో తెలంగాణ ప్రభుత్వం తాజాగా కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం ను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. హైదరాబాద్ సీపీ సజ్జనార్ నేతృత్వంలో సిట్ విచారణ కొనసాగనుంది. కొత్తగా ఏర్పాటు చేసిన సిట్‌లో 9 మంది అధికారులు ఉన్నారు. ఈ నేపథ్యంలో సిట్ అధికారులు శనివారం నుంచి కీలక విచారణను ప్రారంభించారు. ఈ కేసులో కీలక నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు కస్టోడియల్ విచారణ గడువును మరో వారం రోజుల పాటు సుప్రీం కోర్టు పొడిగించింది. ఇందులో భాగంగా ప్రభాకర్ రావును పోలీసులు మళ్లీ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ చేపట్టనున్నారు.వారం రోజుల విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించిన కీలక నిజాలు వెలుగులోకి వచ్చే అవకాశాలు ఉన్నాయని పోలీస్ వర్గాలు భావిస్తున్నాయి. ఈ కేసుకు సంబంధించిన కీలక ఆధారాలు, మరికొందరి పాత్రపై స్పష్టత వచ్చే అవకాశం ఉండటంతో రాజకీయ, పరిపాలనా వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ పీఎస్‌లో ప్రస్తుతం ప్రభాకర్ రావును సిట్ అధికారులు విచారిస్తున్నారు. ఈ కేసును సమగ్రంగా పరిశీలించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త సిట్‌ను నియమించగా.. ఆ బృందంతో శుక్రవారం హైదరాబాద్ సీపీ సజ్జనార్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేసు పురోగతి, విచారణ విధానం, సాంకేతిక అంశాలు, ఆధారాల సేకరణ వంటి పలు కీలక విషయాలపై సిట్ అధికారులకు సీపీ స్పష్టమైన దిశానిర్దేశర చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు శనివారం ఉదయం నుంచే పలువురు సిట్ అధికారులు జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుని విచారణ ప్రారంభించారు. అధికారులు ఈ వారం రోజుల పాటు ప్రభాకర్ రావును నిరంతరంగా ప్రశ్నించనున్నారు. సిట్ విచారణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఒక రూమ్‌ను కేటాయించారు. అక్కడే కస్టోడియల్ విచారణ జరగనుంది. ప్రభాకర్ రావును ఈ నెల 25వ తేదీ వరకు కస్టడీలో ఉంచి విచారించేందుకు సుప్రీంకోర్టు అనుమతి లభించినట్లు సమాచారం. ఇప్పటికే ఈ కేసులో అరెస్టయిన ఇతర నిందితులను కూడా సిట్ అధికారులు పిలిపించి, ప్రభాకర్ రావు ఎదుటే ప్రశ్నిస్తున్నారు.

## కాసిపేట శివారులో పెద్దపులి సంచారం

**అప్రమత్తంగా ఉండాలంటూ దండోరా**



**మంచిర్యాల, డిసెంబర్ 20 (నినాదం):** మంచిర్యాల జిల్లా కాసిపేట, బెల్లంపల్లి మండలాల శివారులో పెద్దపులి సంచారం అలజడి సృష్టిస్తుంది. బుగ్గ దేవాలయం సమీపంలో పెద్దపులిని ప్రత్యక్షంగా చూసిన పలువురు.. ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో అటవీ సిబ్బంది బుగ్గ శివాలయ ప్రాంతాల్లో పరిశీలిస్తున్నారు. కాసిపేట మండలంలోని తిరుమలాపూర్ మీదుగా బుగ్గగూడెం ప్రాంతానికి వచ్చిన పెద్దపులి.. అక్కడ సంచరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇటీవల కాలంలో బుగ్గగూడ శివారులో పెద్దపులి ఓ బర్రెను హతమార్చిన విషయం తెలిసిందే. కాసిపేట, తిర్యాణి మధ్య విస్తరించి ఉన్న అడవుల్లో సంచరిస్తున్న పెద్దపులి మళ్ళీ జనావాసాలకు దగ్గరగా సంచరిస్తుండటంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. బుగ్గ దేవాలయం వెనుక వైపు పెద్దపులి సంచరించగా, వాటి ఆధారంగా అది మాదారం వైపు వెళ్లినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. ఈ మేరకు శివారు గ్రామాల్లో, బుగ్గగూడెం గ్రామ పంచాయతీలో పెద్దపులి సంచారంపై అప్రమ త్తంగా ఉండాలని డప్పు చాటింపు వేయించారు. అడవిలోకి వెళ్లొద్దని, పశువులను తీసుకుపో వద్దని, జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు.

## ఏనుగుల గుంపును ఢీకొన్న రాజధాని

**-పట్టాలు తప్పిన 5 బోగీలు..**

**గౌహతి,డిసెంబర్20(నినాదం):** అస్సాంలో శనివారం తెల్లవారు జామున రైలు ప్రమాదం చోటు చేసుకుంది. సైరాంగ్ నుంచి ఢిల్లీ నుంచి బయల్దేరిన రాజధాని ఎక్స్‌ప్రెస్ ఏనుగుల గుం పును ఢీ కొట్టింది. ఈ ఘటనలో 8 ఏనుగులు మృతిచెందగా.. మరోకటి తీవ్రంగా గాయపడింది. ప్రమాదం ధాటికి రైలులోని 5 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ ఘటనలో ప్రయాణికు లెవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదని నార్త్‌ఈస్ట్ ఫ్రంటియర్ రైల్వే తెలిపింది. రైల్వే, అటవీశాఖ అధికారులు ఘటనాస్థలానికి సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా ఈ మార్గంలోని రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. పలు రైళ్లను దారి మళ్లించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు.

# తెలంగాణలో విద్యారంగ ప్రాముఖ్యత




మానవ వనరుల అభివ ృద్ధికి విద్యకు చాలా ప్రాముఖ్యత ఉంది .వనరుల అభివ ృద్ధి ప్రాధాన్యత ప్రాముఖ్యం అందరికీ తెలుసు. భౌతిక మూలధన సంపద లాగానే మానవ మూలధనం అక్షరాస్యత విద్య శిక్షణల ద్వారా వ ృద్ధి చెందుతుంది. భౌతిక మూలధన సంపాదన వ ృద్ధి చేస్తే ఎక్కువ ఆదాయం సంపాదించడానికి తోడ్పడుతుంది. విద్య వల్ల జ్ఞానం నైపుణ్యం పెరుగుతుంది. తత్ఫలితంగా శ్రామికుల ఉత్పాదన శక్తి పెరుగుతుంది. విద్య వల్ల ఉద్యోగ ఆదాయ ఆర్జన అవకాశాలు మెరుగవుతాయి. ఆధునిక ద ృక్పథం పెరుగుతుంది. మానవ అభివ ృద్ధికి సంబంధించిన మూడు అంశాలలో అక్షరాస్యతకు ప్రధానమైంది. మానవ అభివ ృద్ధి నివేదిక యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం (యు ఎన్ డి పి) పేర్కొన్నాయి. ప్రజలు పాఠశాలకు, కళాశాలకు వెళ్లి చదువుకోడాన్నే అక్షరాస్యత అంటారు. తెలంగాణ జిల్లాల్లో విద్యా స్థాయి విశ్లేషణ లు:1. ప్రాథమిక విద్యా స్థాయి.2 ప్రాథమికో న్నత విద్యాస్థాయి 3. మాధ్యమిక విద్యా స్థాయి 4 జూనియర్ కళాశాలల విద్యాస్థాయి, 5. డిగ్రీ కళాశాలల విద్యాస్థాయి 6.పీజీ డిగ్రీ కళాశాలల విద్యాస్థాయి. ఉన్నత పాఠశాల విద్య తర్వాత డిగ్రీ స్థాయికి పూర్వం ఉన్న రెండు సంవత్సరాల విద్యను జూనియర్ కళాశాలలో బోధిస్తారు. దీనిని ఇంటర్ విద్య అంటారు. ఈ కళాశాలలకు సంబంధించిన 2013 మరియు 2014 సంవత్సరాలలో తెలంగా ణలో 3వేల జూనియర్ కళాశాలలు పనిచేశా యి. వాటిలో నాలుగు లక్షల పైగా విద్యార్థులు చదువుకున్నారు. వీరికి చదువు చెప్పిన ఆధ్యాపకులు సుమారు 26,300 మంది. 16 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని నియమించడం జరిగింది. జిల్లాకు సగటున 300 కళాశాలలు ఉన్నాయి. వాటిలో రంగారెడ్డి హైదరాబాద్ జిల్లాలు అగ్రగాములు కాగా వెనుకబడిన అదిలాబాద్ జిల్లా 192 కంటే నిజాంబాద్ 163 జిల్లాలో కళాశాల సంఖ్య తక్కువ. అయితే కొనసాగుతున్న ఈ కళాశాలలకు నియామకమైన ఆధ్యాపకుల సంఖ్య కొంత భిన్నంగా ఉంది .సాపేక్షంగా రంగారెడ్డి జిల్లాలో 4600, హైదరాబాద్ జిల్లాలో 3 వేలకు పైగా ఆధ్యాపకులను నియమించడం జరిగింది. వెనుకబడిన అదిలాబాద్ జిల్లాలో సుమారు 1800 మంది ఆధ్యా పకులు మాత్రమే ఉన్నారు.

**తెలంగాణలోని జూనియర్ కళాశాలలు:** తెలంగాణలో మహబూబ్నగర్ జిల్లాలో మొత్తం జూనియర్ కళాశాలల సంఖ్య 259, ఇందులో చదువుతున్న విద్యార్థుల సంఖ్య 31 517 మంది, రెండవది రంగారెడ్డి జిల్లా ఇందులో కళాశాలల సంఖ్య 567 ఇందులో చదువుతున్నవారు 96, 990 మంది, మూడవది హైదరాబాద్ ఇందులో 427 జూనియర్ కళాశాలలు ఉండగా 6366 మంది విద్యార్థులు చదువుతున్నారు. మెదక్ 29 జూనియర్ కళాశాలలో ఉండగా 23,0,88 మంది విద్యార్థులు చదువుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో 163 జూనియర్ కళాశాలలు ఉండగా 26,752 మంది విద్యార్థులు చదువుతున్నారు. అదిలాబాద్ జిల్లాలో 192 జూనియర్ కళాశాలలో ఉండగా 20493 విద్యార్థులు చదువుతున్నారు. కరీంనగర్ జిల్లాలో 318 జూనియర్ కళాశాలలో ఉండగా 42,983 మంది విద్యార్థులు చదువుతున్నారు. వరంగల్ జిల్లాలో 340 జూనియర్ కళాశాలలో ఉండగా 44,000 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఖమ్మం జిల్లాలో 226 జూనియర్ కళాశాలలో ఉండగా 20439 మంది చదువుతున్నారు. నల్గొండ జిల్లాలో 299 జూనియర్ కళాశాలలో ఉండగా 36,120 మంది విద్యార్థులు చదువుతున్నారు. మొత్తంగా తెలంగాణలోని జూనియర్ కళాశాల సంఖ్య 3007కు చేరింది, విద్యార్థుల సంఖ్య 4,15,026 వరకు ఉన్నారు.

తెలంగాణలో డిగ్రీ కళాశాల విద్య: అవిభాగ్య ఆంధ్రప్రదేశ్లో జిల్లాల వారీగా డిగ్రీ కళాశాల వివరాలు ప్రకటించడం జరగలేదు. కానీ విశ్వవిద్యాల వారిగా ప్రకటించడం జరిగింది. అయితే ఈ సమాచారం ప్రభుత్వ కళాశాలకు సంబంధించింది మాత్రమే. ప్రైవేట్ విద్యా విషయాల దత్తాంశాలు సులభంగా లభించలేదు. కావున ఇక్కడ పొందుపరచడం లేదు. తెలంగాణలో ప్రైవేట్ రంగం: తెలంగాణలో ప్రైవేటు విద్య ప్రభుత్వ రంగం కంటే విస్త ృతంగా వ్యాపించి ఉంది వాటి వివరాలు ప్రస్తుతం అనవసరం. తెలంగాణలో గల విశ్వవిద్యాలయాలు. తెలంగాణలో విశ్వవిద్యాలయాల వారీగా డిగ్రీ కళాశాలలో వరసగా ఉస్మానియా విశ్వవిద్యాలయం కింద మొత్తం డిగ్రీ కాలేజీలు 51 ఉండగా ఇందులో 42,691 మంది విద్యార్థులు చదువుతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో మొత్తం 35 డిగ్రీ కళాశాల ఉండగా ఇందులో 2362 మంది విద్యార్థులు చదువుతున్నారు. శాతవాహన విశ్వవిద్యాలయంలో మొత్తం 14 డిగ్రీ కళాశాలలో ఉండగా ఇందులో 8,121 మంది విద్యార్థులు చదువుతున్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో మొత్తం 15 డిగ్రీ కళాశాలలో ఉండగా 13,464 మంది విద్యార్థులు చదువుతున్నారు. మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో మొత్తం 11 డిగ్రీ కళాశాలలో ఉండగా ఇందులో 11312 మంది విద్యార్థులు చదువుతున్నారు. తెలంగాణ విశ్వవిద్యాలయంలో 11 డిగ్రీ కళాశాలలో ఉండగా ఇందులో 1013 మంది విద్యార్థులు చదువుతున్నారు.తెలంగాణలో ఉన్న విశ్వవిద్యాలయాలు: ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్, కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్, తెలంగాణ విశ్వవిద్యాలయం నిజామాబాద్, మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం నల్గొండ, పాలమూరు విశ్వవిద్యాలయం మహబూబ్నగర్, శాతవాహన విశ్వవిద్యాలయం, కరీంనగర్, కాళోజి నారాయణరావు వైద్య విశ్వ విద్యాలయం వరంగల్, జేఎన్టీయూ విశ్వవిద్యాలయం హైదరాబాద్, జేఎన్ ఆర్కిటెక్చర్ లలిత కళా విశ్వవిద్యాలయం, ఆర్ జేయు కేటి జేఎన్ఏ విశ్వవిద్యాలయం ప్రాంగణం హైదరాబాద్, ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగ,ర్ పీవీ నరసింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, శ్రీ కొండా లక్ష్మణ్ హార్టికల్చర్ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం హైదరాబాద్, పీఎస్ తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, నల్సార్ న్యాయ విశ్వవిద్యాలయం హైదరాబాద్, ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ ఇఫ్లు హైదరాబాద్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, మౌలానా ఆజాద్ ఉర్దూ విశ్వవిద్యాలయం హైదరాబాద్, ఐసిఎఫ్ హైదరాబాద్, ఐఐటిఐ హైదరాబాద్, ట్రిబుల్ ఐటీ హైదరాబాద్, ఎన్ఐటి వరంగల్, మొత్తం తెలంగాణ వ్యాప్తంగా 24 ప్రముఖమైన విశ్వవిద్యాలయాలు తెలంగాణలో స్థాపితమై ఉండి విద్యా రంగంలో ఎనలేని మరియు ఇవే కాకుండా 335 ఇంజనీరింగ్ కాలేజీలు ఫార్మసీ కాలేజీలు నర్సింగ్ కాలేజీలు ఐటిఐలు ఏటిసి కళాశాలలో తదితర కళాశాలతో తెలంగాణ విద్యారంగం తెలంగాణ అక్షరాస్యత ఒక వెలుగు వెలుగుతుందని చెప్పడంలో సందేహం లేదు. అక్షరాస్యత పరంగా తెలంగాణ భారతదేశం కంటే తక్కువ స్థాయిలో ఉన్నప్పటికీ క్రమంగా ప్రాథమిక పాఠశాల ఉన్నత విద్య వ ృత్తి విద్యా పరంగా క్రమంగా ముందు వరసలోకి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేస్తున్న పలు సంస్కరణలు పలనాత్మకంగానే కాకుండా గుణాత్మకంగా మానవాభివ ృద్ధికి దోహదం చేస్తాయ అనడంలో సందేహం లేదు.

-పందిరి శ్రీనివాసులు.
ఎంఏ( జాగ్రఫీ) బీఈడీ, ఎంసీజె (జర్నలిజం) పిజిడిసిజే( జర్నలిజం).
ఉస్మానియా యూనివర్సిటీ





# భాషాశాస్త్రవేత్తగా 'గిడుగు'



"వాడికగద మాట ప్రాణంబు మానంబు
వాడనట్టి మాట పాడు పడును
చెల్లుబడినిబట్టి చేకొండ్రు లోకులు
మాడలైన(గవుల మాటలైన"

- గిడుగు రామమూర్తి (బాలకవి శరణ్యము)

**మహామహోపాధ్యాయ, రావుసాహెబ్, కళాప్రపూర్ణ గిడుగు రామమూర్తి (29-08-1863 ; 22-01-1940) పంతులుగారు బహుభాషావేత్త (తెలుగు, ఇంగ్లీషు, సంస్కృతం, సవర, జర్మన్, ఫ్రెంచ్ ఒరియా మొదలైన భాషలు బాగా తెలిసినవారు). భాషాశాస్త్రవేత్త. బహుభాషలు మాట్లాడడం తెలియడం వేరు. బహు భాషల స్వరూప స్వభావాలు, వాటి నిర్మాణం, వాటి చరిత్ర, వాటి పరిణామ క్రమం తెలియడం వేరు. బహు భాషలు తెలిసినవారందరూ భాషాశాస్త్రవేత్తలు కాలేరు. కాని, గిడుగువారు మాత్రం బహుభాషావేత్త. భాషాశాస్త్రవేత్త కూడా. అయితే, అనేకమంది విమర్శకులు రామమూర్తిగారిని కేవలం వ్యావహారిక భాషా వాదిగానే గుర్తించారు. కొందరు ఆయనను భాషాశాస్త్రవేత్తగా గుర్తించినా దానికి తగినన్ని ఆధారాలు చూపించ లేదు.**

"భాషాశాస్త్ర అవసరాలు మాకు తెలిసినంతవరకు మొదటిసారిగా గుర్తించిన వారు గిడుగు రామమూర్తి పంతులుగారు. సవరభాషా వ్యాకరణ నిర్మాణం కోసం ఆయన తన కాలానికి అందుబాటులో ఉన్న శాస్త్ర విషయాల్ని అధ్యయనం చేశారు. తెలుగు భాషను గురించి కూడా ఆయన శాస్త్రపద్ధతిలో ఆలోచించారనడానికి ఆధారాలున్నాయి. పై సంఘటనలవల్ల ఆయన్ని ప్రథమాంధ్ర భాషావిజ్ఞానిగా గుర్తించవలసి ఉంటుంది" అని చేకూరి రామారావుగారు అన్నారు. (రామారావు, 1972:33). "వ్యాకరణశాస్త్రకారుడు భాషా ప్రయోగంలో సాధు – అసాధు రూపాల్ని నిర్ధారిస్తాడు. భాషా విజ్ఞాని అలా కాకుండా సాధు అసాధు రూపాల వెనుకనున్న భాషా నిర్మాణ వైవిధ్యాన్ని, చారిత్రక పరిణామాన్ని వివరించే ప్రయత్నం చేస్తాడు. ఈ అర్థంలో గిడుగు రామమూర్తి తొలి తెలుగు భాషా విజ్ఞాని" (బ్రహ్మానంద 1965:46) అని హెచ్.ఎస్. బ్రహ్మానందగారు అన్నారు. ఎస్వీ సత్యనారాయణగారు "తొలి తెలుగు భాషాశాస్త్రవేత్త గిడుగు రామమూర్తి" (సత్యనారాయణ, 2008; 11–14) అనే వ్యాసంలో రామమూర్తిగారిని తొలి తెలుగు భాషావేత్తగా పేర్కొన్నారుగాని అందుకు సరైన ప్రమాణాలు చూపించలేదు. గిడుగు రామమూర్తిని తెలుగువాడైన తొలి భాషాశాస్త్ర వేత్తగా సప్రమాణంగా నిరూపించడం ఈ పత్రం ఉద్దేశం. గిడుగువారు సవరభాషకు వ్యాకరణం, వాచకాలు, నిఘంటువులు రాయడానికి, తన వ్యవహారిక భాషావాదాన్ని నెగ్గించుకోవడానికీ భాషాశాస్త్ర శాఖలైన ధ్వనిశాస్త్రం, పదనిర్మాణ శాస్త్రం, మాండలికశాస్త్రం, చారిత్రక భాషాశాస్త్రం, తులనాత్మక భాషాశాస్త్రం, నిఘంటు నిర్మాణశాస్త్రం మొదలైన వాటిని ఆధారం చేసుకున్నారు. వాటిని ఈ పత్రంలో మచ్చుకు కొన్ని చూపించడం జరుగుతుంది.

### ధ్వని శాస్త్రం (Phonetics)

1913లో డేనియల్ జోన్స్ అనే ప్రఖ్యాత ధ్వనిశాస్త్రజ్ఞుడు మద్రాసులో కొన్ని ఉపన్యాసాలివ్వడానికి వచ్చినపుడు తెలుగు భాషలోని 'మేకు – మేక', 'గోడు గోడ' లాంటి జంట పదాల్లోని మొదటి అచ్చుకూ, రెండో అచ్చుకూ ఉచ్చారణ భేదం ఉందన్న అంశాన్ని రామమూర్తి గారు ఆయనతో చర్చించగా రామమూర్తిగారి పరిశీలన సరైనదేనని జోన్స్ అంగీకరించారట (రామారావు, 1972;33). కొద్దికాలం తరువాత విజయనగరంలో జరిగిన ఒక సదస్సులో రామమూర్తిగారు విలియం జోన్స్ పద్ధతిలో Telugu Phonetics పై ఉపన్యాసాలిచ్చారట (Sheshagirirao, డిసెంబర్ 1986;227) తాటాకు, మఙ్గాకు (చూ. ఇత్వసంధి శబ్దములలో మధ్యవర్ణముపై నున్న అచ్చు కేవలము అకారము కాదు. ఆ, ఏ లకు మధ్యస్థమైన స్వరము. తాలవ్యము. ఇంగ్లీషు భాషలో (man) మాన్ అనే పదములోని అచ్చువంటిది. తెలుగు వారందరూ తరుచుగా ఉచ్చరిస్తూ ఉన్న ఈ స్వరము, దీనికి సరియైన అక్షరములేదని, విడిచిపెట్టుకోవడము వివేకము కాదు. గనుక కొత్త చిహ్నం ఒకటి కావలెను. పైని సూచించినట్లు తాటాకు అని టాపైని ఒక చుక్క పెడితే చాలును" (రామమూర్తి, 1969, 250) అని తాలవ్య వివృతాచ్చును గుర్తించడమే గాక, దానికి ఒక లిఖిత చిహ్నాన్ని కూడా సూచించారు. తెలుగు భాషలోని ఈ ధ్వనిని గుర్తించిన మొదటి వ్యక్తి బహుశా గిడుగువారే కావచ్చు. అలాగే, "A Manual of Sora Language" (1931) అనే ఈ వర్ణనాత్మక వ్యాకరణంలో సవర భాషలోని ధ్వనులనూ, సంధులనూ, సమాసాలనూ, వాక్యాలనూ భాషాశాస్త్ర పద్ధతిలో విశ్లేషించడం గమనించవచ్చు. "సవర భాషాపరంగానే కాక భాషాశాస్త్ర పరంగానూ రామమూర్తిగారు ఇందులో ఎన్నో విశేషాంశాలను చర్చించియున్నారు. కాబట్టి ఆస్ట్రిక్ భాషా కుటుంబ చరిత్ర పఠనానికి ఇది అత్యంత ఉపయోగకరమైనది". (జానకి, 1991: 41). ఈ పుస్తకాన్ని అంతా అంతర్జాతీయ ధ్వని చిహ్నాల (International Phonetic Alphabets) తో రాయడం విశేషం. ప్రతియొక్క వ్యాకర్తకు శబ్దశాస్త్రముతో తప్పక పరిచయముండాలని, అది లేనినాడు వారి ప్రయత్నమంతా వ్యర్థమౌతుందని భావించారు. Phonetic laws are the basis of all linguist research. Any etymologist who ignores them would labour invain" (జానకి, 1991: 111–112)

అజాకర్షణ (vowel harmony) అనే ధ్వని పరిమాణాన్ని ఆయన వివరించిన తీరు ఆయనకు ధ్వనిశాస్త్రంపై ఉన్న అవగాహనకు మచ్చుతునక. "ఆధునికాంధ్ర భాషలో వేలాది పదాల ఉచ్చారణను ప్రభావితం చేసిన పరమ ముఖ్య పరిణామం ప్రాచీనకాలంలోనే మొదలయిన ఒక విలక్షణ విస్తృత నియమానికి ఫలితం. దీన్ని అజాకర్షణ సూత్రం అంటారు. బహువచన ప్రత్యయం 'లు' చేరినప్పుడు 'కలిమి' అనే ఏకవచన రూపం 'కలుములు'గా మారుతుంది. ఆ లు వర్ణకంలోని అచ్చు, ఒక్క మొదటి అచ్చు మినహా తక్కిన వాటన్నిటినీ ఆకర్షించి తనలా మార్చింది. దానిమీద ఊనిక ఉంది కాబట్టి అది మారలేదు. ఈ మార్పును సంప్రదాయ వ్యాకరణం గుర్తించింది కానీ దీనికి ఆధారమైన ధ్వని సూత్రాన్ని పురస్కరించుకొని ఎక్కడా వివరించలేదు. ఈ భాషా సూత్రం తనకు తెలియని పండితుడు 'మఱుదులు' వంటి రూపాలు అదే సూత్రం ప్రకారం ఏర్పడ్డవయినా వాటిని నిషేధిస్తున్నాడు; ప్రాచీనరూపం 'మఱఁదులు' సాధువంటున్నాడు. ప్రాచీన భాషలో రెండో అక్షరంలోని అకారం తరువాత అనునాసిక ధ్వని ఉంది కాబట్టి, ఊనికతో ఉండేది కాబట్టి, దాన్ని స్పష్టంగా ఉచ్చరించవలసి వచ్చింది. ఊనిక మార్పు ఫలితంగా ఆధునిక భాషలో అనునాసికం తొలగిపోయి, ప్రత్యయాచ్చు ప్రభావంవల్ల తేలిపోయి సమీకృతమయింది. ఈ విధంగా వేల సంఖ్యలో గల పదాల్లో ఆధునిక భాష అజాకర్షణాను క్రమంలో ఉండవలసి వచ్చింది" (రాధాకృష్ణ, 1991; 38)

### పద నిర్మాణ శాస్త్రం (Morphology)

"మిశ్ర సమాసములు; ఆంధ్ర శబ్దముతో కలిసి సమాసముగా ప్రయోగించడము దోషమని, 'మడి' కట్టుకొన్న 'చాదస్తపు' పండితులు శాసిస్తే, చెల్లదు. ఒకరిని ముట్టుకోకుండా రేల్ బండిలో కూర్చొని ప్రయాణం చేయడము అసాధ్యము కదా? అట్లే వివిధ భాషలు మాట్లాడే వారితో సహవాసము చేసినప్పుడు భాషా సాంకర్యము తప్పదు. సంస్కృతములోనే చేరినవి అనేక శబ్దాలు అన్య భాషలలోనవి. (చూ. అన్యదేశ్యాలు) మేషాది రాసుల పేళ్ళు, హోర, ద్రేక్కాణ, కేంద్ర, అనఫా మొ. పారిభాషిక పదాలు గ్రీకుభాషలోనివి; వాటితో సంస్కృత శబ్దాలు చేసి సమాసమును కల్పించినారు కారా జ్యోతిశాస్త్ర నిర్మాతలు? అట్లే 'తురకలు' రాజ్యము చేసినప్పుడు 'తురక మాటల'తో తెనుగుమాటలు, సంస్కృత శబ్దాలు కలసి సమాసాలు ఏర్పడి లౌకిక భాషలో నెలకొన్నవి ఉన్నవి; ఎవరు తొలగించగలరు? 'గ్రామనాయుడు' వంటిదే 'గ్రామమునసబు' అన్ని భాషలలోను ఇట్టి సాంకర్యమున్నది. కన్నడములో 'వైరిసమాసము'లనిన్ని ఇంగ్లీషులో హైబ్రిడ్స్ (Hybrids)అనిన్ని ఇట్టివాటికి పేరు; పారిభాషిక పదముగా భాషాను శాసనము చేసినవారు పెట్టినారు. సమాసముల వ్యుత్పత్తి తెలియజేస్తుంది ఆ పేరు. అంతేకాని, అట్టి సమాసములు అసాధువులని సూచన అయినా దానిలో లేదు".

### మాండలిక శాస్త్రం (Dialectology)

"A Manual of Sora Language" లో సవర భాషలో గ్రామ గ్రామానికి తేడాలున్నాయనీ, అలాగే, వయస్సును బట్టి, స్త్రీ పురుషులను బట్టి భాషా భేదాలున్నాయనీ సవర భాషలోని మాండలికాలను గుర్తించారు. మాండలికాలవల్లనే భాష అభివృద్ధి పొందుతుందని అన్నారు. "దేశాటనము చేసేవారు తమ గ్రంథాలలో అన్యదేశ్యములేకాక మాండలికాలు కూడా యథేచ్ఛముగా ప్రయోగిస్తున్నారు. అట్టివి భాషలో అంతర్భూతములవుతూ దానిని "వృద్ధి" పొందిస్తూ ఉంటవి " (రామమూర్తి, 1938; 13, 14). తెలుగుభాష అనేక కోటి ముఖముల ప్రవహిస్తూ ఉన్నప్పుడు తెలుగు వారందరూ నేడు సరిగా ఒక్కలాటి తెలుగే వ్యవహరిస్తున్నారని చెప్పలేము. దేశమును బట్టి, జాతిని బట్టి, వృత్తిని బట్టి, మతమునుబట్టి, విద్యనుబట్టి, వయస్సునుబట్టి, నాగరకతనుబట్టి, ఎంతో కొంత వ్యత్యాసము ఏర్పడక తప్పదు" (రామమూర్తి, 1976: 116).

వాడుకభాష ఒక మండలంలో ఒక విధంగానూ, మరొక మండలంలో మరోవిధంగానూ, మరొక భాషలో మరోవిధంగానూ ఉంటుంది. అక్కడి మాటలు ఇక్కడివారికి, ఇక్కడి మాటలు అక్కడివారికి అర్థంకావు. కాబట్టి వాడుక భాష గ్రంథ రచనకు పనికిరాదనేవారి వాదానికి గిడుగువారు ఈ క్రింది విధంగా జవాబిచ్చారు. "సరే మీరన్నమాట నిజమే. ఒక మండలం వారి వ్యవహారంలో పప్పు, అద్దె, చెక్కలు, అనపకాయ అనే మాటలున్నవి. అవి రెండో మండలంవారి వ్యవహారంలో లేవు. ఆ రెండో మండలంవారి వ్యవహారంలో వాటికి సరిగా బేడలు, బాడుగ, వక్కలు, సొరకాయ అనే మాటలున్నవి. ఇవి మొదటి మండలంవారి వ్యవహారంలో లేవు. అయితే ఏమంటారు? ఏ మాటలూ వాడరాదంటారా? ఈ మాటలలో ఏదీ వాడకూడదంటే ఆ విషయం వ్రాయవలసి వచ్చినపుడు ఏలాగ వ్రాయడము? ఏ మాట ప్రయోగించము? సొరకాయవద్దు; అనపకాయా వద్దు 'అలాబూ' అని సంస్కృతంమాట వాడమంటారా? అని నేనడిగినప్పుడు నా ప్రతిపక్షులు ఒకరి మొగము ఒకరు చూచుకొని మాటాడలేక ఊరుకున్నారు.

మాండలిక శబ్దాలు అన్ని భాషలలోను ఉంటవి. అన్నీ సాధువులే. భాషాలక్షణం చేసేవారు ఈ రూపాలన్నీ సేకరించి అనుశాసిస్తారు. పాణిన్యాదులు అలాగే చేశారు. ప్రాచాం – ఈ రూపము, ఉదీచాం – ఈ రూపము అంటూ అనేకంగా మాండలిక శబ్దాలు అనుశాసించారు. మన తెలుగు కవులు మాండలిక శబ్దాలు వాడుక చేశారు. 'పప్పు' శ్రీనాథుని హరవిలాసంలోను, 'బేడలు' ఆముక్తమాల్యదలోను ప్రయుక్తములయి ఉన్నవి" అని అన్నారు. (రామమూర్తి, 1958: 156, 157) వ్యావహారిక భాష ఉద్యమాన్ని నడిపింది గిడుగు రామమూర్తిగారైనా, వీరికి ఈ ప్రేరణ కలిగించినది స్వామినేని ముద్దు నరసింహానాయనిగారు కావచ్చు. రామమూర్తిగారు పుట్టక ముందే (1856కు పూర్వమే) స్వామినేని వారు వాడుక భాష ప్రాధాన్యాన్ని గుర్తించారు. రచనల్లో గ్రామ్య పదాలను కూడ ఈయన స్వాగతించారు.

"పద వ్యాపారమునకు ఏర్పరచబడే హద్దులు భాషను రచించడమునకున్ను లిఖించడమునకున్ను సాధ్యమైనంత సులభముగా నుండవలసినది ఆవశ్యకమైయున్నది. ఆంధ్రభాషయందు కొన్ని పదములలో నొకానొక యక్షరమునకు అర్ధానుస్వారము చేరి యుండడము జరూరైనట్టు లక్షణ గ్రంథములందు చెప్పబడియున్నది కాని అటువంటి చాలా పదములు ఇప్పట్లో అర్ధానుస్వారము లేకుండానే సాధారణమైన భాషయందు వాడిక చెయ్యబడుచున్నవి. పద వ్యాపారమందు హద్దు ఏర్పరచడమునకు దేశము యొక్క వాడికయున్ను ఆధారములై యుండవలసినది గనుకనున్ను వాఁడు, వీఁడు అనే పదములు ఉచ్చారణయందున్ను వాక్య గ్రంథముల లిపియందున్న వాడు, వీడు అని వాడిక చెయ్యబడుచున్నవి గనుకనున్ను ఈ వాడిక ఉచ్చరణకున్ను లిపికిన్ని సులభముగా నున్నది గనుకనున్ను అటువంటి పదములు వాడికకు అనుగుణముగానే యీ పుస్తకమందు వ్రాయబడుచున్నవి" (ముద్దు నరసింహనాయని, 1986: 3, 4). "గ్రామ్యోక్తి ఆంధ్రభాష తాలూకు అంశములలో నొకటిగా లక్షణ గ్రంథములయందు చేర్చడము అరుదైయున్నదిగాని వాక్య గ్రంథముయందున్ను భాషయందున్ను వీటి వాడిక తరుచైయున్నది. యిందువల్ల భాషా రచన మిక్కిలి ధారాళముగా నుంచున్నది గనుక సాధారణమయిన భాషయందు వాడికలోనున్న గ్రామ్య పదములు చాలామట్టుకు సరసమయిన వాక్య రచనలో నంగీకరించ తగినవిగా నేను ఎంచుకుంటున్నాను". (ముద్దు నరసింహనాయని, 1986: 5)

### సామాజిక భాషా శాస్త్రం (Sociolinguistics)

#### ప్రమాణభాష : (Standard Language)

భాషా పదాలు వ్యవహారంలో కాలక్రమంలో ఏయే మార్పులకు పొందాయో తెలపాలేగానిమారిన రూపాలు ప్రయోగానర్హాలనడం సబబు కాదని భావించారు. కాబట్టి చారిత్రక వ్యాకరణాలే మంచివని రామమూర్తి అభిప్రాయం. ఉదాహరణకు, "మండపాక పార్వతీశ్వర శాస్త్రులుగారు "చేయాలె" అనే శబ్దము Standard కాదు అంటారు. 'చేయవలెను', 'చేయవలె' అయినది. పిమ్మట 'వ'కారము లోపించి, పూర్వాచ్చుకు దీర్ఘము వచ్చినది. ఇట్టి మార్పు తిక్కనకాలములో కనబడుతున్నది. 'పోయినవాఁడు', 'పోయినాఁడు', 'మాయలవాడు'– ఇట్టివి నన్నయ గ్రంథములో లేవుగాని తిక్కన గ్రంథములో ఉన్నవి. ఈ మార్పు క్రమంగా వ్యాపించినందున 'చేయవలె', 'చేయాలె' అయినది అందరు వాడుతూ ఉన్న శబ్దము Standard కాదా Standard అంటే అట్టిదే". అని అన్నారు. (రామమూర్తి, 1938: 12).

ఆంధ్రదేశములో అన్ని మండలముల వారికీ పరస్పర సంబంధం అన్ని విధాలా ఎప్పుడు ఏర్పడుతుందో, ప్రజలకు, నూటికి తొంభయిమంది చొప్పున అయినా, చదువు ఎప్పుడు వస్తుందో అప్పుడు ఆంధ్రభాషకు ప్రమాణ రూపం దానంతట అదే ఏర్పడుతుంది. అద్దైనా కేవలమూ ఏకరూపమున ఉండదు సుమండీ. పరమైకతగల భాష లోకములో ఎక్కడాలేదు. సృష్టిలో ఏ రెండు వస్తువులూ అన్ని విధాలా ఒక్కలాగున ఉండవు. Standard కోసము మనము పరితపించనక్కరలేదు. పండితుల ప్రయత్నంవల్ల అది ఏర్పడదు". (రామమూర్తి, 1938: 8,9) పరమైకతగల భాష లోకములో ఎక్కడా ఉండదు అనే దానికి నిదర్శనంగా Britanica–Phonetics అనే గ్రంథం నుంచి ఈ క్రింది మాటలను ఉదాహరించారు. ఆ మాటలు ఇవి : "A spoken language is, therefore, necessarily a vague and floating entity. And English is no exception to the rule...A standard spoken language is, strictly speaking an abstraction. No two speakers of standard English pronounce exactly alike" నేడు బెంగాలీ సాహిత్యంలో కలకత్తాలోని వాడుక భాషనే రచయితలు వాడుతున్నారని సునీతి కుమార్ చటర్జీ గారు A Brief Sketch of Bengali Phonetics (1921) గ్రంథంలో చెప్పిన మాటలను సాక్ష్యంగా చూపారు. సునీతి కుమార్ ఛటర్జీగారి మాటలు ఇవి:

"The Present day literary Bengali is often nothing but Calcutta colloquial, with only a few archaic inflections of the verb; it is freely used in literature, especially in poetry, drama and fiction; and there is a strong body of writers who advocate the suppression of the old literary language by this living and vigorous form of spoken Bengali" (రామమూర్తి 1976: 26) "స్వీట్ పండితుడు చెప్పినట్లు 'వచనములోని భాష మాట్లాడే భాషకు దగ్గరగా ఉంటుంది" (The language of prose often approaches very closely to that of ordinary conversation. (Henry Sweet's English Grammar Vol.1) అని స్వీట్ పుస్తకం నుంచి ఉట్టంకించారు. (రామమూర్తి, 1958:67). "మన దేశములోని భాషలన్నిటిలో బంగాళీ భాష మిక్కిలి వికాసమును పొందడమునకు కారణము దానికి "పండితులు" నిర్మించిన గట్లు కొట్టివేయడమే", (రామమూర్తి, 1938:14, 15) ఇట్టి గట్ల వల్ల ఎంత కీడు బంగాళీ భాషకు కలిగినదో శ్రీ రవీంద్రనాథ ఠాకూరు గారు తెలుపుతూ రాసిన వ్యాసంలోని వాక్యాలను ఉదహరించారు.

తరువాయి రేపటి సంచికలో...

డాక్టర్ బాణాల భుజంగరెడ్డి
అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగుశాఖ ,
హైదరాబాద్ విశ్వవిద్యాలయం
హైదరాబాద్ - 500046
సెల్: 72178 72141



---

## మార్కెట్

### ఐపీఓ షెడ్యూల్.. వచ్చే వారం 11 ఐపీఓలు




కరోనా రెమిడీస్, వేక్‌ఫిట్ ఇన్నోవేషన్, ఐసీఐసీఐ ఏఎంసీ వంటి లిస్టింగ్ లతో పాటు కేవస్‌హెచ్ ఇంటర్నేషనల్ సబ్‌స్క్రిప్షన్‌తో ఈ వారమంతా ప్రైమరీ మార్కెట్‌లో సందడి వాతావరణం నెలకొంది. వచ్చేవారమూ ఆ సందడి కొనసాగనుంది. డిసెంబర్ 22 నుంచి 26 మధ్య మొత్తం 11 ఐపీఓలు సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. ఇందులో ఒకటి మెయిన్ బోర్డు కాగా.. మిగిలినవి ఎస్ఎంఈ కేటగిరీకి చెందినవి. ఆ వివరాలు ఇవీ.. గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ: వచ్చేవారం మెయిన్‌బోర్డు కేటగిరీలో గుజరాత్ కిడ్నీ అండ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. గుజరాత్‌లో మిడ్‌సైజ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వహిస్తున్న ఈ సంస్థ రూ.250.80 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకు వస్తోంది. డిసెంబర్ 22న ప్రారంభమై 24న ముగుస్తుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.108–114గా కంపెనీ నిర్ణయించింది. పూర్తిగా తాజా షేర్ల జారీ రూపంలో ఐపీఓ జరగనుంది. ఎస్ఎంఈ కేటగిరీలో.. ఎస్ఎంఈ కేటగిరీలో వచ్చేవారం ఏకంగా 10 కంపెనీలు సబ్‌స్క్రిప్షన్‌కు వస్తున్నాయి. ఈపీడబ్ల్యూ ఇండియా రూ.31.81 కోట్లు, దాచేపల్లి పబ్లిషర్స్ రూ.40.39 కోట్లు, శ్యామ్‌ధనీ ఇండస్ట్రీస్ రూ.38.49 కోట్లు సన్‌లెక్స్ ఆయిల్ రూ.32.25 కోట్లు చొప్పున సమీకరించనున్నాయి. డిసెంబర్ 22న ప్రారంభమై 24న వీటి సబ్‌స్క్రిప్షన్ ముగియనుంది. ధారా రైల్ ప్రాజెక్ట్ రూ.50.20 కోట్లు, నంతా టెక్ రూ.31.81 కోట్లు, అడ్మాచ్ సిస్టమ్స్ రూ.42.60 కోట్లు, భాయ్ కాకాజీ పాలిమర్స్ రూ.105.17 కోట్లు, అపోలో టెక్నో ఇండస్ట్రీస్ రూ.47.96 కోట్లు చొప్పున సమీకరించేందుకు డిసెంబర్ 23న సబ్‌స్క్రిప్షన్‌కు రానున్నాయి. 26న ముగియనున్నాయి. ఈ టు ఈ ట్రాన్స్‌పోర్టేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రూ.84.22 కోట్లు సమీకరించేందుకు డిసెంబర్ 26న సబ్‌స్క్రిప్షన్‌కు రానుంది. డిసెంబర్ 30న సబ్‌స్క్రిప్షన్ ముగుస్తుంది.

లిస్టింగ్స్ ఇవే.. మెయిన్‌బోర్డు కేటగిరీలో కేవస్‌హెచ్ ఇంటర్నేషనల్ డిసెంబర్ 22న లిస్టింగ్‌కు రానుంది. డిసెంబర్ 18న సబ్‌స్క్రిప్షన్ ముగియగా.. కేవలం 83% మాత్రమే సబ్‌స్క్రైబ్ అయ్యింది. ఎస్ఎంఈ కేటగిరీకి చెందిన నెప్ట్యూన్ లాజిటెక్ కూడా అదే రోజు లిస్ట్ అవ్వనుంది. ఇదే కేటగిరీలో మార్క్ టెక్నోక్రాట్స్, గ్లోబల్ ఓషన్ లాజిస్టిక్స్ 24న,

---

## ఘోస్ట్ పెయిరింగ్.. వాట్సప్‌లో ఈ మెసేజ్ వచ్చిందా?

ఈ టెక్ యుగంలో ఎప్పటికప్పుడు కొత్త పంథాలో సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ఈ నేపథ్యంలో వాట్సప్ యూజర్లే లక్ష్యంగా కొత్త తరహా మోసం ఒకటి వెలుగులోకి వచ్చింది. డివైజ్ లింకింగ్ ఫీచర్‌ను దుర్వినియోగం చేసి, యూజర్ ఖాతాల్లోకి చొరబడుతున్నారు. దీనిని టెక్ నిపుణులు ఘోస్ట్ పెయిరింగ్ అని పిలుస్తున్నారు . పాస్‌వర్డ్స్, వెరిఫికేషన్ కోడ్స్, సిమ్ కార్డ్స్ వివరాలు చోరీ చేయాల్సిన పని లేకుండానే స్కామర్లు తమ పని కానిస్తున్నారని హెచ్చరించారు. ఈ ఘోస్ట్ పెయిరింగ్‌లో సోషల్ ఇంజినీరింగ్‌ది కీలక పాత్ర. దానిద్వారా యూజర్ వాట్సప్.. మోసపూరిత డివైజ్‌తో అనుసంధానం అయ్యేలా స్కామర్లు బురిడీ కొట్టిస్తుంటారు . ఈ మోసాన్ని గుర్తించడం కష్టం. మనకు తెలిసిన కాంటాక్ట్‌ల నుంచి 'Hey, I just found your photo!' వంటి సందేశంతో ఈ స్కామ్ మొదలవుతుంది. సందేశంలో అంతర్లీనంగా లింక్ ఉంటుంది. ఆ తర్వాత ఫేస్‌బుక్ ఫొటో వ్యూయర్ తలపించే నకిలీ వెబ్‌పేజ్ డిస్‌ప్లే అవుతుంది. అందులోని కంటెంట్ చూడాలంటే తొలుత వెరిఫై చేయాల్సి ఉంటుంది. మనకు పైకి ఇలా కనిపిస్తున్నా.. అంతర్లీనంగా డివైజ్ పెయిరింగ్ ప్రక్రియ మొదలవుతుంది. అప్పుడే ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలని యూజర్‌కు రిక్వెస్ట్ వస్తుంది. దాని తర్వాత న్యూమరిక్ పెయిరింగ్ కోడ్‌ను వాట్సప్ జనరేట్ చేస్తుంది. ఈ కోడ్‌ను వాట్సప్‌లో ఎంటర్ చేయాలని నకిలీ పేజ్‌లో ఒక సూచన కనిపిస్తుంది. ఇదంతా భద్రతా తనిఖీల్లో భాగమని పేర్కొంటుంది. ఇక ఈ కోడ్‌ను ఎంటర్ చేయగానే మనకు తెలియకుండానే స్కామర్ డివైజ్‌తో అనుసంధానం అవుతాం. దీంతో



వాట్సప్ వెబ్ యాక్సెస్ మొత్తం హ్యాకర్ చేతిలోకి వెళ్లిపోతుంది. బాధితుడి మెసేజ్‌లు అన్ని చదివేస్తాడు. యూజర్ పంపినట్టుగా ఇతరులకు సందేశాలు పంపుతాడు. ఈ ఉల్లంఘన అంతా తెలియకుండానే జరిగిపోతుంటుంది. ఈ ఘోస్ట్ పెయిరింగ్‌ను తొలుత చెక్ రిపబ్లిక్‌లో గుర్తించారు. ఇది ఇక్కడితో ఆగకపోవచ్చని నిపుణులు హెచ్చరించారు.

ఇప్పటికే హ్యాకర్ల చేతిలో చిక్కిన ఖాతాలను ఉపయోగించి, కాంటాక్ట్‌లు, గ్రూప్ చాట్‌లకు ఆ మోసపూరిత లింక్‌లను పంపే అవకాశం ఉందని పేర్కొన్నారు. లింక్డ్ డివైజ్‌ను యూజర్ మాన్యువల్‌గా తొలగించేవరకు అది యాక్టివ్‌గానే ఉంటుంది. యూజర్ దానిని గుర్తించేవరకు ఉల్లంఘనకు గురవుతూనే ఉంటారు. ఘోస్ట్ పెయిరింగ్ వంటి కేసుల్లో సాఫ్ట్‌వేర్ లోపాలకంటే మనుషుల విశ్వాసం, భయం, అవసరం వంటి మానసిక ప్రవర్తనను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడతారని నిపుణులు హెచ్చరించారు. ఇందుకోసం మనుషుల ప్రవర్తనను స్కామర్లు అర్థం చేసుకుంటారు. దానిద్వారా యూజర్ రహస్య సమాచారాన్ని బహిర్గతం చేసేలా మభ్యపెడతారు. దీనినే సోషల్ ఇంజినీరింగ్‌గా చెప్తారు. ఎప్పటికప్పుడు వాట్సప్‌లోని సెట్టింగ్స్‌కు వెళ్లి లింక్డ్ డివైజ్ ఆప్షన్‌ను పరిశీలించుకోవాలి. ఏవైనా తెలియని డివైజ్‌లు లింక్ అయి ఉన్నాయోమో గమనించుకోవాలి. స్కాన్ క్యూఆర్ కోడ్ లేక ఎంటర్ పెయిరింగ్ కోడ్స్ వంటి అభ్యర్థనలపై అప్రమత్తంగా ఉండాలి. తెలిసిన కాంటాక్ట్‌ల నుంచి వచ్చిన సందేశాలనైనా జాగ్రత్తగా ధ్రువీకరించుకోవాలి. అలాగే అదనపు భద్రత కోసం టూ స్టెప్ వెరిఫికేషన్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.

---

## స్టార్‌బక్స్ సీటీఓగా భారత సీనియర్ టెకీ

ప్రముఖ కాఫీ దిగ్గజ సంస్థ స్టార్‌బక్స్ తమ కంపెనీ చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్‌గా భారతీయ సీనియర్ టెకీ ఆనంద్ వరదరాజన్‌ను నియమించింది కస్టమర్‌లకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు స్టార్‌బాక్స్‌లో సాంకేతికతను పెంచాలనే సీఈవో బ్రియాన్ నికోల్ ప్రయత్నాల్లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపింది. సీటీఓగా డెబ్ హాల్ లెఫెవ్రే సెప్టెంబరులో పదవీవిరమణ చేశారు. ఆయన స్థానంలోకి తాజాగా ఆనంద్ వచ్చారు. కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, సీటీఓగా ఆనంద్ విధులు నిర్వహించనున్నట్లు సీఈవో బ్రియాన్ ప్రకటించారు. ఆనంద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుంచి గ్రాడ్యుయేట్ పట్టా పొందారు. వాషింగ్టన్ విశ్వవిద్యాలయంలో కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ చేశారు. ఓ ప్రముఖ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఆనంద్ వరదరాజన్ తన కెరీర్‌ను ప్రారంభించారు. ఆ తర్వాత 19 ఏళ్ల పాటు అమెజాన్‌లో విధులు నిర్వర్తించారు. ఒరాకిల్‌తో సహా పలు స్టార్టప్ కంపెనీల్లో కూడా పనిచేశారు.

---

## డౌటే లేదు.. డేటాదే హవా

డేటా.. డేటా.. తరచూ వినిపిస్తున్న పదం ఇది. సమీప భవిష్యత్తులో డేటా వినియోగం అనూహ్యంగా పెరిగే అవకాశం ఉండటంతో అంతర్జాతీయ సంస్థలను, పెట్టుబడులను మనదేశంలో డేటా కేంద్రాల వ్యాపారం ఆకర్షిస్తోంది. ఏఐ (కృత్రిమ మేధ), డేటా లోకలైజేషన్, లో లేటెన్సీ నీడ్స్ (గేమింగ్, ట్రేడింగ్, వీడియో కాన్ఫరెన్సింగ్ వంటి రియల్ టైమ్ అప్లికేషన్లు...). ఇవే మనదేశంలో డేటాకు గిరాకీ అనూహ్యంగా పెరగటానికి ప్రధాన కారణాలు. ఇటీవల కాలంలో వివిధ నగరాల్లో కొత్త డేటా కేంద్రాలు పెద్దఎత్తున ఏర్పాటవుతున్నాయి. ఈ రంగంలోకి భారీగా పెట్టుబడులు ప్రవహిస్తున్నాయి. వచ్చే రెండేళ్ల కాలంలో మనదేశంలో డేటా సెంటర్లకు రూ.55,000– 60,000 కోట్ల వరకూ పెట్టుబడులు వచ్చే అవకాశం ఉన్నట్లు ఇటీవల క్రిసిల్ రేటింగ్స్ అంచనా వేసింది. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్‌తో పాటు మరికొన్ని విదేశీ సంస్థలు, స్థానిక కంపెనీలు కొత్త డేటా కేంద్రాల ఏర్పాటులో తీరిక లేకుండా ఉన్నాయి. డేటా కేంద్రాలకు కేంద్ర ప్రభుత్వం 'మౌలిక సదుపాయాల పరిశ్రమ' హోదా ఇచ్చింది. దీనివల్ల రాయితీలు, ప్రోత్సాహకాలు లభిస్తాయి. విద్యుత్తు సరఫరా, మానవ వనరుల లభ్యత సులువవుతుంది. ఇదే కాకుండా వ్యయాలను తగ్గించే లక్ష్యంతో మూలధన ఆస్తులకు జీఎస్‌టీలో ఇన్‌పుట్ టాక్స్ క్రెడిట్(ఐటీసీ) సదుపాయాన్ని కల్పించింది. ఇవాళ ఎవరి నోట విన్నా చాట్‌జీపీటీ, గూగుల్ జెమినై... పేర్లు వినిపిస్తాయి. షాపింగ్ చేసే ముందు ఏ వస్తువు కొనాలి, ఏ బ్రాండు బాగుంది, ఇతర బ్రాండ్లతో పోలిక ఏమిటి...? అనే ఎన్నో సందేహాలకు ఏఐని మన దేశంలో వినియోగదార్లు అధికంగా వాడుతున్నారని తాజా సర్వేలు పేర్కొంటున్నాయి. ఇది ఒక చిన్న ఉదాహరణ మాత్రమే. ఇలా ఇతర విభాగాలు, అంశాలకు సంబంధించిన సమాచారం కోసం ఏఐ మీద ఆధారపటం రోజురోజుకూ పెరుగుతోందే తప్ప తగ్గే పరిస్థితి లేదు. దీనికి అనుగుణంగా ఎన్నో రకాలైన ఏఐ టూల్స్ సైతం అందుబాటులోకి వస్తున్నాయి. ఇంటర్నెట్ వినియోగం 2019లో 33.4% మాత్రమే. ఈ ఏడాది ప్రారంభం నాటికి ఇది 55.3 శాతానికి పెరిగింది. అదే విధంగా ఒక వినియోగదారుడి నెలవారీ సగటు డేటా వినియోగం 2019లో 11.5 జీబీ కాగా, ఇప్పుడు అది 32 జీబీకి చేరుకుంది. డేటా లోకలైజేషన్ నిబంధనలతో స్థానికంగా డేటాను నిల్వ చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. ప్రపంచ వ్యాప్తంగా 'జనరేట్' అయ్యే డేటాలో మనదేశం వాటా అయిదో వంతు కాగా, అంతే స్థాయిలో డేటా కేంద్రాల సామర్థ్యం లేదు. అన్ని దేశాల్లో ఉన్న డేటా కేంద్రాల సామర్థ్యంలో మన వాటా కేవలం 3 శాతం మాత్రమే. ముంబయి, చెన్నై, హైదరాబాద్ నగరాల్లో డేటా కేంద్రాల సామర్థ్యం అధికంగా ఉంది. ఈ జాబితాలో త్వరలో విశాఖపట్నం చేరనుంది. అధిక వినియోగం డేటా కేంద్రాల నిర్వాహకులకు కాసులు పండించనుంది.

## ముఖ్యమంత్రి సహాయనిధి పథకం పేదల పాలిట వరం

**3 లక్షల విలువైన ఎల్వోసీ పత్రాన్ని అందజేసిన కొలన్ హన్మంత్ రెడ్డి**



**కుత్బుల్లాపూర్, డిసెంబర్20 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ఎస్ ఆర్ నాయక్ నగర్ కాలనీ వాసులు కె రమణమ్మ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుటకు ఆర్థిక స్తోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ని బాధితులు కలిసి సంప్రదించగా వెంటనే స్పందించి రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా బాధితురాలికి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 3 లక్షల విలువైన సీఎం సహాయనిధి – ఎల్వోసీ ని మంజూరి చేయించారు. శనివారం బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎల్ఓసీ పత్రాలను కుటుంబ సభ్యులకు కొలను హనుమంత రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మైసి గారి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్దనోళ్ల సంజీవ రెడ్డి, అచ్చమ్మ, విజయ్ పాల్గొన్నారు.

## స్పీకర్ ప్రసాద్ కుమార్‌ను కలిసిన తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్



**రాజేంద్రనగర్ డిసెంబర్ 20 (నినాదం) :** తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ను తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్ తో కలిసి నర్కూడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలో సర్పంచ్ గా భారీ మెజార్టీతో గెలిచిన గడ్డం శేఖర్ యాదవ్ ను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిందని అందుకు అనుగుణంగా ప్రజలు రాష్ట్రంలో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీబలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించారని ఆయన తెలియజేశారు. నూతనంగా ఎన్నికైన సర్పంచులు ప్రజల అవసరాలకు అనుగుణంగా పనిచేయాలని ఆయన సూచించారు.

## ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్కకు వినతి



**అల్వాల్, డిసెంబర్20 (నినాదం) :** అల్వాల్ మండలంలో విధులు నిర్వహిస్తున్న విలేకరులకు ప్రభుత్వం ద్వారా ఇండ్ల స్థలాలు ఇండ్లు మంజూరు చేయాలని అల్వాల్ విలేకరులు కోరారు. శనివారం అల్వాల్ లోని లయోలా అకాడమీ వార్షికోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కు వారు ఇండ్ల స్థలాలు ఇండ్లు ఇప్పించాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విలేకరులు మాట్లాడుతూ, ప్రజాసమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే తమ వృత్తి జీవితం మధ్య స్వంత నివాస సమస్యను ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాల సమాచారాన్ని ప్రజలకు చేరవేయడంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. అల్వాల్ మండలంలో పనిచేస్తున్న అర్హులైన విలేకరులను గుర్తించి, గృహ నిర్మాణ పథకాల ద్వారా ఇండ్ల స్థలాలు లేదా ఇండ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. తమ అభ్యర్థనపై సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, అల్వాల్ మండల ప్రెస్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## గాంధీజీ పేరు తొలగింపుపై కాంగ్రెస్ నిరసన



**చేవెళ్ళ డిసెంబర్ 20:( నినాదం):** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో గాంధీజీ పేరు తొలగించినందుకు నిరసనగా ఏఐసీసీ పిలుపు మేరకు రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండల అజీజ్ నగర్ లో నేడు ఆదివారం ఉదయం గాంధీజీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం ఉంటుందని చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి భీమ్ భరత్ తెలిపారు. ఈ కార్యక్రమానికి టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రెటరీ వంశీ చంద్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చెల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, సర్పంచ్ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరూ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని భీమ్ భరత్ కోరారు.

## ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

**కుత్బుల్లాపూర్‌లో 30 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభించిన కొలను హనుమంత రెడ్డి**



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో ఆయా ప్రాంతాలలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో అభివృద్ధి పనులను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత రెడ్డి ప్రారంభించారు. అందులో భాగంగా సుభాష్‌నగర్ డివిజన్ కృషి కాలనీలో రూ.10 లక్షలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను, అంజిరెడ్డి బస్తీలో రూ.20 లక్షలతో మంజీరా వాటర్ పైప్‌లైన్ పనులను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (ఎస్‌డిఎఫ్) ద్వారా మంజూరైనా సందర్భంగా సుభాష్ నగర్ కృషి కాలనీ వాసులు భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో, అంజిరెడ్డి బస్తి సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొలను హనుమంత రెడ్డి పాల్గొని పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సౌకర్యార్థం ప్రజలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించడమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని వివరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, పార్టీ నాయకులు బి బాల్రాం శామెల్, తన్నీరు శ్రీనివాస్, కండక్టర్ హరి, పి.గోపాల, మజీద్ పాషా, వెంకట్ రెడ్డి, సత్తిరెడ్డి చంద్రకాంత్, శాంతయ్య పంతులు, ప్రభాకర్, సిద్దు, లక్ష్మణ్, రాజు, నరసింహారెడ్డి, కృష్ణంరాజు , సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవరెడ్డి, హరికిరణ్, నాగిరెడ్డి, తులసి, గురవా రెడ్డి, రాజు చారి, నాగేష్ రెడ్డి, ఆనంద్, తిరుపతి రెడ్డి, సరసింహా గౌడ్, రామ్ చందర్, చందు, కరణ్, శైలజ, అర్జున, బాలాజీ, రాహుల్, కొమురయ్య, సలోని, మల్లారెడ్డి, లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రపంచశాంతికి క్రీస్తు బోధనలే ఆదర్శం అనుసరణీయం.

**లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు**



**ఏఎస్ రావు నగర్, డిసెంబర్ 20 (నినాదం):** ప్రపంచ శాంతికి ఏసుక్రీస్తు బోధనలే ఆదర్శాలని వాటి అనుసరణీయాలే మానవాళిని ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్తాయని ఈసీఐఎల్ లైఫ్ లైన్ తులసి హాస్పిటల్ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఈసీఐఎల్ లైఫ్ లైన్ తులసి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో శనివారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. మొత్తం క్రిస్మస్ తాత వేషధారణ ప్రత్యేక పాటల కార్యక్రమాలు ప్రతి ఒక్కరిని ఆకట్టుకున్నాయి. ఛలోకులను వచ్చిన క్రిస్మస్ తాత పిల్లలందరికీ బహుమతులు చాక్లెట్లు పంచిపెట్టారు. అద్యంతం ఆనందభరితంగా భక్తి భావకంగా జరిగిన ఈ కార్యక్రమం అందరిని ఆకట్టుకుంది. అనంతరం హాస్పిటల్ ఆవరణలో కేక్ కట్ చేసిన అనంతరం ఒకరి ఒకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ సిబ్బంది, డాక్టర్లు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్రంలో దుష్టపాలన కొనసాగుతుంది

**ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా జీహెచ్ఎంసీలో శివారు మున్సిపాలిటీల విలీనం**

**బీఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**





**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ కార్పొరేషన్ బండారి లేఔట్ మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ లో నిర్వహించిన నిజాంపేట్ జీహెచ్ఎంసీ సర్కిల్ బిఆర్ఎస్ క్రియాశీల కార్యకర్తల ఆత్మీయ సమావేశానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపుపై అనుసరించాల్సిన వ్యూహాలను దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఆదాయం పెంచుకోవడానికి శివారు మున్సిపాలిటీలను జిహెచ్ఎంసి లో విలీనం చేస్తూ ప్రభుత్వం అనాలోచితంగా ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకున్నదన్నారు. రాష్ట్రంలో నేడు దుష్ట పరిపాలన కొనసాగుతుందని, ప్రజాభిప్రాయానికి వ్యతిరేకంగా, అశాస్త్రీయంగా ఏర్పాటుచేసిన విలీనంపై ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాలను తీసుకుంటూ ప్రజా కంటక ప్రభుత్వంగా పాలన నిర్వహిస్తుందన్నారు. ప్రజల్లో కాంగ్రెస్ పట్ల విసుగు, అసహ్యం పుట్టిందని, దానికి నిదర్శనమే మొన్న జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి సుమారు నాలుగు వేల స్థానాలు ప్రజలు కట్టబెట్టారన్నారు. ఈ పార్టీ ఫిరాయింపులపై ఎవరైనా ప్రశ్నిస్తే రాజ్యాంగం గురించి రాహుల్ తో మాట్లాడుకోండి అంటూ ముఖ్యమంత్రి వెకిలి నవ్వులు నవ్వుతున్నాడు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని నిజాంపేట్ కార్పొరేషన్ తో పాటు అన్నీ ప్రాంతాలను అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్ పార్టీకే దక్కుతుందన్నారు. మనం చేసిన సంక్షేమాన్ని, అభివృద్ధితో పాటు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించేలా ప్రతీ నాయకుడు, కార్యకర్త పనిచేయాలన్నారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని, ఎన్నికలెప్పుడు వచ్చిన నిజాంపేట్ పరిధిలోని నాలుగు డివిజనల్లో గులాబీ జెండా ఎగరెలా ప్రతీ నాయకుడు, కార్యకర్త సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రానికి బిఆర్ఎస్ పార్టీయే శ్రీరామ రక్ష అని, రానున్న రోజుల్లో కుత్బుల్లాపూర్ నియోజక వర్గంలోని అన్ని ప్రాంతాలలో పార్టీ పదవులతోపాటు అనుబంధ సంఘాల పదవులను భర్తీ చేసుకుంటూ పార్టీని తిరిగి మరింత బలోపేతం చేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, ఎన్ఎంసి బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్లు జ్యోతి నర్సింహా రెడ్డి, బొర్రా దేవి చందు ముదిరాజ్, పెద్దిరెడ్డి సుజాత శ్రీను, కాసాని సుధాకర్, కాసాని శిరీష వీరేష్, రాఘవేంద్ర రావు, వాకాలపుడి రవి కిరణ్, బాలాజీ నాయక్, మాజీ కోఆప్షన్ సభ్యులు ఏనుగుల అభిషేక్ రెడ్డి, చంద్రగిరి జ్యోతి సతీష్, డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, మహిళా నాయకురాలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్య పరిష్కారానికి కృషి

**నెమలి అనిల్ కుమార్**



**కాప్రా, డిసెంబర్ 20 (నినాదం) :** బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా మల్లాపూర్ డివిజన్ లో ప్రజలు ఎదుర్కుంటున్న మంచి నీటి సమస్య పరిష్కారం కోసం గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నెమలి అనిల్ కుమార్ మల్లాపూర్ జలమండలి మేనేజర్ సిరాజ్ తో కలిసి కే.ఎల్ రెడ్డి నగర్ కాలనీ, భవాని నగర్ కాలనీ, హెచ్ సి ఎల్ కాలనీలలో పర్యటించడం జరిగింది. నీటి సమస్య పరిష్కారం కోసం తగిన చర్యలు తీసుకొని త్వరలో పరిష్కరించే విధంగా ప్రత్యేక ప్రణాలికను సిద్ధం చేయాలనీ ఈ సందర్భంగా మేనేజర్ ని నెమలి అనిల్ కుమార్ కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తాండ్ర శ్రీకాంత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కోయలకొండ రాజేష్, సంయుక్త కార్యదర్శి వుండం శ్రీనివాస్, కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, లైన్ మెన్లు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగింపు పై నిరసనలు



**చేవెళ్ళ డిసెంబర్ 20 (నినాదం):** మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీజీ పేరు తొలగించడం, దుర్మార్గపు చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ జుక్కన్న గారి శ్రీకాంత్ రెడ్డి అన్నారు. శనివారం చేవెళ్ల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జుకన్న గారి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నేడు పేదల బతుకులు వెలుగులు నింపిన మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నుంచి గాంధీ పేరు తొలగించడం దుర్మార్గమని మండిపడ్డారు. నేడు చేవెళ్ళ నియోజకవర్గం మొయినాబాద్ మండలం అజిత్ నగర్ లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నియోజకవర్గం ఇంచార్జ పామేన భీమ్ భరత్ ఆధ్వర్యంలో చేపట్టబోయే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అన్నారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసిసి కార్యదర్శి చల్ల వంశీచందర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు చల్ల నరసింహారెడ్డి ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్చార్జిలు మాజీ ఎంపీలు హాజరవుతున్నారని తెలిపారు. సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

**పట్నం మహేందర్ రెడ్డి**





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టరేట్ డిసెంబర్ 20 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం పేదల కోసం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. శనివారం మేడ్చల్ జిల్లాలో శాసనమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పర్యటించి ఘట్ కేసర్ లోని బంధన్ ఫంక్షన్ హాల్ లో ఎమ్మెల్యే చామకూరు మల్లారెడ్డితో కలిసి 350 మంది లబ్ధిదారులకు రూ.4 కోట్ల 6 లక్షల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఘట్కేసర్ మండలంలో 46 మందికి, మేడిపల్లిలో 110 మందికి, కీసరలో 60 మందికి, కాప్రా లో 16 మందికి మూడు చింతలపల్లి మండలంలో 32 మందికి, మేడ్చల్ మండలంలో 86 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మహేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందరరేగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ఉచిత బస్సుల ప్రయాణాలను కల్పించడంతోపాటు అర్హులైన ప్రతి నిరుపేదకు రేషన్ కార్డులను, సన్న బియ్యం ను కొత్తగా పంపిణీ చేసిందని చెప్పారు. ఇళ్ళు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లా మైనారిటీల సంక్షేమానికి కృషి చేస్తున్నామని పేర్కొంటూ50 చర్చిలకు 30 వేల చొప్పున 15 లక్షల నిధులను మహేందర్ రెడ్డి పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తోటకూర వజ్రేష్ యాదవ్, మేడ్చల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు యాదవ్, ఆర్టీఏ సభ్యులు జైపాల్ రెడ్డి, హజ్ కమిటీ సభ్యులు ముజీబ్, ఘట్కేసర్ మండల తహాసీల్దార్ చంద్రశేఖర్, వివిధ మండలాల తాసిల్దార్ లు తదితరులు పాల్గొన్నారు.

## సెయింట్ ఆల్ఫోన్సస్ పాఠశాల్లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



**అల్వాల్, డిసెంబర్ 19( నినాదం) :** ఓల్డ్ ఆల్వాల్ లోని సెయింట్ ఆల్ఫోన్సస్ పాఠశాల 35వ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం రాత్రి కనుల పండువగా ఘనంగా జరిగినాయి. విద్యార్థుల ఆటపాటలతో పాటు, నృత్య ప్రదర్శనలతో విద్యా ప్రాంగణమంతా మార్మోగిపోయింది .ఈ కార్యక్రమము పాఠశాల కరస్పాండెంట్ జెరాల్డ్ శామ్యూల్, ప్రిన్సిపల్ చంద్రమోహన్ ల ఆధ్వర్యంలో ఘనంగా ముగిశాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ (ట్రాఫిక్ ) మేడ్చల్ కదారు వెంకట్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వారి తల్లి దండ్రులకు కొన్ని విలువైన సలహాలు ఇవ్వడం జరిగింది. విద్యార్థుల నుద్దేశించి మాట్లాడుతూ " జలం ఉంటే జీవితం ఉంటుంది కాబట్టి మీరు రోడ్లపై , నీటి కాలువల్లో చెత్త పడేయ రాదు దాని వలన నీరు కలుషితం అవుతుంది" అని అన్నారు. చిన్నారులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, జంక్ ఫుడ్స్ తినొద్దని ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని తద్వారా శారీరక దారుఢ్యం బలంగా ఉంటుందని హెల్తీ బాడి – హెల్తీ బ్రెయిన్ ఉంటుందని తెలిపారు. తల్లి దండ్రులను. ఉద్దేశించి మాట్లాడుతూ తల్లి దండ్రుల మధ్య ఉండే బంధం పిల్లల జీవితాలపై ప్రభావం చూపుతుందని, వారి మధ్య ఏ గొడవులు లేకుండా అన్యోన్యంగా ఉంటే పిల్లలు కూడా మంచి పౌరులుగా తయారు అవుతారన్నారు. వారికి ఇంట్లో చదువు కోడానికి మంచి వాతావరణం కల్పించాలి అన్నారు. అదేవిధంగా. పాఠశాల యాజమాన్యం ఖర్చుకు వెనకాడకుండా విద్యార్థులలో సామాజిక స్పృహ, ఆత్మ స్థైర్యం కల్పించడానికి.ప్రతిసంవత్సరం పాఠశాల వార్షికోత్సవం చేయడఅభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమములో కనకమామిడి రిటైర్డ్ గెజిటెడ్ హెడ్మాస్టర్ వినోద్ కుమార్ లైన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నారెడ్డి, గాంధీనగర్ పోలీస్ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ రంగారెడ్డి,తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ( ట్రెస్మ) అల్వాల్ మండల అధ్యక్షులు బి .హరినాథరావు ,సెక్రటరీ మాధవి రెడ్డి లతో పాటు పాఠశాల సిబ్బంది సతీష్,జనార్దన్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. తరువాత చదువు ఆటపాటల్లో సాంస్కృతిక కార్యక్రమాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులతో పాటు మెమొంటోలను ప్రధానం చేశారు.

# డాక్టరేట్ అవార్డు పొందడం అభినందనీయం

**డాక్టర్ వృత్తి పవిత్రమైనది**

**డా.రవీంద్ర యాదవ్, కృష్ణంరాజు**



**కొడంగల్, డిసెంబర్ 20(నినాదం) :** ఆర్ ఎంపి డాక్టర్ హనుమంతు కు డాక్టరేట్ అవార్డు రావడం అభినందనీయమని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, యూత్ కాంగ్రెస్ జాతీయ కో ఆర్డినేటర్ ఎం.కృష?ంరాజు లు అన్నారు. కొడంగల్ లో ఆర్ ఎం పి డాక్టర్ గా సేవలు అందిస్తున్న హన్మంతు కు ఇటీవల గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు డాక్టరేట్ ప్రదానం చేసిన సందరరేగా శనివారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హన్మంతు కు ఘనంగా సన్మానించారు. ఈసందరరేగా డాక్టర్ రవీంద్ర యాదవ్, కృష్ణంరాజు లు మాట్లాడుతూ, వైద్య వృత్తి పవిత్రమైనదని, వైద్య సేవలో ప్రజల మన్ననలు పొందిన హన్మంతు డాక్టరేట్ అవార్డు పొందడం గర్వకారణమని కొనియాడారు. అవార్డులు ఊరికే ఎవరికి పడితే వారికి రావని, విధినిర్వహణలో ప్రావీణ్యం ఉన్నవారికే అందుతాయని అన్నారు. అవార్డులు సమాజం లో గుర్తింపు నిస్తాయని, బాధ్యతలను పెంపొందిస్తాయని అన్నారు.

**ఉచిత వైద్యమే- డాక్టరేట్ కు తీసుకెళ్ళింది : హన్మంతు డాక్టర్**

ఆర్ ఎంపి వైద్యునిగా కొనసాగుతున్న హన్మంతు నాటు వైద్యం అందించడంలో కూడా పేరుగాంచిన వ్యక్తి. ఎంతోమంది కి నాటు వైద్యం అందించి రోగి విముక్తి చేసిన హన్మంతు,ఓ విశ్రాంత ఆర్మీ ఉద్యోగి కి మూడు నెలల పాటు ఉచితంగా వైద్యసేవలు చేసి వ్యాధిని తగ్గించారు. తనకు వైద్యం చేసి రోగాన్ని తగ్గించిన హన్మంతు వైద్యవృత్తిలో నైపుణ్యాన్ని గుర్తించిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి తనకు ఉన్న పరిచయస్తుల ద్వారా డాక్టరేట్ అవార్డు కు సహకరించినట్లు హన్మంతు అంటున్నారు. ఈవిధంగా తను అందించే నాటు వైద్యం ప్రతిభ ను గుర్తించిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ వారు తనకు డాక్టరేట్ అవార్డు ప్రధానం చేసినట్లు హన్మంతు తెలిపారు. ఈకార్యక్రమంలో సేవా ఫౌండేషన్ నిర్వాహకులు ఆర్.నరేష్ కుమార్, భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థాన పీఠాధిపతి నర్సింలు గౌడ్, జనగామ ఆశ్రమ పీఠాధిపతి అనంతయ్య స్వామి, ఆర్ ఎంపి డాక్టర్ లు సంఘం అధ్యక్షుడు డాక్టర్ మనోజ్, మెడికల్ నిర్వాహకులు శ్రీనివాస్,అంబేద్కర్ యువజన సంఘాల అధ్యక్షులు యు.రమేష్ బాబు,మాజీ సర్పంచ్ రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు

# ఏరులై ప్రవహిస్తున్న మురికి నీటి ప్రవాహాలు

**పట్టించుకోని అధికారులు**

**ఇదీ జవహర్ నగర్ వైచిత్రి**






**జవహర్‌నగర్, డిసెంబర్20 (నినాదం):** జిహెచ్ఎంసి జవహర్ నగర్ పరిధిలోని వివిధ కాలనీలలో మురికి నీరు ఏరులై ప్రవహిస్తుండగా పట్టించుకునే అధికారులే కరువయ్యారని జవహర్ నగర్ లోని వివిధ ప్రాంత ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాజీవ్ గాంధీ నగర్, సిపిఐ కాలనీ, డెంటల్ కాలేజ్ నుండి గబ్బిలాల పేట అన్ని కాలనీలలో మురుగునీరు కాల్వ ద్వారానే మురికి నీరు బయటకు వెళ్తుంది. కానీ ఈ సమస్య నిరంతర ప్రక్రియగా జరుగుతూనే ఉన్నది. ఇప్పటి వరకు ఎంతోమంది ప్రజాప్రతినిధులకు ఈ సమస్య గురించి విన్నవించినా ప్రజాప్రతినిధులు, అధికారులు, పట్టించుకున్న పాపాన పోలేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా గబ్బిలాల పేటలోని పరిసర ప్రాంత ప్రజలకు ఇబ్బందికరంగా మారిన అపరిశుభ్రతకు నిలయంగా మారిన ఈ మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ సమస్య ఇప్పటినుండి లేదని గ్రామ పంచాయతీ ఏర్పడ్డప్పటినుంచి నేటి జిహెచ్ఎంసి గా మారిన క్రమం వరకు ఈ మురికి కాలువ మాత్రం ఇప్పటివరకు కూడా పరిష్కారం కాకుండానే ఉన్నదని ఇప్పటికైనా చిన్న పిల్లలు వృద్దులు మహిళలు నడవడానికి ఇబ్బందికరంగా ఉండడంవల్ల మురికి కాల్వల వల్ల దోమలు ఈగలు కుక్కలు మొదలగునవి స్వైర విహారం చేస్తున్నాయని, సూక్ష్మ క్రిముల వల్ల ప్రజలకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, వైరల్ ఫీవర్లు మొదలగు అంటు వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని అధికారులు మున్సిపల్ సిబ్బంది పట్టించుకోకపోవడం దురదృష్టకరమని ఇప్పటికైనా అధికారులు స్పందించి దీనికి శాశ్వత పరిష్కారం చూపించాలని జవహర్ నగర్ ప్రజలు కోరుకుంటున్నారు.



## బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చంద్రగిరి సతీష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్, డిసెంబర్ 20 (నినాదం):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్టకు చెందిన చంద్రగిరి సతీష్ బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు జన్మదిన వేడుకలు సందర్భంగా చంద్రగిరి సతీష్ బి ఆర్ ఎస్ పార్టీ ఎల్ పి, విప్ ఎమ్మెల్యే కేపీ వివేకానందును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంద్రగిరి సతీష్ కు శాలువా కప్పి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ కు చెందిన పలువురు బి ఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్లు, మహిళ నాయకులు, ముఖ్య నేతలు పాల్గొని చంద్రగిరి సతీష్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# రాజకీయ జన్మనిచ్చిన గడ్డ.. హుజురాబాద్

- ఆదర్శ నియోజక వర్గంగా తీర్చిదిద్దుతా
- గ్రామాల అభివృద్ధికి ఎమ్మెల్సీ నిధుల కేటాయింపు
- మీడియా సమావేశంలో ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్





**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**

రాజకీయంగా జన్మనిచ్చి శాసనమండలి సభ్యునిగా ఈ స్థాయిలో నిలబెట్టిన హుజురాబాద్ గడ్డ రుణం తీర్చుకుంటానని టిపిసిసి ఉపాధ్యక్షులు ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం ఇల్లందకుంట మండల కేంద్రంలోని అపర భద్రాద్రిగా ప్రసిద్ధి చెందిన శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు రావడంతో ఆలయ పూజారులు శేషం రామాచార్యులు వంశీధరాచార్యులు పూర్ణకుంభంతో మేళ తాళాల మధ్య ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నాయకులు కాంగ్రెస్ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. దేవాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం హుజురాబాద్, వీణవంక , ఇల్లంతకుంట, జమ్మికుంట మండల, గ్రామాలలో గెలిచిన సర్పంచ్ లను శాలువాలతో ఎమ్మెల్సీ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజురాబాద్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందించడంతోపాటు తన ఎమ్మెల్సీ నిధులను కేటాయించి రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు.బిఆర్ఎస్, బిజెపి పార్టీలు రెండు ఒకటే కాంగ్రెస్ కార్యకర్తలను ఓడించడానికి భారీ మొత్తంలో ఖర్చు చేసి రాజకీయం చేశారని, ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించిన రాబోయే రోజుల్లో హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందడంతో పాటు ముఖ్యమంత్రి సహాయ నిధి సీఎం ఫండ్ , ఎల్ఓసి ల ద్వారా సహాయనిధి ఇప్పించేందుకు తాను ఎల్లవేళలా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి చాలామంది పార్టీని ఆదరిస్తూ వస్తున్నారని అలాంటి వారికి ఎప్పుడు కాంగ్రెస్ పార్టీ స్వాగతం పలుకుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటి కుటుంబ సభ్యులుగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ అన్నివేళలా అందుబాటులో ఉండి సహాయ సహకారాలు అందజేస్తానని , గ్రామీణ ప్రాంత ప్రజలు సైతం కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ఆదరిస్తూ గ్రామ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పిసిసి మెంబర్ పత్తి కృష్ణారెడ్డి, దేవాలయ చైర్మన్ ఇంగిలే రామారావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అరుకాల వీరేశలింగం పొనగంటి మల్లయ్య, ఎర్రబెల్లి రాజేశ్వరరావు, వీణవంక మాజీ మండల అధ్యక్షుడు చింతల శ్యాంసుందర్ రెడ్డి, సింగిరెడ్డి రంజిత్ రెడ్డి, ఉమ్మడి సందీప్. చిన్నాల శ్రీకాంత్ యాదవ్ సదాశివరెడ్డి వేముల పుష్పలత సలీం కనుమల్ల సంపత్ వంగ రామకృష్ణ బల్మూరి మాధవరావు డాన్ రమేష్ సన్నీ ఒల్లాల శ్రీనివాస్ తో పాటు ఇటీవల నూతనంగా ఎన్నికైన సర్పంచులు వార్డు మెంబర్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న రామకృష్ణాపూర్ సర్పంచ్

**సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ...**
**అభివృద్ధికి అండగా ఉంటానని హామీ...**

**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**

వీణవంక మండలం రామకృష్ణాపూర్ సర్పంచ్ గా గెలిచిన దూడపాక శ్రీ వేణి రాజు శనివారం ఎమ్మెల్సీ టీపీసీసీ ఉపాధ్యక్షులు డాక్టర్ బల్మూరి వెంకట్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ. యూత్ కాంగ్రెస్ నాయకులు చిన్నాల శ్రీకాంత్ యాదవ్ ఆధ్వర్యంలో రామకృష్ణాపూర్ సర్పంచ్ కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పార్టీలకు అతీతంగా గెలిచిన ప్రతి ఒక్కరిని కాంగ్రెస్ పార్టీ ఆహ్వానిస్తుందని గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. హుజరాబాద్ నియోజకవర్గంలోని అన్ని గ్రామ పంచాయతీలకు తమ వంతు సహాయ సహకారాలు అందిస్తానని గెలిచిన ప్రతి సర్పంచ్కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. గ్రామాల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ప్రతి ఒక్కరు తమ గ్రామ అభివృద్ధి కొరకు కాంగ్రెస్ పార్టీలో చేరాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ పార్టీలో క్రియాశీల పాత్ర పోషిస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులకు ఎన్ ఎస్ యు ఐ నాయకులకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు మైనార్టీల నేతల ను ఎమ్మెల్సీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో హిమ్మత్ నగర్ సర్పంచ్ వినవక మాజీ మండలాధ్యక్షుడు శ్యాంసుందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్‌ను వినియోగించుకోవాలి

**మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్**

**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**



రాష్ట్ర ప్రభుత్వం యాసంగి పంట కాలానికి సంబంధించిన యూరియా డిస్ట్రిబ్యూషన్ కొరకు ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ ను తీసుకురావడం జరిగిందని మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మడిపల్లి, నాగంపేట్, తనుగుల గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి ఖాదర్ హుస్సేన్, ఏఈఓ లు రాంప్రసాద్, మహేందర్, అచ్యుత్ లు అవగాహన కార్యక్రమము నిర్వహించారు.ఈ యాప్ ను రైతులు వారి మొబైల్లో ఇన్స్టాల్ చేసుకుని భూమి పట్టా పాస్ బుక్ కు అనుసంధానించబడిన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయి యూరియా బస్తాలను బుకింగ్ చేసుకునే అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. భూమి విస్తీర్ణాన్ని పంట రకాన్ని బట్టి ఎరువుల మోతాదును ఈ యాప్ లో నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. పంట భూమి ఆధారంగా రైతులకు అవసరమైన యూరియా బ్యాగుల సంఖ్య యాప్‌లో చూపిస్తుందని అవసరమైన బ్యాగుల సంఖ్య ఎంటర్ చేసి స్టాక్ ఉన్న డీలర్ షాప్‌ను ఎంపిక చేసి బుకింగ్ కన్ఫర్మ్ చేయాలని తెలిపారు. బుకింగ్ చేసుకున్న యూరియా బస్తాలను 24 గంటలలో దుకాణానికి వెళ్లి కొనుగోలు చేసుకోవచ్చునని సూచించారు.1 ఎకరం విస్తీర్ణం ఉన్న రైతు 1 స్పెల్ లో, 1 – 5 ఎకరాలు ఉన్న రైతు 2 స్పెల్స్, 5 – 20 ఎకరాలు ఉన్న రైతు 3 స్పెల్స్, 20 ఎకరాల కంటే ఎక్కువ ఉన్న రైతు 4 స్పెల్స్ , ఇలాప్రతి స్పెల్ మధ్య 15 రోజుల గ్యాప్ తో బస్తాలను కొనుగోలు చేసుకోవాలని తెలిపారు.పట్టాదార్ పాస్‌బుక్ కలిగిన రైతులే కాకుండా, కౌలు రైతులు, పట్టాదార్ పాస్‌బుక్ లేని రైతులు కూడా యూరియా బస్తాలను కొనుగోలు చేయవచ్చునని సూచించారు.ఈ ఫర్టిలైజర్ బుకింగ్ యాప్ ద్వారా ఎరువుల పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. డీలర్ షాప్‌ల వద్ద గందరగోళం, క్యూ లైన్లు తగ్గుతాయని పంట, భూమి విస్తీర్ణం ఆధారంగా న్యాయమైన కేటాయింపు జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా కౌలు రైతులకు కూడా యూరియా అందుబాటులోకి వస్తుందని ఈ యాప్ యూరియా కొనుగోలు కొరకు మాత్రమే నిర్దేశించబడిందని తెలిపారు.ఈ ఫెర్టిలైజర్ బుకింగ్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించి వారి అనుమానాలను నివృత్తి చేసినట్లు అధికారులు తెలిపారు.



# శ్రీనివాస్ నాయక్‌పై తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నాం

**లెదర్ పార్క్ చర్మకారుల సంఘం**

**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**

తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషనల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎండి శ్రీనివాస్ నాయక్ పై తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నాం అని జమ్మికుంట లెదర్ పార్క్ చర్మకారుల సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఎండి శ్రీనివాస్ నాయక్ ఎస్టి సామాజిక వర్గానికి చెందినవారు అయినందున కొందరు వ్యక్తులు కక్ష పూరితంగా చైర్మన్ డైరెక్టర్ పదవులను ఆశించి సంఘాల పేర్లతో వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు అని అన్నారు.ఈ విమర్శలు చేసే సంఘాల నాయకులు మాదిగ సంఘాల పేర్లతో అనుచిత వ్యాఖ్యలు చేసే బదులు ముఖ్యమంత్రి రాష్ట్ర మంత్రుల దగ్గరికి వెళ్లి నిధులు మంజూరు చేయాలని వాటికోసం పోరాటం చేయాలని వెనుకబడిన సామాజిక వర్గం ఎండి పై మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం బడ్జెట్ మంజూరు చేయకపోవడం వలన నిధులు మన సంఘానికి అందలేదని అందులో ఎండి చేతిలో ఏమీ లేదని ఎండి నిధులు మంజూరు చేయలేదని అనడంలో అర్థం లేదని తెలిపారు. ఇప్పటివరకు లెదర్ పార్క్ భూములు అన్యాక్రాంతం కాలేదని అయినట్లు ఆధారాలు కూడా లేవని తప్పుడు ఆరోపణలు తప్ప ఏమీ లేదు ఇట్టి విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ తెలంగాణ లెదర్ పార్క్ సాధన, చర్మకారుల ఉత్పత్తి దారుల సంక్షేమ సంఘం జమ్మికుంట అధ్యక్షుడైన మోతే స్వామి ఆధ్వర్యంలో ఎండి కి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు మోత స్వామి ఉపాధ్యక్షుడు మారపల్లి పోశెట్టి ప్రధాన కార్యదర్శి మారుమూల లక్ష్మయ్య ప్రాంతాల్లో శీను రాజయ్య గడ్డం సుదర్శన్ వంతడుపుల కొమరయ్య శనగరం శ్రీనివాస్ ఇమ్మడి రాజు యేసయ్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి నట్టేట ముంచారు

- బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్ రెడ్డి
- లక్షల రూపాయలు నష్ట పోయానని ఆవేదన
- మండల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా

**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**



వీణవంక మండలం కనపర్తి గ్రామానికి చెందిన సీనియర్ బీజేపీ నాయకుడు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శి ఆలేటి శ్రీనివాస్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశాడు. మొన్న జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో తాను కనపర్తి గ్రామ సర్పంచ్ గా బీజేపీ బలపర్చిన అభ్యర్థిగా పోటీ చేశానని, నాకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి, వీణవంక మండల అధ్యక్షుడు బత్తిని నరేష్ , డాక్టర్ నరసింహ రాజు తీవ్ర అన్యాయం చేశారని తెలిపారు.మా గ్రామానికి ఈటల రాజేందర్ వస్తె పలితం వేరేలా వుండేదని,ఈటల రాజేందర్ ప్రచారానికి వస్తె నీకు పార్టీ నుండి ఎలాంటి సహకారం వుండదని,నీవు ఈటల రాజేందర్ ప్రోగ్రాం క్యాన్సల్ చేసుకుంటే నీకు కర్చు మొత్తం పెట్టుకుంటామని,నీకు అన్నివిధాల అండగా ఉంటామని చెప్పిన జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణా రెడ్డి,మండల అధ్యక్షుడు నరేష్ లు చివరకు తనను మోసం చేశారని అవేదన వ్యక్తం చేశాడు.నన్ను ఒక్కడినే కాదు మండలంలోని అనేక మంది బీజేపీ సర్పంచ్ అభ్యర్థులను వారు మోసం చేశారని ఆరోపించారు. ఈలాంటి వారి నాయకత్వంలో పని చేయడం ఇష్టం లేక తన పదవికి రాజీనామా చేస్తున్నానని తెలిపారు.ఇప్పటికైన బీజేపీ రాష్ట్ర నాయకత్వం కలుగజేసుకొని పార్టీని బ్రతికించాలని విజ్ఞప్తి చేశారు.గతంలో కూడా రెండు పర్యాయాలు ఇలాగే జరిగిందని ఇలాంటి సంఘటనలు ఎవరికి జరగకుండా చూసుకోవాలని పార్టీ అధిష్టానాన్ని కోరడం జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు ఎందుకంటే తను ఒక్కసారి కాదు గతంలో కూడా ఇలా చేయడం వల్లనే నేను ఓడి పోయానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు అందుచేత వీరిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా వర్ధంతి వేడుకలు

**జిల్లా రజక అధ్యక్షులు రాచకొండ నరేష్**

**కరీంనగర్, డిసెంబర్ 20(నినాదం)**



కరీంనగర్ జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో సంత్ గాడ్గే బాబా 70వ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నరేష్ బాబా జీవిత చరిత్రను వివరిస్తూ సంత్ గాడ్గే బాబా సుచి శుభ్రత సామాజిక భద్రత గురించి సంతు గాడ్గే ఆశయాలు నేటి సమాజానికి ఎంతో దోహదపడతాయని అదే విధంగా మా రజక జాతి కూడా వారి స్ఫూర్తిదాయకమైన విధానాన్ని మా శ్రమతో కూడిన వృత్తిగా సమాజ సేవ చేయుచున్నాము, రజకులు సంగటితమై స్థానిక సర్పంచ్ ఎన్నికలు సర్పంచులుగా వార్డ్ నంబర్లుగా గెలుపొందడం ఎంతో శుభ పరిణామం రానున్న రోజుల్లో ఎంపీటీసీ, జెడ్పిటిసి ఎన్నికల్లో పాల్గొనాలని జిల్లా రజక సంఘం తరపున పిలుపు నిచ్చారు.రజకుల సంతులిత అభ్యున్నత విధానాన్ని పెంపొందించే విధంగా గాడ్గే బాబా ఆశయాల అనుగుణంగా, జిల్లా రజక సంఘం కండువాను ఆవిష్కారణ చేశారు. రజక సంఘం గౌరవ అధ్యక్షులు కొత్తకొండ రాజయ్య చేతుల మీదుగా చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రచన కరీంనగర్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు లింగంపల్లి నాగరాజ్ చేతుల మీదుగా, జిల్లా అధ్యక్షుల రాచకొండ నరేష్, ప్రధాన కార్యదర్శి కొత్తకొండ శ్రీనివాస్ కు కండవను బహుక రించడం జరిగినది ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షులు, పూసల సంపత్ , డ్రై క్లీనింగ్ అసోసియేషన్ అధ్యక్షులు బూత్కూరి శివ కృష్ణ, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ గంగిపల్లి విష్ణు, జిల్లా నాయకులు వనపర్తి శంకర్, కొత్తకొండ లక్ష్మీనారాయణ, కొత్తకొండ లక్ష్మణ్, రాచకొండ కొమురయ్య , పొన్నాల తిరుపతి, రాచకొండ శ్రీనివాస్, నేదునూరి మహేష్, పొన్నాల అజయ్, నగునూరి ఎల్లయ్య, పొన్నాల సంజీవ్, దురిచేట అజయ్, గంగాధర కళ్యాణ్, మునిగంటి లింగయ్య, లింగంపల్లి వెంకటేష్, ముంజంపల్లి లింగయ్య, లింగంపల్లి కనకయ్య, రాచకొండ ఉమేష్, పత్తిపాక ఆంజనేయులు, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రీ పోలింగ్‌కై పైడిపల్లి గ్రామస్థుల నిరసన



**వెల్గటూర్,డిసెంబర్20(నినాదం న్యూస్):**

మండలంలో ఈ నెల 17వ తేదీన జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో పైడిపల్లి గ్రామంలో ఎన్నికల కౌంటింగ్ లో అవకతవకలు జరిగాయని ఓ వర్గం అభ్యర్థి మద్దతు ధరలు ఎన్నికల రోజు నుండే ఆందోళనకు దిగారు.గత కొన్ని రోజులుగా గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో సర్పంచ్ గా ఎన్నికైన గంగుల మంగ అనుచరులు కౌంటింగ్ జరిపేటప్పుడు బ్యాలెట్ బాక్స్ మాయం చేశారని సమీప అభ్యర్థి జక్కుల మమత శేఖర్ వర్గీయులు ఎన్నికల రోజునే తీవ్ర ఆందోళనకు దిగి పోలీసులతో,సిబ్బందితో గొడవకు దిగారు.కౌంటింగ్ లో అవినీతికి పాల్పడి గెలిచారని.. రీ పోలింగ్ జరపాలని,సోమవారం జరిగే ప్రమాణ స్వీకారాన్ని ఆపివేయాలని డిమాండ్ చేస్తూ.. శనివారం ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు.గ్రామస్థుల నిరసనకు ఉమ్మడి మండల భాజపా నాయకులు మద్దతు తెలిపారు. ఎంపీడీవో వెంకట్ ప్రసాద్ కు వినతి పత్రం అందజేశారు.రీ పోలింగ్ జరిపే వరకు పోరాటం కొనసాగిస్తామని,గ్రామస్థులపై పెట్టిన అక్రమ కేసులు బేషరతుగా ఎత్తివేయాలని భాజపా నాయకులు కొమ్ము రాంబాబు,శేఖర్, నాయకులు డిమాండ్ చేశారు.



## బిజెపి సర్పంచ్‌లకు ఘన సన్మానం

**బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు**

**జమ్మికుంట డిసెంబర్ 20 (నినాదం)**

ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో విజయం సాధించిన ఇల్లందకుంట మండలంలోని కనగర్తి టేకుర్తి గ్రామ సర్పంచ్ రామంచ సంపత్ మరియు ఉప సర్పంచ్ వట్టపల్లి శరత్ వార్డు మెంబర్లు మాడుగుల శ్రీలత, కలకోటి సమ్మయ్య, రామంచ స్వప్న, బచ్చల సుమలత, బచ్చలి మౌనిక ను జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు,హుజూరాబాద్ నియోజక వర్గ కన్వీనర్ మాడ గౌతం రెడ్డి,ఇల్లందకుంట మండల మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంపత్ రావు, తిరుపతి రెడ్డి లు మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించిన గ్రామ ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో బిజెపి అభ్యర్థులు గెలిచిన గ్రామాల్లో ఈటల రాజేందర్ గారి సహకారంతో పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి గ్రామాలను అభివృద్ధి పరుస్తామని సంపత్ రావు, తిరుపతి రెడ్డిలు హామీ ఇచ్చారు. రాబోయే ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికల్లో హుజూరాబాద్ నియోజకవర్గంలో బిజెపి సత్తా చాటుతుందని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రబెల్లి సంపత్ రావు అసెంబ్లీ కన్వీనర్ మాడ గౌతంరెడ్డి మాజీ మండల అధ్యక్షులు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి నాయకులు ఉప్పుల శ్రీనివాస్ రెడ్డి దుశేటి ఓంకార్ మట్ట బాల్ రెడ్డి బచ్చలి సతీష్ బచ్చలి భాను రామంజి సుధాకర్ కొమ్ము అశోక్ అనిల్ కార్యకర్తలు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## అంగరంగా వైభవంగా అయ్యప్ప పడిపూజ

**కరీంనగర్, డిసెంబర్ 20(నినాదం)**

తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ గ్రామంలో నిర్వహించిన అయ్యప్ప పడిపూజ ఆధ్యాత్మికతతో పాటు శాస్త్రీయ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలిచింది. బోనాల కనుకయ్య–విజయ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహాపడి పూజ మహోత్సవం, అయ్యప్ప స్వామి వ్రత దీక్షల సారాన్ని ప్రతిబింబిస్తూ భక్తుల్లో అపారమైన ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపింది.శాస్త్రోక్త విధానంలో, శ్రీ శాస్తా అర్చన రత్నం బ్రహ్మశ్రీ శ్రీ సంకేపల్లి భరత్ కుమార్ శర్మ (బాలు) గురుస్వామి (శ్రీ సుబ్రమణ్య స్వామి ఉపాసకులు) వారి వైదిక నిర్వహణలో జరిగిన పూజా కార్యక్రమాలు భక్తులను అంతర్ముఖులను చేశాయి. దీక్ష, నియమాలు, సమానత్వ భావనను ప్రతిపాదించే అయ్యప్ప తత్వం.కుల, మత భేదాలకు అతీతంగా అందరినీ ఒక్కటిగా నిలబెట్టే సందేశాన్ని ఈ కార్యక్రమం స్పష్టంగా చాటింది.ఈ వేడుకలకు అతిథిగా హాజరైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ భక్తులతో కలసి స్వామి దర్శనం చేసుకుని, గ్రామంలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సామాజిక ఐక్యతకు దోహదపడతాయని పేర్కొన్నారు.అధిక సంఖ్యలో అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొనడంతో మహాత్మా నగర్ పరిసరాలు శరణు ఘోషలతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సూర్య దినపత్రిక బ్యూరో బోనాల వెంకటేష్, ఆంధ్రప్రభ జిల్లా బ్యూరో బోనాల మల్లికార్జున్, జనగామ రాజేంద్రప్రసాద్, కంటాయపాలెం వంశీకృష్ణతో పాటు, పలువురు అయ్యప్ప స్వాములు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## కార్పొరేషన్‌లో పదవికాలం పూర్తి అయిన తొలగించని పేర్లు

**కరీంనగర్, డిసెంబర్ 20(నినాదం)**



మునిసిపల్ కార్పొరేషన్‌లో కార్పొరేటర్ల పేర్ల తొలగింపు .వారి యొక్క పదవికాలం పూర్తి అయిపోయి సంవత్సరం గడిచిన ఇంత వరకు నగరపాలక సంస్థ సెకండ్ ఫ్లోర్ లో 60 మంది కార్పొరేటర్ల పేర్లు వాళ్ళ కాల పరిమితి అయిపోయినప్పటికీ ఆ పేర్లను ఎందుకు తొలగిస్తలేరని యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీ మహమ్మద్ అజీమ్ డిమాండ్ చేశారు. పేర్లను తొలగించాలని అధికారులను, కోరారు. అలాగే 45వ డివిజన్ లో మహమ్మద్ అజీమ్ కృషి వల్ల శనివారం రోజున ఎండిన చెట్టును మున్సిపల్ అధికారులు, లైనింగ్ స్పెక్టర్ కొంతమంది అధికారులు కలిసి, ఆ చెట్టును తీసేయడం జరిగింది. సంతోషం వ్యక్తం చేసిన కాలనీ ప్రజలు.ఈ సందర్భంగా అజీమ్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# బహుజన ఉద్యమకారుడు చెప్యాల ప్రభాకర్ ప్రథమ వర్ధంతి

**నివాళులు అర్పించిన జేఏసీ నాయకులు**

**భీమదేవరపల్లి డిసెంబర్ 20 (నినాదం)**



హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ధర్మారం గ్రామంలో బహుజన ఉద్యమకారుడు చెప్యాల ప్రభాకర్ ప్రథమ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజా సంఘాల జేఏసీ నాయకులు కవ్వ లక్ష్మారెడ్డి భీమదేవరపల్లి జెఏసి చైర్మన్ డ్యాగల సారయ్య పాల్గొని చెప్యాల ప్రభాకర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బస్సు సౌకర్యం కూడా సరిగా లేని మారుమూల గ్రామం లో జన్మించి బహుజన చైతన్యం కొరకు నాటి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి ప్రజలను చైతన్య పరచాడని, తెలంగాణ ఉద్యమంలో జేఏసీ ఆధ్వర్యంలో వారు చేసిన పోరాటాలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో చెప్యాల ప్రకాష్, మాట్ల వెంకటస్వామి, కండే సుధాకర్, మాట్ల హరికుమార్,అంబాల చక్రపాణి, కొమ్ముల నాగేష్, జగదీష్, పచునూరి కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## శాయంపేట సర్పంచ్ సురేందర్ రావుకు ఘన సన్మానం

**జమ్మికుంట, డిసెంబర్ 20 (నినాదం)**



జమ్మికుంట మండలం శాయంపేట గ్రామ సర్పంచ్ గా భారీ మెజార్టీతో విజయం సాధించిన సురేందర్ రావును శనివారం కరీంనగర్ జిల్లా కేడీసీసీ బ్యాంక్ మాజీ వైస్ చైర్మన్ పింగళి రమేష్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో నిలుచొని శాయంపేట గ్రామ ప్రజల ఆశీర్వాదంతో గెలుపొందిన సురేందర్రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తూ గ్రామ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. అనంతరం సురేందర్రావు మాట్లాడుతూ, శాయంపేట గ్రామ ప్రజల ఆశీర్వాదంతో సర్పంచిగా గెలిచానని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిష్పక్షపాతంగా సుపరిపాలన అందించి గ్రామ అభివృద్ధికి పాటుపడతానని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ యూత్ నాయకులు అఖిల్ గౌడ్ పాల్గొన్నారు.

## జాతీయ సమైక్యత క్యాంపునకు ఎన్ఎస్ఎస్ విద్యార్థి



**వనపర్తి ప్రతినిధి,డిసెంబర్ 20 (నినాదం):** ఈనెల 22 నుంచి 28 వరకు మేడ్చల్ లోని దుండిగల్ లో వారం రోజుల పాటు జరిగే జాతీయ సమైక్యత క్యాంపుకు బి.శివరాజ్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ రఘునందన్ తెలిపారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల (కోఎడ్యుకేషన్) లో బీకాం మూడో సంవత్సరం చదువుతున్న ఎన్ఎస్ఎస్ యూనిట్-4 వాలంటీర్ బి.శివరాజ్ జాతీయ సమైక్యత క్యాంపుకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయం అన్నారు. విద్యార్థి కళాశాలలో నిత్యం ప్రతి ఆక్టివిటీలో చాలా చురుకుగా పాల్గొంటారని, ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం, కళాశాలలో జరిగే వివిధ రకాల కాంపిటీషన్స్ లో అందరికీ ఆదర్శవంతంగా ఉంటాడని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ధాంసింగ్ తెలిపారు. వారం రోజులపాటు మేడ్చల్ లోని దుండిగల్ లో జరిగే జాతీయ సమైక్యత క్యాంపులో వివిధ సాంస్కృతిక, వినోద విజ్ఞాన, క్రీడా కార్యక్రమాల్లో ఉత్సహంగా పాల్గొంటారని ఆయన తెలిపారు. జాతీయ క్యాంపుకు ఎంపిక కావడం పట్ల కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది శివరాజ్ ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఉమా, యాదగిరి గౌడ్, ప్రోగ్రాం ఆఫీసర్లు రాఘవేంద్ర, రామకృష్ణ మూర్తి, మల్లికార్జున్, నాగలక్ష్మి, వెంకటస్వామి, కిరణ్ సింగ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు

## సీఎం విదేశి విద్యా పథకం

## ఉపకార వేతనాలకు దరఖాస్తుల ఆహ్వానం

### జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస్ రావు



**మహబూబాబాద్,డిసెంబర్ 20 (నినాదం):** తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వము రాష్ట్రంలోని అల్ప సంఖ్యాక వర్గాల వారు విదేశాలలో పై చదువుల నిమిత్తమ "సి.ఎం."ఓవర్సీస్ స్కాలర్షిప్ పథకము ద్వార POST GRADUATE / DOCTORAL STUDIES కొరకు అమెరికా,లండన్,ఆస్ట్రేలియా, కెనడా, న్యూజిలాండ్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, కెనడామరియు సింగపూర్ దేశాలలో చదువుటకు అర్హత గల అభ్యర్ధులు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాస రావు తెలిపారు. 1 జులై 2025 నుండి 31 డిసెంబర్ 2025 కాలంలో (ఫాల్ సీజన్) అడ్మిషన్ తీసుకున్న అర్హత కలిగిన అభ్యర్ధులు www.telanganaepass.cgg.gov.in వెబ్ సైట్ నందు దరఖాస్తు చేసుకోవలెను. విద్యార్థుల తల్లితండ్రుల వార్షిక ఆదాయము రూ. 5 లక్షల లోపు ఉండవలెనని ఇట్టి పథకము క్రింద ఎంపిక చేయబడిన ప్రతి విద్యార్థికి స్కాలర్ షిప్ / ఆర్ధిక సహాయము క్రింద రూ.20,00,000/-(ఇరవై లక్షలు) రెండు విడుతలలో చెల్లించబడునని మరియు ఒక విమాన ప్రయాణ చార్జీలు రూ.60,000/-(అరవై వేలు) మించకుండా చెల్లించబడునని తెలిపారు. దరఖాస్తులు ఆన్ లైన్ నందు తేది 20.12.2025 నుండి 19-01-2026 సా.5.00 గ.ల వరకు నమోదు చేసుకొనవలెనని అన్నారు. ఆన్ లైన్ నందు సమర్పించిన దరఖాస్తులు మూడు జతల జిరాక్స్ పత్రాలను జిల్లా మైనారిటీస్ సంక్షేమ శాఖ కార్యాలయం, మహబూబాబాద్ జిల్లా IDOC (కొత్త కలెక్టరేట్ భవనం, మొదటి అంతస్తు, F- 17 నందు సమర్పించాలని కోరారు. ఇతర పూర్తి వివరాలకు ఆన్ లైన్ వెబ్ సైట్ లేదా జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి కార్యాలయము, మహబూబాబాద్ ఫోన్ నం. 9177996098, 9182540680 నంబర్ లను సంప్రదించగలరని అన్నారు.

## రైతులు స్లాట్ బుక్ చేసుకుని యూరియా కొనుగోలు చేయాలి



**మునుగోడు, డిసెంబర్ 20 (నినాదం):** తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఫర్టిలైజర్ యాప్ యూరియా స్లాట్ బుకింగ్ ప్రారంభించారు. శనివారం మండల కేంద్రంలోని, శ్రీనివాస ట్రేడర్స్ నందు ఏఈఓ యాదగిరి యూరియా స్లాట్ బుకింగ్ యాప్ గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఇప్పటినుండి ప్రతి ఒక్క రైతు యాప్ ద్వారా మాత్రమే యూరియాను స్లాట్ బుక్ చేసుకొని కొనుగోలు చేయాలని లేనియెడల యూరియాను అమ్మబడదని, తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న 24 గంటల లోపు యూరియాను తీసుకువెళ్లాలని లేనిచో స్లాట్ బుకింగ్ ఫెయిల్ అవుతుందని తెలిపారు. ప్రతి ఒక్క రైతుకి తమకు ఉన్న భూమి ప్రకారం, వేసిన పంటకు అనుగుణంగా యూరియాను కేటాయించడం జరుగుతుందని, కావున రైతులందరూ తమ యొక్క పంటలను ఏఈఓ వద్ద నమోదు చేయించుకొని, అవసరమున్న మేరకు మాత్రమే యూరియాని యాప్ ద్వారా బుక్ చేసుకుని తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. మండలానికి సరిపోయేంత యూరియా అందుబాటులోనే ఉన్నదని తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో, శ్రీనివాస ట్రేడర్స్ యజమాని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# వాహనదారులు రహదారి భద్రత నియమాలు పాటించాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి విజ్ఞప్తి







**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 20 (నినాదం):** వాహనదారులందరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని, కాబట్టి వాహనదారులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. రాష్ట్రంలో జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలపై శనివారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రవాణా శాఖ ప్రత్యేక కార్యదర్శి వికాస్ రాజ్ తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి వనపర్తి జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సంబంధిత జిల్లా శాఖల అధికారులతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో తెలంగాణలో రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించేవారని, ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రహదారి భద్రతా మాసోత్సవాలను నిర్వహిస్తు ప్రజలకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పిస్తోందని చెప్పారు. వాహనదారులందరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని అన్నారు. కాబట్టి వాహనదారులకు జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను నివారించగలమని అన్నారు. రవాణా, పోలీస్, ఆర్టీసీ, సంబంధిత శాఖలు సమన్వయం చేసుకొని మాసోత్సవాల్లో చురుకుగా పాల్గొని ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రమాదాలను నివారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాల్లో తప్పనిసరిగా రోడ్ సేఫ్టీ మీటింగ్స్ నిర్వహించాలన్నారు. పాఠశాలల్లో, కాలేజీ లలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, స్పీడ్ డ్రైవింగ్ సహా అన్ని అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్రంలో సగటున రోజుకు రోడ్డు ప్రమాదాల కారణంగా 20 మంది మరణిస్తున్నారన్నారు. అవగాహన ద్వారా ఒక్క రోడ్డు ప్రమాదాన్ని నివారించినా ఆ కుటుంబానికి వెలుగులు నింపినట్లే అన్నారు. కాబట్టి ప్రతి జిల్లాలో పెద్ద ఎత్తున రోడ్డు భద్రతా మాసోత్సవాలను నిర్వహించి ప్రజలను, విద్యార్థులను, యువతను, వాలంటీర్ ఆర్గనైజషన్ వారిని భాగస్వామ్యం చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ మాట్లాడుతూ వాహనదారులందరూ రహదారి భద్రత నియమాలు పాటిస్తే రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని, కాబట్టి వాహనదారులకు రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలో ప్రతి ఒక్కరికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి జనవరి 1 నుంచి 31 వరకు నిర్వహించనున్న జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలను విజయవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఈఈ దేశ్యా నాయక్, డి టీ ఓ మానస, డి ఎం హెచ్ ఓ సాయినాథ్ రెడ్డి, పంచాయత్ రాజ్ ఈఈ మల్లయ్య, మురళి కృష్ణ, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# ఉపాధిహామీ చట్టాన్ని కాపాడుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



**మిర్యాలగూడ డిసెంబర్ 20( నినాదం):** మాహత్మ గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. కేంద్ర కమిటీ పిలువుమేరకు శనివారం స్థానిక సిపిఎం కార్యాలయం నుంచి అంబేత్కర్ విగ్రహం వరకు నల్ల బ్యానర్ తో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేత్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకం పోరాడి సాధించుకుందాం అని ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం ఆ పథకానికి పేరు మార్చడంతో పాటు ఆ పథకాన్ని రద్దు చేసేందుకు కుట్ర చేస్తుందని ఆరోపించారు. పేదల పొట్ట కొట్టేందుకు కేంద్రం కొత్త విధానాన్ని తెరపైకి తెచ్చారన్నారు. మహాత్మా గాంధీ పేరు తీసేసి వీర్ జీ రామ్ జీ పేరు పెట్టడం సరైనదికదన్నారు. ఉపాధి పథకానికి నిధులు తగ్గించి నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు. భవిష్యత్తులో ఈ పథకం లేకుండా చేయాలని బిజెపి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని ధ్వజమెత్తారు. ఉపాధి హామీ పథకం కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపై ఉందని ఉద్యమాలు చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలతోనే ప్రజా వ్యతిరేక విధానాలు అడ్డుకోగలుగుతామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్, టూ టౌన్ కార్యదర్శులు డా. మల్లు గౌతమ్ రెడ్డి, బావాండ్ల పాండు, జిల్లా కమిటి సభ్యులు రవి నాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, రెమిడాల పరుశు రాములు, సంత్యనారాయణ రావు, సర్పంచ్ బొగ్గరపు కృష్ణయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు పిల్లుట్ల సైదులు, ఊర్మిళ, నాయకులు కోటి రెడ్డి, గోవర్ధనా, కూన్ రెడ్డి వెంకట్ రెడ్డి, అరుణ, రామకృష్ణ, సూర్యం, శ్రీనివాస్, సుకన్య, కోడిరెక్క మల్లయ్య, మంద రాజు, బి ఎం నాయుడు, లక్ష్మీనారాయణ, దేశిరం నాయక్, దేవయ్య, పాపి రెడ్డి, జగన్, క్రాంతి, ఏసు తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

### కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 20 (నినాదం):** రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ డిసెంబర్ 23 న వనపర్తి జిల్లా పర్యటనకు వస్తున్నందున అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 23న గవర్నర్ పర్యటనకు సంబంధించి జిల్లా కలెక్టర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 23న 3.30 గంటలకు రాష్ట్ర గవర్నర్ జిల్లా పర్యటనకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. గవర్నర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన ప్రముఖులతో ముఖాముఖీలో పాల్గొంటారని, అలాంటి వారిని గుర్తించి అందుకు తగ్గ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని ప్రముఖులను ఆహ్వానించాలని ఆర్డీవోకు సూచించారు. ప్రొటోకాల్, బందోబస్తు, స్టాళ్ల సందర్శన, డయాస్, సౌండ్ సిస్టం, కరెంట్ సరఫరా తదితరవి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారికి ఆదేశించారు. జిల్లా ప్రొఫైల్ తో పాటు వివిధ రంగాల్లో జిల్లా సాధించిన అభివృద్ధి గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చేందుకు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఖీమ్యా నాయక్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డిఆర్డిఓ ఉమాదేవి, డీఎంహెచ్వో సాయినాథ్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు

## దశదిన కర్మలో పాల్గొన్న మునుగోడు సర్పంచ్



**మునుగోడు, డిసెంబర్ 20 (నినాదం):** మునుగోడు మండల పరిధిలోని లక్ష్మీదేవి వాస్తవ్యులు కొంపల్లి సత్తయ్య పది రోజుల క్రితం మరణించడం జరిగింది. శనివారం దశ దిన కర్మ నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, మునుగోడు నూతన సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ పాల్గొని వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో, బీసం నరసింహ అయితగోని విజయ్, మాధగోని శ్రీధర్, ఉప్పునూతల సత్యనారాయణ, సద్దల శ్రీశైలం, పాలకూరి రమేష్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# నల్లబెల్లిలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్ష

### జిల్లా పోటీలకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక




**నల్లబెల్లి, డిసెంబర్ 21 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలో జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని నల్లబెల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలంగాణ మాథ్స్ ఫోరం నల్లబెల్లి శాఖ ఆధ్వర్యంలో మండల స్థాయి గణిత ప్రతిభా పరీక్షను ఘనంగా నిర్వహించారు. ఈ పరీక్షకు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. గణితంపై విద్యార్థుల అవగాహన, తర్కశక్తి, సమస్య పరిష్కార నైపుణ్యాలను పరీక్షించే విధంగా ప్రశ్నాపత్రాన్ని రూపొందించారు. పరీక్ష ఫలితాల ఆధారంగా మేడపల్లి పాఠశాల నుంచి తిరుపతి, అభిరామ్‌లు, నల్లబెల్లి పాఠశాల నుంచి ప్రణవ్ జిల్లా స్థాయి గణిత పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులనుఉపాధ్యాయులు అభినందించి, జిల్లా స్థాయిలో మెరుగైన ప్రతిభ కనబర్చాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా గణిత ఉపాధ్యాయులు మాట్లాడుతూ, గణితం జీవితంలో కీలకమైన అంశమని, చిన్న వయస్సు నుంచే గణితంపై ఆసక్తి పెంపొందిస్తే విద్యార్థులు ఉన్నత స్థాయికిచేరుకుంటారని అన్నారు. ఇలాంటి ప్రతిభా పరీక్షలు విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంచడంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు పద్మజ, అనిల్, నటరాజ్, శృతి తదితరులు పాల్గొని పరీక్ష నిర్వహణలో సహకరించారు.

# నూతన సర్పంచ్ మేకల రాజయ్యకు సన్మానం



**మల్హర్, డిసెంబర్ 20 (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హర్ మండలం, మల్లారం గ్రామంలో ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరఫున శ్రీ మేకల రాజయ్య గారు ఘన విజయం సాధించారు. ఇది 1989 సంవత్సరం మల్లారం గ్రామంలో ఎన్నికలు ప్రారంభం కాగా తొలి సారి గా యాదవులనుండి మేకల రాజయ్య గెలుపు చారిత్రాత్మక విజయం కావడం విశేషం. మల్లారం రాజకీయ చరిత్రలో కొత్త అధ్యాయాన్ని శ్రీ మేకల రాజయ్య, లిఖించారు. ఈ విజయం గ్రామ ప్రజల నమ్మకం, ఆశీర్వాదం మరియు విశ్వాసానికి నిదర్శనంగా నిలిచింది. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం ఆధ్వర్యంలో గ్రామ యాదవ అధ్యక్షులు వేముల శేషు యాదవ్, చేతులమీదుగా శ్రీ మేకల రాజయ్య,కు ఘనంగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో యాదవ సంఘ నాయకులు, యాదవ సంఘం కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కాంగ్రెస్ గ్రామ యువజన అధ్యక్షులు కల్వల రవిసాగర్, మరియు ముక్క వంశీ కృష్ణ పాల్గొన్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తానని మేకల రాజయ్య ఈ సందర్భంగా తెలిపారు. మల్లారం గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లడమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ఉక్కుపాదం



**వనపర్తి ప్రతినిధి, డిసెంబర్ 20(నినాదం):** నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై ఉక్కు పాదం మోపుతామని ట్రాఫిక్ ఎస్ఐ సురేందర్ అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా శనివారం వనపర్తి జిల్లా ఎస్పీ సునీతా రెడ్డి ఆదేశాల మేరకు వనపర్తిలో ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో నంబర్ ప్లేట్లు లేకుండా తిరుగుతున్న వాహనాలపై కఠినంగా చర్యలు చేపట్టారు. వనపర్తి పట్టణంలోని ప్రధాన కూడళ్ల వద్ద నంబర్ ప్లేట్లు లేని వాహనాలను ఆపి వాహనదారులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ కౌన్సిలింగ్ నిర్వహించారు. 40 నంబర్ ప్లేట్లు లేని వాహనాలను గుర్తించి కౌన్సిలింగ్‌తో పాటు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ ఎస్సై తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్సై సురేందర్ మాట్లాడుతూ నంబర్ ప్లేట్లు లేని వాహనాలు రోడ్డు ప్రమాదాలకు మాత్రమే కాకుండా చైన్ స్నాచింగ్, దొంగతనాలు వంటి నేరాలకు కూడా వినియోగిస్తున్న ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. అట్టి నేరాలకు అడ్డుకట్ట వేయడం, ప్రజల భద్రతను కాపాడడం కోసమే ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యంగా పోలీసులు చేపట్టే కార్యక్రమాలకు పట్టణ ప్రజలందరూ సహకరించాలని ట్రాఫిక్ పోలీసులు విజ్ఞప్తి చేశారు. వాహనదారులు తప్పనిసరిగా చట్టబద్ధమైన నంబర్ ప్లేట్లు అమర్చుకుని ప్రయాణించాలని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో వనపర్తి ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచులకు సమస్యల స్వాగతం!



**కోదాడ (నినాదం):** పల్లెసీమలే దేశానికి పట్టుకొమ్మలు. గ్రామాల్లో సర్పంచ్ పదవి బాధ్యతాయుతమైంది. గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా ప్రభుత్వం 1959లో జిల్లా, బ్లాక్, గ్రామ పంచాయత్ అనే మూడంచెల పంచాయతేజ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా వనరుల వినియోగం, శాశ్వతమైన పరిపాలన అమలుకు యంత్రాంగం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామీణుల జీవన ప్రమాణాలను మెరుగుపర్చాలనే సంకల్పంతో ఏర్పాటైన పంచాయతీరాజ్ వ్యవస్థ రానురాను గాడి తప్పుతోంది. కొత్తగా గెలిచిన సర్పంచ్లు ఈ నెల 22న పదవి పగ్గాలు చేపట్టనున్నారు. అద్దె భవనాలు, పాత సమస్యలు స్వాగతం పలుకనున్నాయి. రెండవ విడతలో స్థానిక సంస్థల ఎన్నిక ల్లో అనంతగిరి మండలంలో ఉన్న 20 గ్రామ పంచాయతీల్లో యువత,మహిళలను ప్రజలు ఎన్నుకున్నారు. కానీ వారికి గ్రామంలో నెలకొన్న సమస్యలు సవాలుగా మారనున్నాయి. గెలుపొందిన కొత్త సర్పంచ్లకు సమస్యలు స్వాగతం పలకనున్నాయి. గత రెండు సంవత్సరాల క్రితం సర్పంచ్ పాలన ముగిసినా.. ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించక ప్రత్యేకాధికారుల పాలన సాగిస్తూ.. వచ్చింది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడింది. నిధుల లేమితో పంచాయతీ కార్యదర్శులకు కూడా భారంగా మారింది. గ్రామంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేస్తూ.. నెట్టుకొచ్చారు. కొన్ని చోట్ల పంచాయతీ ట్రాక్టర్ నడిపేందుకు కూడా డిజిల్ లేని పరిస్థితి నెలకొంది. వీధిలైట్లు లేక గ్రామాల్లో చీకట్లు కమ్ముకున్నాయి. ఇలా పనులు పెండింగ్లో ఉన్నాయి. నూతనంగా పదవి చేపట్టనున్న ప్రథమ పౌరులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి.

# కస్టడీ హింస ఆరోపణలపై సీఐ సస్పెన్షన్..





### చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్...

**కోదాడ (నినాదం):** సీఎంఆర్ఎఫ్ చెక్కుల అవకతవకల కేసులో నిందితుడిగా ఉన్న కర్ల రాజేష్ మరణం జిల్లా పోలీసు వ్యవస్థపై పెద్ద వివాదానికి దారితీసింది. ఈ కేసులో రిమాండ్‌కు ముందే రాజేష్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరిపిన పోలీసులు, అధిక బలప్రయోగం చేశారని బంధువులు, ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈ సంఘటన నేపథ్యంలో ఉన్నతాధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కోదాడ రూరల్ సీఐ ప్రతాప్ లింగాన్ని సస్పెండ్ చేస్తూ, చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డిని జిల్లా పోలీసు కార్యాలయానికి అటాచ్ చేశారు. విచారణ పూర్తయ్యే వరకు వీరిపై అంతర్గత చర్యలు కొనసాగనున్నాయి. రాజేష్ హుజూర్‌నగర్ జైలుకు తరలించిన కొద్దిసేపటికే అస్వస్థతకు గురై మృతి చెందాడు. అయితే ఇది సాధారణ ఆరోగ్య సమస్య వల్ల కాదని, ముందస్తు విచారణలో జరిగిన పోలీసు హింస కారణమని కుటుంబ సభ్యులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. "రిమాండ్‌కు ముందు పోలీసులే ప్రాణాలు తీశారు" అని ప్రజా సంఘాలు, హక్కుల సంస్థలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఈ ఆరోపణలను సీరియస్‌గా తీసుకున్న జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సి) రాజేష్ మృతిపై కేసు నమోదు చేసింది. పూర్తి దర్యాప్తు జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఎన్ హెచ్ ఆర్ సి జోక్యంతో ఈ వ్యవహారం జాతీయస్థాయిలో కూడా దృష్టిని ఆకర్షిస్తోంది. సూర్యాపేటలో ఈ కేసు చుట్టూ రాజకీయ వాదోపవాదాలు, హక్కుల సంస్థల ఆందోళనలు వేడెక్కుతున్నాయి. పోలీసు విచారణ, రిమాండ్ ప్రక్రియల్లో పారదర్శకత, బాధ్యతాయుత వ్యవహారం ఎంత అవసరమో ఈ ఘటన మరోసారి తేటతెల్లం చేసింది....

**న్యాయం చేయాలని ఆందోళనలు...**

రాజేష్ మృతిపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఉధృత ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఈ విషయంపై ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ లాకప్ డెత్‌కు బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఉన్నతాధికారులకు పలుమార్లు వినతిపత్రాలు అందజేశారు. ధర్మ సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ విశారదన్ మహరాజ్ సైతం ఈ కేసులో బాధితులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే... ఈ నేపథ్యంలోనే పోలీసు శాఖ అంతర్గత విచారణ వేగవంతం చేసి, సంబంధిత అధికారులపై చర్యలకు ఉపక్రమించినట్లు సమాచారం. లాకప్ డెత్ ఘటనపై పూర్తి స్థాయి విచారణ అనంతరం మరికొందరిపై కూడా చర్యలు తీసుకునే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్న డిమాండ్‌తో పాటు, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు అవసరమని ప్రజాసంఘాలు కోరుతున్నాయి.

# మహాదేవపూర్ ఎంపీడీవోకు సన్మానం



**మహాదేవపూర్, డిసెంబర్ 20, (నినాదం):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ ఎంపీడీవో రవీంద్రనాథ్ కు పంచాయతీ కార్యదర్శులు శనివారం శాలువాతో సన్మానించారు. రెండో విడత సాధారణ గ్రామపంచాయతీ ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసినందుకు పంచాయతీ కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది ఉపాధి సిబ్బంది మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయనకు అభినందనలు తెలిపి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ సర్పంచ్ రిజర్వేషన్లు ప్రక్రియ ప్రారంభమైన నాటి నుండి ఎన్నికలు పూర్తి అయ్యేవరకు ఎంపీడీవో గారు అందరికీ అందుబాటులో ఉంటూ ప్రతి పంచాయతీ కార్యదర్శి సిబ్బందిని అప్రమత్తం చేసి ఎన్నికలు సజావుగా జరగడానికి తమకు పలు సూచనలు చేశారని, ఎన్నికల నిర్వహణకు వచ్చే పోలింగ్ సిబ్బందికి, అధికారులకు ఎలాంటి ఇబ్బందులు అసౌకర్యాలు కలగకూడదని తమకు సూచించారని ఆయన తెలిపారు. అనంతరం ఎంపీడీవో రవీంద్రనాథ్ మాట్లాడుతూ అందరి సహాయ సహకారాలతో గ్రామపంచాయతీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసినట్లు ఇదే స్ఫూర్తితో రాబోయే ఎంపీటీసీ జెడ్పిటిసి ఎన్నికల ను సైతం విజయవంతం చేయాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఈ రవీందర్, పంచాయతీ కార్యదర్శులు నవాజుద్దీన్, కుమారస్వామి, రమేష్, సురేష్, మహేష్, గాయత్రి, కల్పన, స్వాతి, ఇందిర, కార్యాలయ సిబ్బంది అరుణ్, శ్రీకాంత్, శ్రీహరి,, కార్యాలయ సబార్డినేట్లు రాజయ్య, రమేష్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

# సులభంగా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చు

**యూరియా బుకింగ్ యాప్ ద్వారా కొనుగోలు చేయడం సులభతరం**

**కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి, డిసెంబర్20(నినాదం):** యూరియా బుకింగ్ యాప్ ద్వారా యూరియా కొనుగోలు చేయడం సులభతరమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. శనివారం పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద గల మహేష్ ఫెర్టిలైజర్స్ ఎరువుల షాపును జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, యూరియా లభ్యతపై రైతులకు ఎటువంటి అనుమానాలు, అపోహలు అవసరం లేదని, ప్రతి రైతుకు అవసరమైన మేర యూరియా అందుబాటులో ఉందని కలెక్టర్ తెలిపారు. యూరియా ప్రతి రైతుకు చేరాలని ఉద్దేశంతో జిల్లాలో యూరియా ట్రాకింగ్ యాప్ సిద్ధం చేశామని కలెక్టర్ తెలిపారు. గత నెల రోజుల నుండి యాప్ ద్వారా ఎరువుల విక్రయాలు జిల్లాలో పర్యవేక్షించామని,మనం అనుసరించిన విధానాన్ని పరిశీలించిన ప్రభుత్వం మరింత మెరుగ్గా యూరియా బుకింగ్ యాప్ ప్రవేశ పెట్టిందని అన్నారు. ఓలా, ఉబర్ వంటి యాప్ లలో టాక్సీ ఎలా బుక్ చేస్తామో , అదేవిధంగా సులభంగా ఇంటి నుంచే యూరియా బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.రైతులు తమ ఇంటి వద్ద నుంచి యూరియా బుక్ చేసుకుని ఎరువుల షాప్ కు స్వయంగా వచ్చి లేదా ఇతరులతో తమ బుక్ చేసుకున్న బస్తాల వివరాలు, ఓటిపి చెప్తే షాప్ యజమానులు యూరియా సరఫరా చేస్తారని, ఈ యాప్ ఉపయోగించడం వల్ల రైతుల సమయం వృధా కాదని, లైన్లలో నిలబడకుండా సరైన సమయంలో వచ్చి యూరియా తీసుకువెళ్ళచ్చని అన్నారు.యాప్ విధానం ద్వారా రైతులు అవసరానికి మించి యూరియా తీసుకొని వెళ్లి స్టాక్ పెట్టుకోవడం నియంత్రించవచ్చని, చిన్న సన్న కారు రైతులకు ఎటువంటి యూరియా కొరత రాకుండా ఉంటుందని తెలిపారు.రైతులు తమ వ్యవసాయ భూమి వివరాలు తమకు ఎంత యూరియా అవసరమంటుందో ఇంకా ఎన్ని కావాలో అనే అంశాలు ఈ యాప్ లో నమోదవుతాయని కలెక్టర్ తెలియజేశారు. రైతులు ఈ యాప్ ను ఉపయోగించడం సులభంగా ఉంటుందని ప్రతి ఒక్కరు యాప్ ఉపయోగించుకొని యూరియా కొనుగోలు చేయాలని ఆప్ ఉపయోగించడంలో ఏదైనా సమస్యలు ఏర్పడితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని కలెక్టర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాస్, ఏ.ఓ.లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

**విద్యార్థులతో వినూత్నంగా**

# కూరగాయల మార్కెట్

**కృష్ణవేణి విద్యాసంస్థల్లో కూరగాయల మార్కెట్-ఫుడ్ ఫెస్ట్**

**విద్యార్థులతో వ్యాపార నైపుణ్యాల పెంపకం**





**గోదావరిఖని, డిసెంబర్ 20 (నినాదం):** గోదావరిఖని కృష్ణవేణి విద్యాసంస్థల పాఠశాల ఆవరణలో శనివారం కూరగాయల మార్కెట్, ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కృష్ణవేణి విద్యాసంస్థల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. విద్యార్థుల్లో చిన్నతనంలోనే వ్యాపార దృక్పథం, ఆహారపు విలువలపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులు తమ తమ వేషాధారణలో పాల్గొని కూరగాయలు, వివిధ రకాల వంటకాలను సరసమైన ధరలకు విక్రయించి సందర్శకులను ఆకట్టుకున్నారు.ఈ సందర్భంగా మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కార్యక్రమాలు పిల్లల్లో ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఆగిపోయిన పార్కింగ్ కాంప్లెక్స్‌ను**

# వెంటనే పూర్తి చేయాలి

**మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్**



**గోదావరిఖని, డిసెంబర్ 20 (నినాదం):** రామగుండంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగుతోందని రామ గుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కోరుకంటి చందర్ తీవ్రంగా విమర్శించారు. ప్రజాధనాన్ని కమీషన్ల కోసం వృథా చేస్తున్నారని, ఆగిపోయిన పార్కింగ్ కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.గతంలో సోమారపు సత్యనారాయణ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ప్రతిపాదించిన పార్కింగ్ కాంప్లెక్స్‌కు భూమిపూజ చేసి, దాదాపు రూ.3 కోట్లతో పుట్టింగ్, పిల్లర్ వర్క్ పూర్తిచేశామని కోరుకంటి చందర్ గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ నిర్మాణాన్ని ప్రస్తుత ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ పూర్తి చేయకపోవడం బాధ్యతరాహిత్యంగా ఉందని, పార్కింగ్ కాంప్లెక్స్ కోసం ఎమ్మెల్యే , కలెక్టర్ దృష్టి సారించలేదని ఆయన తెలిపారు.తన హయాంలో టి.యు.ఎఫ్.ఐ.డి., అమృత్, డి.ఎం.ఎఫ్.టి. ద్వారా మంజూరైన నిధులు ఇప్పుడు విడుదల అయినప్పటికీ, పార్కింగ్ కాంప్లెక్స్ పనులు నిలిచిపోగా, కమీషన్ల కోసం పాత లైట్లను తొలగించి కొత్తవి పెట్టడం, పాత డ్రైనేజీ వ్యవస్థను మారుస్తున్నారని ఆరోపించారు.ప్రజాధనం వృథా కాకుండా పాత మున్సిపల్ కార్యాలయంలో నిర్మాణంలో ఉన్న పార్కింగ్ కాంప్లెక్స్‌ను వెంటనే పూర్తి చేయాలని ఎమెల్యే రాజ్ ఠాకూర్‌ను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



**హెూం గార్డ్**

# కుటుంబానికి ఆర్థిక చేయూత

**విధులు నిర్వహిస్తూ మరణించిన సిబ్బంది కుటుంబాన్ని ఆదుకోవడం బాధ్యత**

**అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్**



**గోదావరిఖని, డిసెంబర్ 20 (నినాదం):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఆరోగ్య సమస్యలతో మృతి చెందిన హెూం గార్డ్ కె. చంద్రయ్య కుటుంబ సభ్యులకు తెలంగాణ రాష్ట్ర హెూం గార్డ్స్ సంక్షేమ నిధి నుంచి ఆర్థిక సహాయం అందించారు. అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెూం గార్డ్స్ స్వాతి లక్రా మంజూరు చేసిన రూ.15 వేల చెక్కును అదనపు డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్ తమ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ సందర్భంగా అదనపు డీసీపీ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజా భద్రత కోసం విధులు నిర్వహిస్తూ మరణించిన సిబ్బంది కుటుంబాలను ఆదుకోవడం పోలీస్ శాఖ బాధ్యత అని పేర్కొన్నారు. హెూం గార్డ్స్ సేవలు సమాజానికి అమూల్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ ప్రతాప్, హెూం గార్డ్స్ ఆర్ఐ పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

**యాదవ చారిటబుల్ ట్రస్ట్ వాలంటీర్లకు సన్మానం**



**కలెక్టర్ చేతుల మీదుగా ధృవీకరణ పత్రాలు అందజేత**

**పెద్దపల్లి ప్రతినిధి,డిసెంబర్ 20 (నినాదం) :**జిల్లా ప్రధాన ఆసుపత్రిలో గత మూడు నెలల పాటు అంకితభావంతో వాలంటీర్లుగా సేవలందించిన యాదవ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులను శనివారం కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష శాలువా కప్పి సన్మానించారు.యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పనిచేసిన వాలంటీర్లు కే.స్వాతి,డి.సుజాత, జి.సరోజన,కె.రాజేంద్ర ప్రసాద్‌లకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా వైద్య ఆరోగ్యశాఖ తరపున అనుభవ ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాదవ చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని ప్రశంసించారు.భవిష్యత్తులో కూడా ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపయోగపడే విధంగా మరిన్ని వినూత్న కార్యక్రమాలను రూపొందించుకుని ముందుకు సాగాలని,సామాజిక సేవలో ట్రస్ట్ భాగస్వామ్యం మరింత పెరగాలని ఆకాంక్షించారు.సామాజిక సేవకు అంకితమైన ట్రస్ట్ చైర్మన్ మారం తిరుపతి యాదవ్ ను కలెక్టర్ ప్రత్యేకంగా అభినంది స్తూ,ట్రస్ట్ యొక్క భవిష్యత్తు కార్యాచరణ గురించి అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఉపాధ్యక్షులు చిలారపు పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

# ముత్తారం ఎంపిడిఓ జి.లలిత సస్పెన్షన్

**కలెక్టర్ కోయ శ్రీ.హర్ష**



**పెద్దపల్లి ప్రతినిధి, డిసెంబర్ 20(నినాదం):** ముత్తారం ఎంపిడిఓ,ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కోయ శ్రీ.హర్ష శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కమాన్ పూర్ మండలం రొంపికుంట గ్రామంలో పంచాయతీ కార్యదర్శిగా గతంలో పనిచేసిన ఎం.తిరుపతి అవినీతి కారణంగా సర్వీస్ నుంచి తొలగించడం జరిగింది.ఎం.తిరుపతి విచారణ సమయంలో అప్పటి కమాన్ పూర్ ఎం.పీ.డీ.ఓ గా విధులు నిర్వహించిన జి.లలిత కు అవినీతి డబ్బులు వాటా పంపినట్లు మాజీ పంచాయతీ కార్యదర్శి ఎం.తిరుపతి వాంగ్మూలం,ఫోన్ పే స్క్రిన్ షాట్స్ సమర్పించారని కలెక్టర్ పేర్కొన్నారు. పిడి హౌసింగ్ జే.రాజేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ నిర్వహించి రిపోర్ట్ అందించాల్సిందిగా ఆదేశించడం జరిగిందని, ఎం.తిరుపతి వాంగ్మూలం సంబంధించి జి.లలిత ఎం.పీ.డీ.వో పై చేసిన ఆరోపణలకు ఆధారాలు లభించాయని, పీడీ హౌసింగ్ చేపట్టిన విచారణకు ఎం.పీ.డీ.వో జి.లలిత నుంచి సహకారం లభించ లేదని రిపోర్ట్ సమర్పించి నట్లు కలెక్టర్ తెలిపారు. ముత్తారం ఎం.పి.డి.ఓ,ప్రస్తుతం పెద్దపల్లి జిల్లా గ్రామీణాభివృద్ధి అథారిటీ లో ఏ.పీ.డీ గా డిప్యూటేషన్ పై విధులు నిర్వహిస్తున్న జి.లలిత ను సస్పెండ్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసి,సస్పెన్షన్ సమయంలో హెడ్ క్వార్టర్ వదిలి వెళ్ళడానికి వీలు లేదని చెప్పారు.

**సీఎం, మంత్రి శ్రీధర్ బాబు**

# చిత్రపటాలకు పాలభిషేకం



**మంథని టౌన్ డిసెంబర్ 20 (నినాదం):** మంథని పట్టణంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,మంత్రి శ్రీధర్ బాబు చిత్రపటాలకు మంథని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆయిలి ప్రసాద్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని మంథని వ్యవసాయ మార్కెట్లో రైతులందరికీ వరి ధాన్యానికి క్వింటాల్ కి రూ.500 బోనస్ ను రైతులకు ఖాతాలో జమ చేయడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అకాల వర్షాలతో దిగుబడి తక్కువ వస్తున్నందున రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు బోనస్ ఇవ్వడం రైతులకు గొప్ప వరం లాంటిదని వారు కొనియాడారు . ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ బలపరిచిన 35 సర్పంచ్ స్థానాల్లో 30 మంది సర్పంచ్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించడం జరిగిందని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదల వెంకన్న, సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, ఎలక్ట్రిసిటీ బోర్డ్ మెంబర్ శశిభూషణ్ కాచే,వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శంకర్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షులు మంథని సత్యం, బీసీ సెల్ మండల అధ్యక్షులు ఐలి శ్రీనివాస్,మాజీ ఎంపీపీ కొండా శంకర్, బండ కిషోర్ ,మంథని పట్టణ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటరి రాజు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎరుకల ప్రవీణ్, సర్పంచ్ భూగొండ రవి, పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు అండగా నిలుస్తా

**కాలుష్య కోరల నుంచి రామగుండాన్ని కాపాడుదాం**

**వ్యాల్ల హరీష్ రెడ్డి**



**గోదావరిఖని, డిసెంబర్ 20 (నినాదం):** గోదావరిఖనిలో శనివారం స్వాగత్ గార్డెన్‌లో కోల్‌బెల్ట్ ఏరియా చిరు వ్యాపారుల సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.గౌరవ అధ్యక్షులుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు వ్యాల్ల హరీష్ రెడ్డి, అధ్యక్షులుగా ఎస్కే మొయినుద్దీన్, ఉపాధ్యక్షులుగా ఎస్డీ ఇస్మాయిల్ బాబా, ముఖ్య సలహాదారులుగా ఎండీ జాహిద్ పాషా, ప్రధాన కార్యదర్శిగా ఎస్కే కిషన్ సింగ్, కోశాధికారిగా ఎండీ ముజాహిద్, సలహాదారులుగా బూరుగు వంశీకృష్ణ, సంయుక్త కార్యదర్శిగా తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా నయీమ్, అంకుష్, తాళ్లపల్లి సమ్మయ్య, సందీప్, ఎస్డీ ఇమామ్, ఎండీ సాహిత్ ని ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఈ సమావేశంలో వ్యాల్ల హరీష్ రెడ్డి మాట్లాడుతూ..దశాబ్దాలుగా చిరు వ్యాపారాలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వ్యాపారులకు జరుగుతున్న దౌర్జన్యాలకు తాను అండగా నిలుస్తానని భరోసా ఇచ్చారు. చిరు వ్యాపారులకు ఏ సమస్య వచ్చినా వ్యక్తిగతంగా, వీహెచ్ఆర్ ఫౌండేషన్ ద్వారా అన్ని విధాలుగా సహకరిస్తానన్నారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతం ప్రస్తుత పాలకుల అనాలోచిత నిర్ణయాల కారణంగా తీవ్ర కాలుష్యానికి గురవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కాలుష్య కోరల నుంచి ఈ ప్రాంతాన్ని బయటకు తీసుకురావాలంటే ప్రజలు, వ్యాపారులు ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కూల్చివేతలతో నిర్వీర్యమైన చిరు వ్యాపారాలను తిరిగి నిర్మించుకునేందుకు తనతో కలిసి ముందుకు రావాలని కోరారు.ఒకప్పుడు అభివృద్ధికి చిరునామాగా ఉన్న రామగుండం నేడు మాఫియాలకు అడ్డాగా మారిందని విమర్శించారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలంటే కాలుష్య రహిత ఐటీ, గ్రీన్ ప్రాజెక్టులు రావాల్సిన అవసరం ఉందన్నారు. కాలుష్యం కారణంగా ప్రజలు అనారోగ్య బారిన పడి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా క్యాన్సర్‌తో బాధపడుతున్న చిరు వ్యాపారి ఎండీ బషీర్ తల్లి జాన్ బీ బేగంకు వ్యాల్ల హరీష్ రెడ్డి 10,000 ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ అధికార ప్రతినిధి జాహిద్ పాషా, మాజీ కార్పొరేటర్ ఐత శివకుమార్, మాజీ కౌన్సిలర్ కృష్ణస్వామి, కో-ఆప్షన్ మెంబర్ తస్లిమా భాను, మహిళా ఉద్యమకారిణి పరుశ స్వాతి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మెరుగు చంద్రమౌళి, మేకల రామస్వామి, మడిశెట్టి రవీందర్, అల్లి గణేష్, తదితరులు పాల్గొన్నారు.

**ప్రజలకు అందుబాటులో ఉండి**

# గ్రామ అభివృద్ధికి కృషి

**ఉప సర్పంచ్ గడ్డం శ్యామల అనిల్ గౌడ్**



**సుల్తానాబాద్, డిసెంబర్ 20(నినాదం):** ప్రజలకు అందుబాటులో ఉండి గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని తొగరాయి గ్రామ ఉపసర్పంచ్ గడ్డం శ్యామల అనిల్ గౌడ్ స్పష్టం చేశారు. వార్డు ప్రజలకు ఏ కష్ట మొచ్చిన అందుబాటులో ఉండి తీరుస్తానని అన్నారు. సుల్తానాబాద్ మండలం తొగరాయి గ్రామఉప సర్పంచ్ గాఎన్నికైన సందర్భం గా మాట్లాడుతూ, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిలుక సతీష్ తోపాటు తొగర్రాయి సర్పంచ్ చిలుక స్రవంతి ఆధ్వర్యం లో సుల్తానా బాద్ మండలంలో తొగర్రాయి గ్రామ పంచాయతీని అభివృద్ధిలో నెంబర్ వన్ గా, ఆదర్శ గ్రామం గా నిలుపుతామనిఅన్నారు.

# అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఏడిఏపై చర్య తీసుకోవాలి



**మంథని, డిసెంబర్ 20( నినాదం)** తనకు రావాల్సిన చెక్కును ఇతరులకు ఇచ్చి డ్రా చేసుకునేలా సహకరించి అధికార దుర్వినియోగానికి పాల్పడిన మంథని వ్యవసాయ శాఖ ఏడిఏ అంజనీ మిశ్రా పై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని ప్రముఖ కాంట్రాక్టర్ బెల్లంకొండ రవీందర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంథని మండలం గద్దలపల్లి గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు చేపట్టి బిల్లు కోసం గద్దలపల్లి స్పెషల్ ఆఫీసర్ గా ఉన్న ఏడిఏ ను సంప్రదించగా బిల్లు మంజూరు చేసి తన పేరుపై చెక్కు ఇవ్వకుండా వేరే వారి పేరుపై రాసి నిధులు డ్రా చేసుకునే విధంగా సహకరించినట్లు ఆయన ఆరోపించారు. తేదీ 21 ఆగస్టు 2025 రోజున చెక్ నెంబర్ 732263 రూ. 1, 05,484/- చెక్కును ఇతరులు డ్రా చేసుకునే విధంగా సహకరించారని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ జరిపి ఏడీఏ పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఏడిఏ అంజని వివరణ కోరగా ఆ చెల్లింపు లో ఎలాంటి అవకతవకలు లేవని గద్దలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో జరిగిన ఈజిఎస్ పనికి సంబంధించిన బిల్లుల చెల్లింపులో ఎలాంటి అవకతవకలు జరగలేదని వ్యవసాయ శాఖ ఏడిఏ, గద్దలపల్లి స్పెషల్ ఆఫీసర్ అంజనీ మిశ్రా వివరణ ఇచ్చారు. ఇద్దరు కాంట్రాక్టర్ల మధ్య జరిగిన పంపకాల్లో వచ్చిన తేడాలతో నన్ను ఇబ్బంది పెట్టే ప్రయత్నం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఆ చెక్కు ద్వారా ఆ పని చేసిన వాళ్ళకే చెల్లింపు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు మానుకోవాలన్నారు.

**మాతా శిశు హాస్పిటల్‌లో**

# ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**ఏసుక్రీస్తు లోక రక్షకుడు**

**సూపరిండెండెంట్ డా. శ్రీధర్**



**పెద్దపల్లి ప్రతినిధి,డిసెంబర్ 20 (నినాదం):** పెద్దపల్లి మాత శిశు ప్రభుత్వ ఆసుపత్రిలో ముందస్తు ఏసుక్రీస్తు జన్మదిన జన్మదిన వేడుకలు ఘనంగా జరిపారు.అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.కే.శ్రీధర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఏసుక్రీస్తు సర్వ మానవాళి పాప పరిహారం కోసం తనకు తాను తగ్గించుకొని,సిలువలో మరణం పొంది మూడు దినముల తర్వాత సజీవుడుగా లేచాడని డా. శ్రీధర్ పేర్కొన్నారు.అంతేకాకుండా స్వేచ్ఛ,సమానత్వం,ప్రేమ,కరుణ, దయా,జాలి కలిగి ఉండాలని ఏసుక్రీస్తు తన శిష్యులతో బోధించారని,అదేవిధంగా నిన్ను వలె నీ పొరుగు వారిని ప్రేమించాలని ఏసుక్రీస్తు పేర్కొన్నారని, అంతేకాకుండా క్రిస్మస్ ఒకదేశానికి ప్రాంతానికి,కుల,వర్గాలకు చెందింది కాదని క్రిస్మస్ పండుగ ప్రపంచ దేశాల ప్రజలందరూ చేసుకునే వేడుక అని తెలిపారు.ప్రపంచ దేశాలు సైతం ఏసుక్రీస్తు జన్మదిన వేడుకలు ఘనంగా జరుపుకుంటారని డా.కే.శ్రీధర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్. ఎం.ఓ విజయ్ కుమార్, డాక్టర్లు రవీందర్,వినయ్,ప్రవళిక,అనూష రెడ్డి, హెడ్ స్టాఫ్ నర్స్ వాసంతి, భారతి,రుద్రమదేవి,శ్వేత శైలజ, సరస్వతి, స్వప్న,సౌజన్య, శ్రీలక్ష్మి,అనిత, సామంత్ తదితరులు పాల్గొన్నారు.

**విధ్వంసం కావాలనే**

# చెక్ డ్యాంలు పేల్చేస్తుండ్రు

**ప్రభుత్వం స్పందిస్తే ఇలాంటి ఘటనలు జరుగవు**

**అడవిసోమన్ పల్లి చెక్ డ్యాంను పరిశీలించిన నిజనిర్ధారణ కమిటి సభ్యులు**



**మంథని, డిసెంబర్ 20 (నినాదం)** గత ప్రభుత్వం నిర్మించిన చెక్ డ్యాంలపై కొంత మంది కావాలనే విధ్వంసం చేస్తున్నారని జలవనరుల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ వి.ప్రకాశ్ ఆరోపించారు. మంథని మండలం అడవిసోమన్ పల్లి మానేరుపై నిర్మించిన చెక్ డ్యాం కూలిపోవడంపై శనివారం నిజనిర్ధారణ కమిటి సభ్యులు పరిశీలించారు. అనంతరం మంథని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తాము తనుగుల చెక్ డ్యాంను సందర్శించగా బ్లాస్టింగ్ చేసినట్లు తమ నిర్ధారణలో స్పష్టమైందన్నారు. ఇక్కడి చెక్ డ్యాం సైతం బ్లాస్ట్ చేసినట్లు తమ దృష్టికి రావడంతో ఇక్కడకు వచ్చినట్లు తెలిపారు. అయితే పెద్ద ఎత్తున వరదలు వస్తే చెక్ డ్యాంలు కూలిపోతుంటాయని, మొరంచపల్లి వాగుకు పెద్ద ఎత్తున వరదలు రావడంతో గత ఏడాది రెండు చెక్ డ్యాంలు కూలిపోయాయని, వావిలాల వద్ద వరదతో దెబ్బతిందే కానీ తనుగుల, అడవిసోమన్పల్లి చెక్ డ్యాంలు మాత్రం వరదకు కూలిపోలేదన్నారు. 12 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా కూలిపోకుండా పటిష్టంగా నిర్మించారని, తనుగుల కంటే పెద్ద చెక్ డ్యాం అని ఆయన వివరించారు. ఇంత పటిష్టంగా ఉన్న చెక్ డ్యాంలను కొంతమంది కావాలనే వరుసగా పేల్చినట్లు తెలుస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే చర్యలు తీసుకుంటే భయముండేదని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. హుస్సేమియా వాగు 2024 జనవరిలో కొంతమంది బ్లాస్ట్ చేయడానికి చూసినప్పుడు స్థానికులు పట్టుకున్నారని, పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ కూడా నమోదు చేశారని తెలిపారు. అయితే బ్లాస్టింగ్ చేసేందుకు ఉపయోగించే వస్తువులు దొరికి రెండేళ్లు అవుతున్నా ఏ చర్య తీసుకులేదని. అలాగే మేడిగడ్డ విషయంలో సాక్ష్యాత్తు ఇంజనీరు రవీందర్. మహాదేవ్ పూర్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎప్పిఆర్పై విచారణ జరుగలేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సీతారామారావు, హైదరాబాద్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ రాఘవరెడ్డి, సాగునీటి శాఖ శాఖ రిటైర్డ్ సూపరిడెంట్ ఇంజనీర్ శ్రీధర్ రావు దేశ్ పాండే, తెలంగాణ ఉద్యమకారుడు పాల్గొన్నారు.

# విద్యార్థులు విజ్ఞానం దిశగా ఎదగాలి



**మంథని డిసెంబర్ 20 (నినాదం):** విద్యార్థులు విజ్ఞాన దిశగా ఎదగాలని కాకతీయ పాఠశాల ప్రిన్సిపల్ ప్రదీప్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మంథని పట్టణం కాకతీయ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ లో జాతీయ గణిత దినోత్సవం ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ రామానుజన్ జయంతి పురస్కరించుకొని రామానుజన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకొని ఆదిత్య ఆస్పత్రి మంథని ఆధ్వర్యంలో పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్య శిబిరానికి విశేషమైన స్పందన వచ్చింది. పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ఆరోగ్యమే మహాభాగ్యమని, ఆరోగ్యం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. మెగా క్యాంపులు ప్రతి సంవత్సరం ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని ఆయన సూచించారు. ఆస్పత్రి వారు ప్రజలకు వైద్య సేవల పట్ల అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. పిల్లలు ఆరోగ్యం సంబంధిత అనేక విషయాలు తెలుసుకోవాలని ఆయన సూచించారు. వైద్య శిబిరానికి కృషిచేసిన ఆదిత్య హాస్పిటల్ యాజమాన్యానికి, వైద్యులు రాజేష్, శిరీష, చిన్నపిల్లల వైద్య నిపుణురాలు నవీన, వైద్య సిబ్బందికి అయిన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సతీష్, పాఠశాల డైరెక్టర్లు రవి కిరణ్ రెడ్డి, శ్రావణ్ రెడ్డి పావని రెడ్డి, స్రవంతి రెడ్డి, పాల్గొన్నారు.

# ఇక రోడ్డెక్కి తేల్చుకుంటాం

## బీసీ బిడ్డ కనుకనే సిఐ సస్పెండ్!

- కర్ల రాజేష్ లాకప్ డెత్ ప్రధాన నిందితుడు చిలుకూరు ఎస్సై సురేష్ రెడ్డినే
- దళితుల ప్రాణాలంటే విలువ లేదా!
- కేసు నీరుగారిచేందుకు కొనసాగుతున్న కుట్ర
- పెదవి విప్పని అధికార పార్టీ నేతలు...
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ



**కోదాడ డిసెంబర్ 20 (నినాదం):**
దళిత యువకుడు కర్ల రాజేష్ లాకప్ డెత్ కేసులో ప్రధాన నిందితుడు చిలుకూరు ఎస్ఐ సురేష్ రెడ్డి తో పాటు సంబంధిత అధికారుల అందరిపై చట్టపరంగా, శాఖపరమైన చర్యలు తీసుకోవడమే తమ ప్రధానమైన డిమాండ్ అని మందకృష్ణ మాదిగ స్పష్టం చేశారు. శనివారం కోదాడ పట్టణంలోని పబ్లిక్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చిలుకూరు ఎస్సై బలమైన సామాజిక వర్గం కావడం వల్లనే కేవలం ఎస్ పి ఆఫీస్ కు అటాచ్ చేసి బీసీ అయిన రూరల్ సీఐపై సస్పెండ్ వేటు వేశారని విమర్శించారు.. రాజేష్ కేసులో తాము కులాలకు,మతాలకు అతీతంగా డీజీపీకి, ఎస్సీ కమిషన్ కు కేసులో తమ వాళ్ళు ఉన్న చర్యలు తీసుకోమని ఫిర్యాదు చేసామని తెలిపారు. ఎస్కార్ట్ వచ్చిన వారిపై కేసును నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నించిన పోలీస్ అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాంధీ ఆసుపత్రిలో ఎవరూ లేనట్టుగా ఆధిపత్య కులానికి చెందిన వ్యక్తితో పోస్టుమార్టం ఎందుకు చేశారని ప్రశ్నించారు.. అదే రోజు రాత్రి చిలుకూరు ఎస్సై పై పోస్టుమార్టం చేసిన డాక్టర్ ను ఎందుకు కలిశారో. పోస్టుమార్టం వీడియోను చిత్రీకరించేందుకు హైదరాబాద్ నగరంలో ఎవరూ లేనట్టుగా కోదాడ పట్టణానికి చెందిన వీడియో గ్రాఫర్ తో ఎందుకు వీడియో తీయించారని పేర్కొన్నారు.. ఆధిపత్య సామాజిక వర్గం కలిసి ఒక దళిత యువకుడి ని పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు....ఈ హత్య కేసులో అధికార పార్టీ నేతలు పెదవి విప్పకపోవటం దురదృష్టకరమన్నారు.. దళిత బిడ్డకు అన్యాయం జరుగుతుంటే ఎందుకుమౌనంగా ఉన్నారు సమాధానం చెప్పాలన్నారు... వారు రేపు మాదిగ వాడల్లో, పల్లెల్లో ఓట్లు ఎలాఅడుగుతారని ప్రశ్నించారు.... మాదిగ జాతి భవిష్యత్తు మరియు అస్తిత్వమే తమకు ముఖ్యమని, దీనిపై వెనకడుగు వేసే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. లాక్ అప్ డెత్ కేసులో బాధ్యులైన వారందరిపై హత్య నేరం మోపి 302, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి సర్వీస్ నుంచి పూర్తిగా తొలగించాలన్నారు.. లేనిపక్షంలో తాము ఇప్పటి వరకు శాంతియుతంగా నిరసన తెలిపామని ఇకపై రోడ్డు ఎక్కి తాడోపేడో తేల్చుకుంటామని హెచ్చరించారు.




# సాయి హై స్కూల్‌లో ఘనంగా సైన్స్ ఫెయిర్

## ప్రతిభ కనబరిచిన విద్యార్థులు.. ఆకట్టుకున్న సైన్స్ ప్రాజెక్టులు

**అమీన్‌పూర్, డిసెంబర్ 20 (నినాదం):**
అమీన్ పూర్ మండల పరిధిలోని సాయి హై స్కూల్లో శనివారం ఘనంగా సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. వివిధ తరగతుల విద్యార్థులు విజ్ఞాన ప్రదర్శనలో పాల్గొన్నారు. విద్యార్థులు స్వయంగా రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకర్షణగా నిలిచాయి. ఉపాధ్యాయుల మార్గదర్శకత్వంలో నిర్వహించిన సైన్స్ ఫెయిర్ లో విద్యార్థులు రూపొందించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి తల్లిదండ్రులు స్థానికులు భారీగా హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులు ఉపాధ్యాయుల తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు పొందారు. రమేష్ బాబు మాట్లాడుతూ... భవిష్యత్తులో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి ఉద్యోగాలు సంపాదించాలని ఆయన ఆకాంక్షించారు. తల్లిదండ్రులను, గురువులను గౌరవించి ప్రయోజకులు కావాలని ఆయన అన్నారు. ఇలా రకరకాల ప్రతిమలు నిర్వహించిన సాయి హై స్కూల్ విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


# ప్రమాదాల నివారణకు సమగ్ర ప్రణాళిక రూపొందించాలి

## ట్రాఫిక్ నియమాలు పాటించేలా అవగాహన కల్పించాలి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, డిసెంబర్ 20 (నినాదం):**
రహదారి ప్రమాదాల నివారణకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం ఐడీఓసీ కార్యాలయంలో పోలీస్, రవాణా, ఆర్టీసీ, వైద్య, విద్యా, సంక్షేమ శాఖలు, ఆర్ అండ్ బి, జాతీయ రహదారులు, మున్సిపల్, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన రహదారి భద్రత జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న రహదారి ప్రమాదాలపై సమీక్ష నిర్వహించి, ప్రమాదాలకు కారణాలు గుర్తించి వాటి నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన ఇంజినీరింగ్ మార్పులు చేపట్టాలని, వేగ నియంత్రణ, హెల్మెట్ సీటు బెల్ట్ వినియోగాన్ని కఠినంగా అమలు చేయాలని అన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, మద్యం సేవించి వాహనం నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి రహదారి భద్రతా కార్యాచరణ ప్రణాళికను రూపొందించి అమలు చేయాలని సూచించారు. పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు రహదారి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై పోటీలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గుర్తించిన 10 బ్లాక్ స్పాట్స్ ను పోలీస్, రవాణా, రహదారుల అధికారులు పరిశీలించి ఇంటర్ వెన్షన్స్ తయారు చేయాలని సూచించారు. రహదారులపై సైన్ బోర్డ్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జనవరి 2026 చేపట్టనున్న రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహణకు శాఖల వారిగా కార్యాచరణ తయారు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఎస్పీ నరేష్ కుమార్, ఆర్టీఓ సంధాని, ఆర్టీసీ డిఎం ఇందు, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, జిల్లా వైద్యాధికారి డా మధుసూదన్, డీఈఓ రాజేందర్, జాతీయ రహదారుల డీఈ కిరణ్, ఐఆర్డీ డిఆర్ఎం లక్ష్మణ్, అన్ని శాఖల సంక్షేమ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అష్టకష్టాలు పడుతున్న.. ఆసరాగా నిలవండి సారూ



**నూతనకల్, డిసెంబర్ 20 (నినాదం):**
కాళ్లు చేతులు పనిచేయక పుట్టుకతోనే కాళ్లు చెయ్యి వంకర రావడంతో కూలీ పనికి శరీరం సహకరించక ఏండ్లుగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నానని అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఆసరాగా నిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు... వివరాల్లోకి వెళ్తే మండల పరిధిలోని కొత్త తండా గ్రామపంచాయతీ భాగ్య తండా ఆవాసం గుగులోతు సైదా 35 ఏళ్ల వయస్సు 2015 లో దివ్యాంగుడిగా గుర్తింపు కోసం సదరం శిబిరానికి హాజరైండు.సదరం వైద్యులు 85 శాతం వైకల్యం ఉన్నట్లు నిర్ధారించారు.అయినా అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఆసరాగా నిలవటం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. గత్యంతరం లేక తమ సమస్యను ఏకరవు పెట్టారు.అన్ని అర్హతలు ఉన్న తనకు ఆసరా పింఛన్ ఇప్పించాలని ఉన్నతధికారులను కన్నీళ్లు పెట్టుకుంటూ సమస్యల సుడిగుండంలో చిక్కుకోవడంలో ఆ పేద కుటుంబం దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నారు.బాధలు దిగమింగుకొని భార్య ఇద్దరు ఆడపిల్లలను పోషించుకోవడానికి అవస్థలు పడుతున్నానని,కష్టంగా సంసారాన్ని నెట్టుకొస్తున్నారని జీవనం సాగించేందుకు ఎలాంటి ఆస్తిపాస్తులు లేవని సైదా భార్య ఆవేదనను వెలిబుచ్చారు.



# జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను విజయవంతం చేయాలి

## జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

**కరీంనగర్, డిసెంబర్ 20(నినాదం)**
జనవరి 1 నుండి నిర్వహించే జాతీయ రహదారి భద్రతా మాస ఉత్సవాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు.జాతీయ రహదారి భద్రత మాస ఉత్సవాలపై రవాణా, ఆర్ అండ్ బి, వైద్యశాఖ, ఆర్టీసీ, ఎక్సైజ్, పోలీస్ విద్యాశాఖ తదితర అధికారులతో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రోడ్డు భవనాల శాఖ అధికారులు నోడల్ ఆఫీసర్లుగా ఉంటూ మాస ఉత్సవాల నిర్వహణకు ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఆర్ అండ్ బి, పోలీస్ అధికారులు సమన్వయంతో నగరంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న చోట్లను గుర్తించాలన్నారు. గత ఏడాది గుర్తించిన బ్లాక్ స్పాట్ల వద్ద తీసుకున్న చర్యలు వివరించాలని తెలిపారు. పాఠశాలలో, కళాశాలలో రోడ్డు భద్రతకు సంబంధించిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల అవగాహన కోసం గత ఏడాది 2800 మంది విద్యార్థులు ట్రాఫిక్ పార్కును సందర్శించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ ఏడాది కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగించాలని తెలిపారు. ఆర్టీసీ, పాఠశాల బస్సులలో తప్పనిసరిగా ఫస్ట్ ఎయిడ్ కిట్ ఉండాలని అన్నారు.ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్టీసీ ఆర్.ఎం రాజు, డిప్యూటీ ట్రాన్స్పోర్ట్ కమిషనర్ పురుషోత్తం, జిల్లా వైద్యాధికారి వెంకట రమణ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# వెన్నులో వణుకు పుట్టించేలా ఈషా



త్రిగుణ్, హెబ్బాపటేల్ కీలక పాత్రల్లో రానున్న హారర్ థ్రిల్లర్ 'ఈషా'. శ్రీనివాస్ మన్నె దర్శకుడు. ఆ హారర్ థ్రిల్లర్ డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో విడుదలకు ముందు ఆసక్తికరమైన వీడియోను టీమ్ పంచుకుంది. ఆత్మ అంటే అదేనేమో అంటూ హీరోయిన్ చెప్పే డైలాగు భయపెట్టేలా ఉంది. ఇటీవల 'లిటిల్ హార్ట్స్', 'రాజు వెడ్స్ రాంబాయి' వంటి వరుస కల్ట్ హిట్స్ అందించిన సక్సెస్‌ఫుల్ జోడీ బన్నీ వాస్, వంశీ నందిపాటి. కలిసి ఇప్పుడు ప్రేక్షకులకు ఒక క్రేజీ హారర్ అనుభూతిని పంచడానికి సిద్ధమయ్యారు. వీరి సరికొత్త హారర్ థ్రిల్లర్ 'ఈషా' డిసెంబర్ 25న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ చిత్రం గురించి మేకర్స్ తాజాగా 'వార్నింగ్ వీడియో' పేరిట ఒక ఆసక్తికరమైన వీడియోను విడుదల చేశారు. సాధారణంగా హారర్ సినిమాలకు ట్రైలర్లు రావడం సహజం, కానీ ఇలా ప్రత్యేకంగా హెచ్చరిక వీడియో రావడం హారర్ జానర్‌లోనే ఇదే తొలిసారి. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఆత్మలు, దెయ్యాలు లేవని బలంగా నమ్మే కొందరు స్నేహితుల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. సమాజంలోని మూఢనమ్మకాలను, దొంగ బాబాలను ఎండగట్టాలని వారు భావిస్తారు. ఈ క్రమంలో వారికి పృథ్వీరాజ్ (బబ్లూ) నుంచి ఒక సవాలు ఎదురవుతుంది. 'ఆత్మలు ఉన్నాయని నిరూపిస్తే..?' అంటూ ఆయన విసిరే ఛాలెంజ్‌తో ఈ స్నేహితుల బృందం ఒక చీకటి ప్రపంచం లోకి అడుగుపెడుతుంది. మనుషుల్లాగే కొన్ని స్థలాలు కూడా పుట్టుకతోనే శాపగ్రస్తమై ఉంటాయి.. కాలక్రమేణా అవి ఆత్మలకు నిలయాలుగా మారుతాయని దర్శకుడు శ్రీనివాస్ మన్నె ఇచ్చిన వార్నింగ్ ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచుతోంది. ట్రైలర్ మరియు ఈ వార్నింగ్ వీడియోలో కనిపించిన విజువల్స్ భయానకంగా ఉన్నాయి. ముఖ్యంగా పాడుబడిన బంగ్లా, క్షుద్ర పూజల సెటప్, బ్లూ అండ్ డార్క్ థీమ్ విజువల్స్ వెన్నులో వణుకు పుట్టిస్తున్నాయి.సంతోష్ లైటింగ్, ధృవన్ అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ సినిమాలోని భయాన్ని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో ఉండే సడన్ ట్విస్ట్‌లు చూసి భయపడే అవకాశం ఉన్నందున, గుండె బలహీనంగా ఉన్నవారు ఈ సినిమా చూడకూడదని చిత్ర బృందం స్పష్టం చేసింది.



NINADAM CINEMA

# ఆనాటి ఘటనలు తలచుకుంటేనే భయమేస్తోంది


## నటి రాధికా ఆప్టే సంచలన వ్యాఖ్యలు

బాలీవుడ్‌తో పాటు సౌత్ చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రాధికా ఆప్టే. సినీ రంగంలో తన ఇరవై ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా చేసిన సంచలన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. కెరీర్ ఆరంభంలో తాను ఎదుర్కొన్న వివక్ష అలాగే బాడీ షేమింగ్ గురించి ఆమె ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ రోజులు గుర్తుకు వస్తే ఇప్పటికీ తన గుండె ఆగిపోయినంత పని అవుతుందని వ్యాఖ్యానించారు. ముఖ్యంగా 2000వ దశకం చివరలో ఆర్థిక ఇబ్బందుల వల్ల కొన్ని దక్షిణాది సినిమాల్లో నటించాల్సి వచ్చిందని, అప్పుడు షూటింగ్ సెట్స్‌పై ఉన్న పరిస్థితులు అత్యంత దారుణంగా ఉండేవని ఆమె పేర్కొన్నారు. ఒక చిన్న ఊరిలో జరిగిన షూటింగ్ సమయంలో సెట్ అంతా మగవారే ఉండేవారని, అక్కడ తన శరీరాకృతి గురించి అసభ్యకరమైన వ్యాఖ్యలు చేసేవారని రాధిక వెల్లడిరచారు. సెట్‌లో ఉన్నవాళ్లు నా బమ్స్ మరియు బ్రెస్ట్స్ దగ్గర ప్యాడింగ్ పెంచమని అడిగేవారు. 'అమ్మా.. మోర్ ప్యాడింగ్' అని పిలిచేవారు. ఆ మాటలు విన్నప్పుడు తనకు నవ్వాలో ఏడవాలో అర్థమయ్యేది కాదని రాధికా వాపోయింది. అప్పట్లో తనకు రక్షణగా మేనేజర్లు, ఏజెంట్లు ఎవరూ లేకపోవడంతో ఒంటరిగా ఆ మానసిక వేదనను అనుభవించానని, ఆ పరిస్థితులు తనను ఇప్పటికీ మానసిక గాయానికి గురిచేస్తాయని ఆవేదన చెందారు. హిందీ పరిశ్రమలో కూడా కొందరు ప్రభావవంతమైన వ్యక్తుల ప్రవర్తన నచ్చక తానంతట తానే పెద్ద ప్రాజెక్టుల నుంచి తప్పుకున్నానని, ఒకవేళ వారి పేర్లు బయటపెడితే ప్రపంచమంతా షాక్ అవుతుందని ఆమె తెలిపింది. పరిశ్రమలో ఉన్నత స్థాయిలో ఉన్న మహిళలు కూడా వ్యవస్థను మార్చడానికి ప్రయత్నించకపోవడం విచారకరమని అభిప్రాయపడిన రాధికా ఆప్టే, ప్రస్తుతం తన తాజా చిత్రం 'సాలీ మొహబ్బత్' జీ5లో స్ట్రీమ్ అవుతున్న సందర్భంగా ఈ విషయాలను పంచుకుంది.

**మళయాల దర్శకుడు, నటుడు**


# శ్రీనివాసన్ కన్నుమూత

మలయాళ చిత్ర పరిశ్రమలో తీవ్ర విషాదం నెలకొంది. ప్రముఖ సీనియర్ నటుడు, దర్శకుడు, స్క్రీన్ ప్లే రచయిత శ్రీనివాసన్ కన్నుమూశారు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ శనివారం తుదిశ్వాస విడిచారు.



నటుడిగా, దర్శకుడిగా, కథా రచయితగా ఐదు దశాబ్దాల పాటు కేరళ చిత్ర పరిశ్రమకు ఆయన సేవలు అందించాడు. 'వడక్కునోక్కియంత్రం', 'చింతవిశిష్టాయ శ్యామల' వంటి చిత్రాలకు ఆయన దర్శకత్వం వహించడమే కాకుండా రాష్ట్ర, జాతీయ అవార్డులను కూడా అందుకున్నారు. శ్రీనివాసన్ ఇద్దరు కుమారులు వినీత్ శ్రీనివాసన్, ధ్యాన్ శ్రీనివాసన్ కూడా మలయాళ చిత్ర పరిశ్రమలో నటులుగా, దర్శకులుగా రాణిస్తున్నారు. శ్రీనివాసన్ మృతి పట్ల కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, నటులు మోహన్ లాల్, మమ్ముట్టి సహా పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఆంధ్రా కింగ్ తాలూకా



రామ్ పోతినేని, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రల్లో నటించిన తాజా చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'.. తెలుగు సినీ అభిమాని కథగా నవంబర్ 27న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం మంచి విజయాన్ని అందుకుంది. అయితే ఈ సినిమా విడుదలై నెల కూడా తిరక్కుండానే ఓటీటీలోకి రాబోతుంది. ప్రముఖ ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్‌లో డిసెంబర్ 25 నుంచి తెలుగు, హిందీ, తమిళ్, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. విషయాన్ని తెలుపుతూ నెట్‌ఫ్లిక్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. మహేశ్‌బాబు.పి దర్శకత్వం వహించిన ఈ సినిమాలో కన్నడ స్టార్ ఉపేంద్ర కీలక పాత్రలో నటించాడు.

# సామాజిక సందేశంతో వస్తోన్న దండోరా

గ్రామీణ నేపథ్యంలో సాగే సందేశాత్మక చిత్రాలకు తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారన్న విషయం తెలిసిందే. తాజాగా అదే కోవలో తెలంగాణ సంస్కృతి, సామాజిక అంశాల కలబోతగా వస్తున్న చిత్రం 'దండోరా'. మురళీకాంత్ దర్శకత్వంలో రవీంద్ర బెనర్జీ ముప్పానేని నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 25న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నైజాం ఏరియాలో విడుదల చేస్తుండటం సినిమాపై మరింత అంచనాలను పెంచింది. విదేశాల్లో కూడా ఈ సినిమా భారీ ఎత్తున విడుదల కానుంది. సుమారు 200కు పైగా థియేటర్లలో ప్రదర్శితం కాబోతున్న ఈ చిత్రానికి సంబంధించి, ఈ నెల 23నే అక్కడ ప్రీమియర్స్ పడనున్నాయి. అయితే ఈ సినిమా విడుదలకు ఇంకా వారం కూడా లేకపోవడంతో తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్.



Printed, Published & Owned by B.Srinivas, Printed at Sree Seshasai Enterprises Plot no.98/1, Co-operative Industrial Estate, Gandhi Nagar, Near Balanagar Medchel, Malkajgiri Dist. Hyderabad 500037 (T.S)
Published at Plot S11, 3rd Floor, Ballard Estate Margadarshi Building Tarnaka Secundrabad, Hyderabad 500 007 (T.S), Editor : B.Srinivas, PRGI.REGN.NO. APTEL /2003/11288, CELL : +91 8333068787